ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 18.09.2026 | సంపుటి : 13 సంచిక : 59 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# ధిక్కారస్వరం వినిపించిన నేల.. తెలంగాణ

ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్



## తరతరాల అణిచివేత,దోపిడీ,పెత్తందారీ విధానాలపై తిరగబడిన ఆనాటి యోధులు

నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు తెలంగాణ పుట్టినిల్లు. అస్థిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల చైతన్యాన్ని రగిల్చింది. సమ్మక్క-సారలమ్మ పోరాటం నుంచి సాయుధ పోరాటం వరకు అన్యాయాన్ని ఎదిరించడం ఈ గడ్డ స్వభావం. సుదీర్ఘ పోరాట చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక స్థానముంది. నిజాం పాలనలో హైదరాబాద్ ప్రపంచ స్థాయి గుర్తింపు పొందింది. అదే సమయంలో గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరి, అణచివేతలు.. చివరి దశలో ప్రజలను కల్లోల పరిచాయి. భారతదేశంలో అంతర్భాగం కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలపడింది. రజాకారుల ఆగడాలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి కోసం కమ్యూనిస్టులు పోరాడారు.- సీఎం రేవంత్

- నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి వీరులకు పుట్టినిల్లు మన రాష్ట్రం
- కృష్ణా నదీ జలాల్లో తెలంగాణ వాటా కోసం న్యాయ పోరాటం చేస్తున్నాం
- పెండింగ్ ప్రాజెక్టులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం
- గన్‌పార్కు అమరవీరుల స్థూపం వద్ద సీఎం నివాళులు

**హైదరాబాద్(జనంసాక్షి):** తరతరాల అణచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ అని అభివర్ణించారు. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ప్రజా చైతన్యాన్ని రగిలించిందని తెలిపారు. సెప్టెంబరు 17వ తేదీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి మిగతా 2లో..

## ఫ్యూచర్ సిటీలో ఎడ్యుకేషన్ హబ్‌ను తీర్చిదిద్దుతున్నాం



యూకే బిజినెస్ స్కూల్స్ బృందంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ 2లో..

# 2004 ఎన్నికల అఫిడవిట్‌లో కేసీఆర్‌కు ఎకరం భూమిలేదు

## నేడు ఇన్ని కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి?

- అంటే తప్పులు రాశారా?
- ఉద్యమకారుల త్యాగాల పునాదులపై లక్షల కోట్ల ఆస్తులు సంపాదించారు
- మంత్రి పొంగులేటి ధ్వజం



**హైదరాబాద్(జనంసాక్షి):** బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఉద్యమకారులకు అప్పులే మిగిలాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉద్యమకారులకు ఆస్తులు తగ్గితే.. కేసీఆర్‌కు రూ.లక్షల కోట్లు వచ్చాయని ఆరోపించారు. సీఎం రేవంత్, ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శల నేపథ్యంలో పొంగులేటి స్పందించారు."2004 వరకు కేసీఆర్‌కు ఒక్క ఎకరా భూమి కూడా లేదు. ఎకరా భూమి కూడా లేదని ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కేసీఆర్‌కు ఇప్పుడు వేల కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఎన్నికల అఫిడవిట్ ద్వారా కల్వకుంట్ల ముఠా అడ్డంగా దొరికింది. పుట్టుకతోనే కేసీఆర్‌కు వందల ఎకరాలు ఉన్నాయని కేటీఆర్ అంటున్నారు. అలాంటప్పుడు అఫిడవిట్‌లో తప్పులు రాశారా?లేకుంటే ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారా? ఉద్యమకారుల త్యాగాల పునాదులపై రూ.లక్షల కోట్ల ఆస్తులు సంపాదించారు" అని పొంగులేటి ప్రశ్నించారు.

# కేసీఆర్ ఫాంహౌజ్ భూములపై విచారణ షురూ..

మాజీ సీఎం వ్యవసాయ క్షేత్రం పరిసరాల్లో ప్రభుత్వ భూముల వివరాలు సేకరణ



**మర్కుక్(జనంసాక్షి):** కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం పరిసరాల్లో ప్రభుత్వ భూముల వివరాలు సేకరిస్తున్నారు. సర్వే నెంబర్లు, గతంలో ఉన్న రైతుల పేర్లు, ప్రస్తుత రెవెన్యూ రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నారు. నివేదికలు సిద్ధం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలోని మర్కుక్ మండలం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు సంబంధించిన భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ ఫామ్ హౌస్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ మిగతా 2లో..

# జ్యుడీషియల్ విచారణకు సిద్ధం

## మీ,మా ఆస్తులపై విచారణ జరిపించండి కేసీఆర్‌పై సీఎం రేవంత్ విషప్రచారం

## ఆయన చట్టప్రకారం కొనుగోలు చేసిన భూములపై సీఎం బురద చల్లుతున్నారు:కేటీఆర్



**హైదరాబాద్(జనంసాక్షి):** మాజీ సీఎం కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ సీఎం రేవంత్‌రెడ్డి విష ప్రచారం చేశారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కేసీఆర్‌కు 67 ఎకరాలు మాత్రమే ఉందని అసెంబ్లీ సాక్షిగా సీఎం అంగీకరించారని చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. "ఇన్ని రోజులు విష ప్రచారం చేసినందుకు కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి. కేసీఆర్ పుట్టినప్పటి నుంచి మా కుటుంబ ఆస్తులెన్నో విచారణకు మేం సిద్ధం. రేవంత్ పుట్టినప్పుడు ఆయన ఆస్తులెన్ని.. ఇప్పుడు ఎన్నో విచారణకు సిద్ధమా? కేసీఆర్‌కు వ్యవసాయం అంటే మక్కువ. సీఎంగా ఉన్నా వ్యవసాయం చేశారు. రేవంత్‌లా భూమిని ఆయన ఆట వస్తువుగా చూడలేదు. చట్టప్రకారం కేసీఆర్ కొనుగోలు చేసిన భూములపై సీఎం బురద చల్లుతున్నారు. ఈ క్రమంలో రేవంత్ సెల్ఫ్ గోల్ వేసుకున్నారు. కేసీఆర్ తండ్రికి వందల ఎకరాలు ఉండేవి. అప్పట్లోనే కేసీఆర్ ఇల్లు రెండెకరాల్లో ఉండేది. చింతమడకలోని ఆ ఇంటిని కూడా ప్రభుత్వ స్కూల్‌కి ఇచ్చారు. ఎన్ని ఆరోపణలు చేసినా 22ఏ బాధితుల పక్షానే నిలబడతాం. ప్రభుత్వం చేసిన తప్పులను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉంటాం" అని కేటీఆర్ అన్నారు.

**కేసీఆర్ ఇల్లు రెండు ఎకరాల్లో ఉండేది**

కేసీఆర్ పుట్టినప్పుడే ఆయన ఇల్లు రెండు ఎకరాల్లో ఉండేది. కేసీఆర్ తండ్రికి వందల ఎకరాల భూమి ఉండేది. చింతమడకలో ఉన్న రెండెకరాల ఇంటిని కూడా ప్రభుత్వ పాఠశాలకు కేసీఆర్ రాసిచ్చారని గుర్తు చేశారు. గోడల మీద మిగతా 2లో..

# ఏసీబీకి పట్టుబడ్డ ఎస్ఐ, సీఐ..

## రూ.10లక్షలు డిమాండ్ చేసిన ఆంజనేయులు, జ్ఞానేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు



**మేడ్చల్ మల్కాజిగిరి(జనంసాక్షి):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి వేళ ఏసీబీ సోదాలు సంచలనం రేపాయి. సీఐ ఆంజనేయులు, ఎస్సై జ్ఞానేందర్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఓ కేసు విషయంలో నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు సీఐ రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో నిందితుడితో పనిచేయించుకున్నారు. కొన్ని రోజులు బిర్యానీలు, కూల్‌డ్రింక్స్ తీసుకురావాలంటూ వేధింపులకు గురిచేశారు. ఆ వేధింపులు తట్టుకోలేకపోయిన బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. మరోవైపు లంచం డబ్బు తీసుకునే బాధ్యతను ఎస్సైకు సీఐ అప్పగించారు. ఈ సమాచారంతో డీఎస్పీ మాజీద్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు.కీసర చెరువుగట్టు వద్ద నిమజ్జనం డ్యూటీలో ఉన్న ఎస్సై.. రూ. 5 లక్షలు లంచం తీసుకున్నాడు. అదే సమయంలో ఏసీబీ అధికారులు అక్కడికి రావడం చూసిన ఎస్సై అక్కడి నుంచి పరుగులు పెట్టాడు. కెమికల్ టెస్టులు చేయించుకోకుండా ముప్పుతిప్పలు పెట్టాడు. అనంతరం ఎస్సై జ్ఞానేందర్‌రెడ్డి, సీఐ ఆంజనేయులును ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.

# సెమీకండక్టర్ గ్లోబల్ హబ్‌గా భారత్

- కేవలం నాలుగేళ్లలోనే ఈ లక్ష్యాన్ని సాధించి చరిత్ర సృష్టించాం
- ఆవిష్కరణలు, పెట్టుబడులకు కొత్త అవకాశాలు రానున్నాయి
- ఈ రంగానికి యువతే కీలకం : మోదీ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత సెమీకండక్టర్ రంగం రెండో దశలోకి అడుగుపెట్టిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ స్థాయికి చేరుకోవడానికి ప్రపంచ దేశాలకు దశాబ్ద కాలం పట్టగా.. భారత్ మాత్రం కేవలం నాలుగేళ్లలోనే ఆ లక్ష్యాన్ని సాధించిందని తెలిపారు. సెమికాన్ ఇండియా సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."కమర్షియల్ చిప్‌ల ఉత్పత్తికి అవసరమైన సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ రంగంలో ప్రపంచ దేశాల నమ్మకాన్ని భారత్ సాధించింది. అంతర్జాతీయ భాగస్వామ్యాలతో సెమీకండక్టర్ విభాగంపై దేశ విశ్వాసం మరింత బలపడింది. ఈ రంగానికి యువతే కీలకం. మిగతా 2లో..



## ఎస్ఐ అభ్యర్థులకు రాత పరీక్ష నవంబర్ 29న..

### కానిస్టేబుల్ పోస్టులకు డిసెంబర్ 20న..

**హైదరాబాద్(జనంసాక్షి):** పోలీసు ఉద్యోగాలకు రాత పరీక్ష తేదీలను తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) విడుదల చేసింది. ఎస్ఐ అభ్యర్థులకు నవంబర్ 29న, మిగతా 2లో..



# కేంద్ర సర్కారు ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 ఆజాదీ

## మహనీయుల పోరాటాలు కొత్త తరానికి స్ఫూర్తి: ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్

**హైదరాబాద్(జనంసాక్షి):** భారత్‌లో హైదరాబాద్ అంతర్భాగం కావడానికి ఎంతోమంది మహనీయుల బలిదానం కారణమని ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. తొలుత పోలీసు అమరవీరుల స్మృతి స్తూపం వద్ద ఉపరాష్ట్రపతి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. ఆ తర్వాత సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ హైదరాబాద్ విముక్తి కోసం పోరాడిన యోధులకు నివాళులర్పిస్తున్నట్లు చెప్పారు. మహనీయుల పోరాటాలు కొత్త తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్రమంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అంతకుముందు సాయుధ బలగాల నుంచి ఉప రాష్ట్రపతి గౌరవవందనం స్వీకరించారు. విమోచన దినోత్సవం సందర్భంగా కళారూపాలు, వేయిస్తంభాల గుడి, బతుకమ్మ శకటాలను ప్రదర్శించారు.

**హైదరాబాద్-జోధ్‌పూర్‌కు మధ్య విడదీయరాని బంధం: షెకావత్**

హైదరాబాద్-జోధ్‌పూర్‌కు మధ్య విడదీయరాని బంధముందని కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తాను జోధ్‌పూర్ ప్రతినిధిగా ఇక్కడికి వచ్చానన్నారు. ఇక్కడ నిజాం కు వ్యతిరేకంగా అనేకమంది యోధులు పోరాటం చేశారన్నారు. స్వాతంత్ర్యం, స్వేచ్ఛ కోసం ఎంతో పోరాటం చేసి తెలంగాణను భారత్‌లో కలిపేందుకు కృషి చేశారన్నారు. అప్పట్లో నిజాంకు వ్యతిరేకంగా ఎంతోమంది వీరులు పోరాటం చేశారని గుర్తుచేశారు. మిగతా 2లో..

## భారత్‌పై 100 శాతం సుంకాల బిల్లుకు..

# అమెరికా ప్రతినిధుల సభ ఆమోదం





### ఇక ట్రంప్ సంతకమే తరువాయి



**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా నుంచి భారత్‌కు కొత్త సుం కాల ముప్పు ఎదురుకావడం ఖాయంగా కనిపిస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశా లపై 100 శాతం సుంకాలు విధించేందుకు అధ్యక్షుడికి వీలు కల్పించే రష్యా మిగతా 2లో..

## రష్యా నుంచి చమురు కొనడం ఆపండి

ఆ దేశంపై ఆధారపడటం తగ్గించుకోకపోతే అసాధారణమైన ఆర్థిక ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుంది.. భారత్, చైనాలకు అమెరికా అల్టిమేటం..

2లో..

## భారతీయుల ఇంధన భద్రతకు కట్టుబడిఉన్నాం

అమెరికా ఆంక్షలు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తాయి: కేంద్రం

## ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేంద్రం

# కొత్త డ్రామా

## యూపీఐ లావాదేవీల ఛార్జీల వ్యవహారంపై కాంగ్రెస్ విమర్శలు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** యూపీఐ లావాదేవీల ఛార్జీల వ్యవహారంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య తీవ్ర మాటల యుద్ధం నెలకొంది. రూ.2000లకు పైబడిన యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు వసూలు చేసే నిర్ణయానికి పార్లమెంటు స్థాయీ సంఘంలో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు మద్దతు పలికారన్న బీజేపీ వ్యాఖ్యలను హస్తం పార్టీ గురువారం ఖండించింది. యూపీఐ ఛార్జీలపై వెల్లువెత్తుతున్న ప్రజా వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే మోదీ సర్కార్ దిగజారుడు ఆరోపణలు చేస్తోందని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు.యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు వసూలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ అగ్రనేత, లోక్?సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే ఆర్థిక వ్యవహారాల పార్లమెంటు స్థాయీ సంఘంలో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు చిదంబరం, మనీశ్? తివారీ, గౌరవ్ గోగోయ్‌లు ఎండీఆర్ ఛార్జీలను సమర్థించారని, రాహుల్ ఎందుకు వ్యతిరేకిస్తున్నారని బీజేపీ నేతలు ప్రశ్నించారు. బీజేపీ చేస్తున్న ఈ వాదనలను గౌరవ్ గొగొయ్, మనీశ్ తివారీలు ఖండించారు. స్థాయీ సంఘం సమావేశంలో యూపీఐ ఛార్జీల ప్రతిపాదనపై ఎలాంటి చర్చ జరగలేదని మిగతా 2లో..

## కేంద్ర సర్కారు ఆధ్వరంలో సెప్టెంబర్ 17 ఆజాదీ

సీఎం రేవంత్ రెడ్డి నిజాంను పొగడటం సిగ్గుచేటు అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవంలో పాల్గొన్న ఆయన నిజాంలు అంత మంచివారైతే చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, మల్లు స్వరాజ్యం, రావి నారాయణరెడ్డి వారిపై ఎందుకు పోరాటం చేశారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. నిజాం పాలన పోయినా నిజాం వారసత్వమైన మజ్లీస్ పార్టీ ఇంకా అరాచకాలు సృష్టిస్తోందన్నారు. 1980 నుంచి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ డిమాండ్ చేసిందని, గత ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. 2029లో గ్రామగ్రామాన ఈ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామన్నారు.

## జ్యుడీషియల్ విచారణకు సిద్ధం

పెయింట్ వేసుకునే నీకు జూబ్లీహిల్స్‌లో ప్యాలెస్ ఉండొచ్చు కానీ.. కేసీఆర్‌కు వ్యవసాయం చేసుకోవడానికి భూమి ఉండొద్దా అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు మొదటినుండే వందల ఎకరాలు ఉన్నాయి. కేసీఆర్ దొర అంటావా, లేక ఈ మధ్య సంపాదించు కున్నాడు అంటావా? ఏదో ఒకటి ఫిక్స్ అవ్వు రేవంత్ రెడ్డి అని సూచించారు. నేను అమెరికాలో ఆరున్నర సంవత్సరాలు ఉద్యోగం చేసి సంపాదించుకున్నాను. నువ్వు ఏమీ చేసి సంపాదించావు రేవంత్ రెడ్డి? అని నిలదీశారు.

## ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేంద్రం కొత్త డ్రామా

గౌరవ్ గొగొయ్ స్పష్టం చేశారు. 'ఆర్థిక సంఘం సభ్యులతో సమావేశమైనప్పుడు 'యూపీఐ పన్ను'కు సంబంధించి ఎటువంటి నిర్దిష్ట ప్రతిపాదు. అయితే, ఈ విధానాలు చిన్న వ్యాపారులకు, పారిశ్రామికవేత్తలకు తీవ్ర నష్టం కలిగించి, అమెరికన్ వంటి కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూరుస్తాయి' అని గొగొయ్ ఆరోపించారు.అమెరికన్ కంపెనీలను, డొనాల్డ్ ట్రంప్ ని తృప్తిపరచడానికి ఈ యూపీఐ ఛార్జీల నిర్ణయం తీసుకున్నారని జైరాం రమేశ్? విమర్శించారు. అలాగే, యూపీఐ ఛార్జీలపై వస్తున్న వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి కేంద్రం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ కూడా యూపీఐ ఛార్జీల విషయంపై ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎండీఆర్ రేట్లు, ఫీజులు, శ్లాబుల గురించి కమిటీ ముందుకు ఎలాంటి నిర్దిష్ట ప్రతిపాదన రాలేదని ఎంపీ మనీశ్ తివారీ చెప్పారు. అత్యంత రహస్యంగా ఉంచాల్సిన పార్లమెంటరీ స్టాండింగ్? కమిటీ చర్చలను ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఎండీఆర్? ఛార్జీల రేటు, దాని పనితీరు వంటి అంశాలపై కమిటీలోని కొంతమంది సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారని చెప్పారు.

ఎండీఆర్ అఖిలేశ్ యాదవ్ ధ్వజం

యూపీఐ లావాదేవీలపై విధించే ఎండీఆర్ ఛార్జీలపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కూడా తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో భారత్‌ను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు ప్రజల రోజువారీ లావాదేవీల నుంచి డబ్బులు వసూలు చేయాలని చూస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఎక్స్ పోస్ట్‌లో అఖిలేశ్ యాదవ్ ఇలా అన్నారు. "ఇతరుల సంపాదన నుంచి లాభం పొందాలనే ప్రయత్నంలో భాగంగా, బీజేపీ ఇప్పుడు జఖఎ చెల్లింపులపై రుసుములు వసూలు చేస్తోంది. ఇలాంటి విధానంతో ఎలాంటి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించగలరు?" అని ఎద్దేవా చేశారు. కాగా, ఆర్థిక వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సమావేశంలో కొందరు ప్రతిపక్ష ఎంపీలు ఈ ఛార్జీలను వ్యతిరేకించారని ఛైర్మన్ భర్తృహరి మెహతాబ్ తెలిపారు. బుధవారం నాటి సమావేశంలో యూపీఐ అంశం లేకపోయినా కొందరు ఎంపీలు ప్రస్తావించారని పేర్కొన్నారు. మరో నెలలో కొత్త కమిటీ ఏర్పడుతుందని, అప్పుడు ఈ అంశంపై చర్చిస్తారని ఆయన స్పష్టం చేశారు.

## సెమీకండక్టర్ గ్లోబల్ హబ్‌గా భారత్

వారి నైపుణ్యాలను మెరుగుపరచడంపైనే భారత్ ప్రత్యేక దృష్టి సారించింది. చిప్‌ల డిజైన్, తయారీలో యువతకు తగిన శిక్షణ ఇస్తున్నాం. సెమికండక్టర్ లక్ష్యాలను నెరవేర్చడంలో వారే కీలకం" అని మోదీ అన్నారు. ఇటీవల జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు కూడా భారత్‌పై ప్రపంచ దేశాల విశ్వాసాన్ని ప్రతిబింబించిందని ఆయన గుర్తు చేశారు. సెమికండక్టర్ ఇండియా-2026 ఈవెంట్ ఢిల్లీలో సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు కొనసాగనుంది. 52 దేశాల నుంచి 600 పైగా కంపెనీలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయి.

## ఎస్‌ఐ అభ్యర్థులకు రాత పరీక్ష నవంబర్ 29న..

కానిస్టేబుల్ పోస్టులకు డిసెంబర్ 20న రాత పరీక్ష నిర్వహించనున్నట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. హోంశాఖ పరిధిలోని పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్), అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో 7,437 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. పోలీసు ఉద్యోగాలకు రాష్ట్ర వ్యాప్తంగా 5,77,064 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్టు తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఛైర్మన్ వి.వి శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో ఎస్‌ఐ పోస్టులకు 1,60,756 మంది, కానిస్టేబుల్ పోస్టులకు 3,89,356 మంది దరఖాస్తు చేసుకున్నట్టు వివరించారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు.. ఓటరు జాబితా షెడ్యూల్ విడుదల

హైదరాబాద్(జనంసాక్షి):

తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబి తా షెడ్యూల్ విడుదలైంది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి- హైదరాబాద్, వరంగల్-ఖమ్మం- నల్గొండ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితాను ఈసీ విడుదల చేసింది. పట్టభద్రుల ఓట్ల నమోదు కోసం ఈ నెల 20న ఎన్నికల కమిషన్ పబ్లిక్ నోటీసు ఇవ్వనుంది. నవంబరు 6 వరకు ఓటరు దరఖాస్తులు స్వీకరించనుంది. నవంబరు 25న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయనుంది. నవంబరు 25 నుంచి డిసెంబరు 10 వరకు అభ్యంతరాలు స్వీకరించనుంది. డిసెంబరు 30న పట్టభద్రుల తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు.గతంలో ఓటున్న వారు కూడా మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) తెలిపారు. మార్చిలో ఎమ్మెల్సీలు వాణిదేవి, తీన్మార్ మల్లన్న పదవీ కాలం ముగియనుంది. రాష్ట్రంలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికలకు ఈసీ కసరత్తు చేపట్టింది. మహబూబ్‌నగర్-హైదరాబాద్- రంగారెడ్డితో పాటు వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియో జకవర్గాల్లో ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూలు ప్రకటించింది. ఎమ్మెల్సీలు వాణిదేవి, తీన్మార్ మల్లన్న పదవీకాలం మార్చితో ముగియనుండటంతో ఆ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు కొత్తగా ఓటర్ల జాబితా తయారు చేయనున్నారు.

డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా

ఈనెల 28న పట్టభద్రుల ఓట్ల నమోదు కోసం ఎన్నికల కమిషన్ పబ్లిక్ నోటీసు ఇవ్వనుంది. నవంబరు 6 వరకు ఓటు నమోదు కోసం పట్టభద్రుల నుంచి ఫారం 8 దరఖాస్తులు స్వీకరిస్తారు. నవంబరు 25న రెండు నియోజకవర్గాల్లో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తారు. నవంబరు 25 నుంచి డిసెంబరు 10 వరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తారు. డిసెంబరు 30న పట్టభద్రుల ఓటర్ల తుది జాబితాను ఈసీ ప్రకటించనుంది. గత జాబితాలో ఓటున్న పట్టభద్రులు కూడా మళ్లీ కొత్తగా ఫారం 8 సమర్పించాల్సిందేనని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో లేదా పోస్టుద్వారా అర్హత ధ్రువీకరణపత్రాలు పంపాలన్నారు.

# ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ

జాతీయ జెండా ఆవిష్కరించారు. అంతకు ముందు గన్‌పార్కులో అమరవీరుల స్థూపం వద్ద నివాళు లర్పించారు. సమ్మక్క-సారలమ్మ పోరాటం నుంచి సాయుధ పోరాటం వరకు అన్యాయాన్ని ఎదిరించడం ఈ తెలంగాణ గడ్డ స్వభావమని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. సుదీర్ఘ పోరాట చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక స్థానం ఉందని, నిజాం పాలనలో హైదరాబాద్ ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించిందన్నారు. అదే సమయంలో గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, అణచివేతలు చివరి దశలో రజాకార్ల దౌర్జన్యాలు ప్రజలను కల్లోల పరిచాయని గుర్తు చేశారు.భారతదేశంలో అంతర్భాగం కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలపడిందని, నిజాం ఆంధ్ర మహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు రగిలాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి కోసం కమ్యూనిస్టులు పోరాటం చేశారని అన్నారు. రావి నారాయణ రెడ్డి, భీంరెడ్డి నర్సింహా రెడ్డి, చాకలి ఐలమ్మ వంటి యోధులు పోరాటాలకు నాయకత్వం వహించడం గొప్ప విషయమన్నారు. హైదరాబాద్ ప్రజల ఆకాంక్ష మేరకు నెహ్రూ, పటేల్ నాయకత్వంలో సైనిక చర్య చేపట్టారని వివరించారు.తరతరాల అణచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ. అస్తిత్వం, ఆత్మ గౌరవం, హక్కుల కోసం ఈ నేల ప్రజా చైతన్యాన్ని రగిలించింది. సమ్మక్క-సారలమ్మ పోరాటం నుంచి సాయుధ పోరాటం వరకు అన్యాయాన్ని ఎదిరించడం ఈ గడ్డ స్వభావం.

అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలన

ఆపరేషన్ పోలో అనంతరం ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ భారత ప్రభుత్వానికి లొంగిపోయినట్లు సీఎం తెలిపారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ అధికారికంగా భారత్‌లో అంతర్భాగమైందన్నారు. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం సెప్టెంబరు 17వ తేదీ అని గుర్తుచేశారు.సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకుంటున్నామన్న సీఎం రేవంత్ రెడ్డి, ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజాపాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. తెలంగాణ పొరుగు రాష్ట్రాలతో కాకుండా ప్రపంచంతో పోటీపడుతోందని చెప్పారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18 లక్షలుగా ఉందని, దేశ తలసరి ఆదాయం కంటే 91 శాతం ఇది అధికమని అన్నారు.

2.25 లక్షల మందికి కొత్త పింఛన్లు


కృష్ణా నదీ జలాల్లో తెలంగాణ వాటా కోసం న్యాయ



పోరాటం చేస్తున్నామని, పెండింగ్ ప్రాజెక్టులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి తెలంగాణను సస్యశ్యామలం చేస్తామని సీఎం చెప్పారు. తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలని, ఆర్థిక స్వావలంబన సాధించాలనేది తమ ప్రభుత్వ ఆలోచన అని అన్నారు. 1.06 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, 2.25 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ప్రకటించారు. ప్రతి కుటుంబం ఆత్మ గౌరవంతో జీవించాలనేది తమ ప్రభుత్వ ఆశయమన్నారు. హైదరాబాద్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను రాష్ట్రపతి ఆమోదానికి పంపినట్లు గుర్తు చేశారు.

## కేసీఆర్ ఫాంహౌజ్ భూములపై విచారణ షురూ..

భూముల సర్వే నెంబర్లు, గతంలో ఉన్న రైతుల పేర్లు, ప్రస్తుత రికార్డులను రెవెన్యూ అధికారులు నివేదికల రూపంలో తయారు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించిన విషయం విదితమే. ఈ క్రమంలో ఎర్రవల్లి ఫామ్‌హౌస్?పై అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలోనే ఆర్డీవో చంద్రకళ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూమిని పరిశీలించారు. మర్కూక్ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఎర్రవల్లిలోని సర్వేనంబర్ 325లో ప్రభుత్వ భూములను పరిశీలించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై సీఎం రేవంత్ రెడ్డి విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. కేసీఆర్ ఫామ్?హౌస్?లో 295 ఎకరాల భూమి ఉందని సీఎం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వివరించారు. కేసీఆర్ కుటుంబ ఆస్తులకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. గత ప్రభుత్వంలో అక్రమంగా ఆస్తులు సంపాదించారని సీఎం ఆరోపించారు. 700 ఎకరాల ఫామ్‌హౌస్ కేసీఆర్‌కు ఉందా లేదా తేల్చాలని ఆయన ఆదేశించారు. 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కేసీఆర్ ఎందుకు చెప్పలేదని రేవంత్ రెడ్డి నిలదీశారు. ఫామ్‌హౌస్‌లోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచిపెడతానని, శుద్ధి చేసిన చోటే దళితులకు భూములిచ్చి యజమానులను చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పారు.



## ఫ్యూచర్ సిటీలో ఎడ్యుకేషన్ హబ్‌ను తీర్చిదిద్దుతున్నాం

హైదరాబాద్(జనంసాక్షి):

ప్రపంచ ప్రఖ్యాత 'హార్వర్డ్ యూనివర్సిటీ' హైదరాబాద్ లో ఔత్సాహికులకు ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను డిసెంబర్ నుంచి అందించనున్నట్టు గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణను 'గ్లోబల్ నాలెడ్జ్ హబ్'గా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని యూకే బిజినెస్ స్కూల్స్ బృందం భేటీలో అన్నారు.ఎంసీఆర్ హెచ్ ఆర్డీలో నిర్వహించిన భేటీలో యూకే హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడు కరణ్ బిలిమోరియా, బ్రిటిష్ కౌన్సిల్ డైరెక్టర్ జనక పుష్పనాథన్, చార్టర్డ్ అసోసియేషన్ ఆఫ్ బిజినెస్ స్కూల్స్ సీఈఓ ఫ్లోరా హామిల్టన్, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ప్రతినిధులతో సహా 30 మంది వివిధ యూకే యూనివర్సిటీ ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ యూకే బిజినెస్ స్కూల్స్ కు సంబంధించిన డీన్లు, ఉన్నత స్థాయి అధికారులతో చర్చిస్తూ, విశ్వవిద్యాలయాలకు అవసరాలకు తగ్గట్టు అన్ని రకాలుగా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఎంఐటీ, పర్డ్యూ వంటి పలు ఐవీ లీగ్ యూనివర్సిటీలు హైదరాబాద్ లో ఆఫ్ షోర్ క్యాంపస్ ఏర్పాటు ప్రక్రియ మొదలైందన్నారు.విదేశీ విద్యాసంస్థల రాకతో స్థానిక విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలతో కలిసి పనిచేయడానికి, ఇక్కడే పరిశోధనలు చేపట్టడానికి దోహదపడుతుందన్నారు. యూకే బిజినెస్ స్కూల్స్ తెలంగాణలో ఏర్పాటైతే ప్రపంచ స్థాయి కార్పొరేట్ వ్యాపార సంస్థలు రాష్ట్రం వైపు చూస్తాయని అన్నారు.అదే సమయంలో రాష్ట్ర విద్యార్థులు, అధ్యాపకులకు అంతర్జాతీయ సంస్థలు, అంతర్జాతీయ అనుభవం, ప్రపంచ స్థాయి అవకాశాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ దిశగా హార్వర్డ్, ఎంఐటి, లండన్ విశ్వవిద్యాలయం, వర్జీనియా టెక్, నార్త్‌ఈస్టర్న్ విశ్వవిద్యాలయం వంటి అనేక ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లు, డ్యూయల్ డిగ్రీ కోర్సులు, అధ్యాపకుల శిక్షణ, పరిశోధన వంటి రంగాల్లో భాగస్వామ్యాలు ప్రారంభించవచ్చున్నారు. అలాగే విద్యార్థులకు ఇంగ్లీష్, జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు కూడా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతకు అత్యాధునిక నైపుణ్య శిక్షణ అందించేందుకు భారత్ ఫ్యూచర్ సిటీలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీని దాదాపు 30,000 ఎకరాల విస్తీర్ణంలో, దేశంలోనే మొట్టమొదటి నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అక్కడ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుతో భావితరాలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. డిసెంబర్ లో అక్కడ నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026కు బృందానికి ఆహ్వానం పలికారు. యూకే విద్యా వ్యవస్థలో ముఖ్యులందరికీ గ్లోబల్ సమ్మిట్ కు ప్రత్యేకంగా ఆహ్వానించనున్నట్టు వివరించారు. దావోస్ లో నిర్వహించే వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ తరహాలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ అగ్రగామి సంస్థలు ముందుకొస్తున్నాయి. టీసీఎస్ 70 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటాసెంటర్ నిర్మించనుంది. లక్ష కోట్ల పెట్టుబడితో అమెజాన్ ఇప్పటికే డేటాసెంటర్ నిర్మాణం చేపట్టిందన్నారు.ప్రపంచంలోనే మేటి విశ్వ విద్యాలయాలు, ఫార్చ్యూన్-500 కంపెనీలు తెలంగాణాలో ఉండే విధంగా అడుగులు వేస్తున్నామన్నారు. నర్సరీ నుంచి ఉన్నత విద్య వరకు, అలాగే ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్స్ యూనివర్సిటీల ద్వారా యువతలో నైపుణ్యాలను పెంపొందించడం, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి వాటి ద్వారా విద్యా వ్యవస్థను సమూలంగా మార్చడమే ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యం గురించి ప్రస్తావించారు.

## స్టేషన్ బెయిల్‌కు లంచం.. రూ.10 లక్షలు

### డిమాండ్ చేసిన కీసర సీఐ, ఎస్సై అరెస్ట్

కీసర(జనంసాక్షి):

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి వేళ ఏసీబీ సోదాలు సంచలనం రేపాయి. సీఐ ఆంజనేయులు, ఎస్సై జ్ఞానేందర్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఓ కేసు విషయంలో నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు సీఐ రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో నిందితుడితో పనిచేయించుకున్నారు. కొన్ని రోజులు బిర్యానీలు, కూల్‌డ్రింక్స్ తీసుకురావాలంటూ వేధింపులకు గురిచేశారు. ఆ వేధింపులు తట్టుకోలేకపోయిన బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. మరోవైపు లంచం డబ్బు తీసుకునే బాధ్యతను ఎస్సైకు సీఐ అప్పగించారు. ఈ సమాచారంతో డీఎస్పీ మాజీద్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు.కీసర చెరువుగట్టు వద్ద నిమజ్జనం డ్యూటీలో ఉన్న ఎస్సై.. రూ. 5 లక్షలు లంచం తీసుకున్నాడు. అదే సమయంలో ఏసీబీ అధికారులు అక్కడికి రావడం చూసిన ఎస్సై అక్కడి నుంచి పరుగులు పెట్టాడు. కెమికల్ టెస్టులు చేయించుకోకుండా ముప్పుతిప్పలు పెట్టాడు. అనంతరం ఎస్సై జ్ఞానేందర్‌రెడ్డి, సీఐ ఆంజనేయులును ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.

## యూట్యూబర్ వైష్ణవి భర్త దారుణహత్య

నిజామాబాద్ (జనంసాక్షి):

యూట్యూబర్ వైష్ణవి హత్యకేసు లో నిందితుడు, ఆమె భర్త చిత్త రి హరిబాబు(26) నిజామాబా ద్ నగరంలో దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత కొన్ని రోజులుగా హరిబా బు తన తల్లితో కలిసి నిజా మాబాద్ ఐదో ఠాణా పరిధిలోని ఇంద్రాపూర్లో నివాసం ఉంటున్నాడు. రాజరాజేంద్ర చౌరస్తాలో మక్కబుట్టలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగే గురువారం మక్కబుట్టలు అమ్ముకుంటున్న క్రమంలో.. దాహం వేసి నీళ్ల కోసం పక్కనే ఉన్న చాట్‌బండి వద్దకు వెళ్లాడు. అదే సమయంలో ఓ కారులో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆయన తలపై పదునైన ఆయుధంతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన హరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కారులో ముగ్గురు వ్యక్తులు ఉండగా... ఓ వ్యక్తి వచ్చి పదునైన ఆయుధంతో తలపై నరికిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. నిందితుడు 10 సెకన్లలో 9 సార్లు కత్తితో నరికిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన వైష్ణవి (19), కోరుట్ల పట్టణం ఏసుకోనిగుట్టకు చెందిన చిత్తరి హరిబాబు(26)కి వివాహం జరిగింది. నాలుగు నెలల గర్భిణిగా ఉన్న వైష్ణవి గొంతు నులిమి, చేతులు, నుదిటిపై కత్తితో పొడిచి హత్య చేసినట్లు హరిబాబుపై ఆరోపణలున్నాయి. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు హరిబాబును అరెస్టు చేశారు. ప్రస్తుతం బెయిల్‌పై జైలు నుంచి బయటికొచ్చిన నిందితుడు ఇవాళ దారుణహత్యకు గురయ్యాడు.

# భారత్‌పై 100 శాతం సుంకాల బిల్లుకు.. అమెరికా ప్రతినిధుల సభ ఆమోదం

ఆంక్షల బిల్లుకు ప్రతినిధుల సభలో ఆమోదం లభించింది. 262-159 ఓట్ల తేడాతో బిల్లు పాస్ అయింది. ఆగస్టులోనే సెనెట్ ఈ బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దీనిపై సంతకం చేయడమే తరువాయి. దివంగత సెనెటర్ లిండ్సే గ్రాహమ్ పేరు మీదుగా శాంక్షనింగ్ రష్యా ఇరాన్ యాక్ట్ 2026ను తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ముగించేలారష్యాపై ఒత్తిడి పెంచడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యం. అప్పట్లో దీనిని ట్రంప్ ఆర్థిక బంకర్ బస్టర్‌గా అభివర్ణించారు. రష్యా అధికారులు, ఆర్థిక సంస్థలు, ఇంధన ప్రాజెక్టులు లక్ష్యంగా ఈ బిల్లును రూపొందించారు. దీనికింద ఆంక్షల నుంచి తప్పించుకుంటూ రష్యా చమురును అంతర్జాతీయ మార్కెట్లకు తరలించే రహస్య నౌకలపై కఠిన చర్యలు తీసుకుంటారు. ఇరాన్ ఇంధన, ఆయుధ రంగానికి నిధులు అందకుండా గతంలో ఉన్న ఆంక్షలను 2031 వరకు పొడిగించారు. రష్యా నుంచి అత్యధికంగా ముడి చమురు, సహజ వాయువును కొనుగోలు చేసే దేశాలపై గరిష్టంగా 100% వరకు పెనాల్టీ సుంకాలు విధించే అసాధారణ అధికారం ట్రంప్‌నకు లభించనుంది. ప్రస్తుతం రష్యా చమురును ప్రపంచంలోనే అత్యధికంగా కొనుగోలు చేస్తున్న దేశాల్లో చైనా మొదటి స్థానంలో ఉండగా, భారత్ రెండో స్థానంలో ఉంది. ఇప్పుడు ఈ బిల్లు అధ్యక్షుడి సంతకంతో చట్టరూపం దాల్చిన తర్వాత కూడా రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు కొనసాగిస్తే.. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువులపై ట్రంప్ సర్కార్ 100 శాతం వరకు అదనపు పన్నులు విధించే ముప్పు పొంచి ఉంది.

## భారతీయుల ఇంధన భద్రతకు కట్టుబడిఉన్నాం

### అమెరికా ఆంక్షలు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తాయి

### 100% టారిఫ్ ముప్పుపై కేంద్రం స్పందన

న్యూఢిల్లీ(జనంసాక్షి):రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల ఎగుమతులపై 100 శాతం టారిఫ్‌లకు వీలుకల్పించే బిల్లుకు అమెరికా చట్టసభల్లో ఆమోదం లభించింది. దీనిపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేస్తే.. భారత్‌పై నూరుశాతం సుంకాలు పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ ఆంక్షల బిల్లును ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని వెల్లడించింది. "గతంలో చెప్పినట్టుగానే భారత్ తన 140 కోట్లమంది ప్రజలకు ఇంధన భద్రతను కల్పించడానికి కట్టుబడి ఉంది. మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వేర్వేరు వనరుల నుంచి ఇంధన దిగుమతులను కొనసాగిస్తాం. రష్యాతో చమురు వాణిజ్యం అంశంపై అమెరికా ప్రతినిధులతో ఇప్పటికే చర్చించాం. ద్వైపాక్షిక సంబంధాలపై మాత్రమే కాకుండా అంతర్జాతీయ ఇంధన మార్కెట్ల స్థిరత్వంపై కూడా ఈ బిల్లు ప్రభావం చూపించే అవకాశం ఉందని స్పష్టంగా తెలియజేశాం.భారత వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలను భారత ప్రభుత్వం తీసుకుంటుందని యూఎస్‌కు ఇప్పటికే చెప్పాం. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే భారత వాణిజ్యంపై పడే ప్రభావాలను ఎదుర్కొనేందుకు సంబంధిత సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం" అని కేంద్ర విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది.అమెరికా తీసుకుంటున్న ఇలాంటి చర్యలు ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తాయని తాము ముందుగానే వాషింగ్టన్‌ను హెచ్చరించినట్లు న్యూఢిల్లీ పేర్కొంది. ఈ బిల్లు ఆమోదాన్ని గమనించామని, దీనివల్ల ద్వైపాక్షిక సంబంధాలపై, అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై పడే ప్రభావం గురించి గత కొన్ని నెలలుగా అమెరికన్ అధికారులతో జరిగిన చర్చల్లో చాలా స్పష్టంగా వివరించామని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భారత వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కూడా ఆ ప్రకటనలో ప్రభుత్వం స్పష్టంచేసింది.దేశంలోని వాణిజ్య, పారిశ్రామిక సంస్థలతో కలిసి ఈ చట్టంవల్ల కలిగే పరిణామాలను ఎదుర్కొంటామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. తమ భారీ జనాభా, ఆర్థిక వ్యవస్థ అవసరాల దృష్ట్యా సురక్షితమైన, సరసమైన, నమ్మకమైన ఇంధన సరఫరాలు అత్యవసరమని భారత్ తన వైఖరిని తెలియజేసింది.

## రష్యా నుంచి చమురు కొనొద్దు

వాషింగ్టన్(జనంసాక్షి):రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలకు డొనాల్డ్ ట్రంప్ సర్కారు హెచ్చరికలు చేసింది. రష్యాపై ఆధారపడటం తగ్గించుకోకపోతే అసాధారణమైన ఆర్థిక ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంది. రష్యా చమురును ఇతర దేశాలు కొనుగోలు చేయకుండా కొత్త ఆంక్షలతో కూడిన బిల్లును యూఎస్ కాంగ్రెస్ ఆమోదించిన నేపథ్యంలో తాజా పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అమెరికన్ కాంగ్రెస్‌లో రిపబ్లికన్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటల్ మాట్లాడుతూ.. 'భారత్, చైనాలకు మా సందేశం ఒక్కటే. మీ పద్ధతి మార్చుకోండి. మీకు కావాల్సిన చమురు, గ్యాస్‌ను వేరే దేశాల నుంచి కొనండి. బుజ్జగింపులు సరైన వ్యూహం కాదు' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ కొత్త ఆంక్షల ద్వారా రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను చర్చలవైపు నెట్టి, ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలుకవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. "పుతిన్, మా దగ్గర నీ నంబర్ ఉంది. ఉక్రెయిన్.. మీరు ఒంటరి కాదు" అని ఆయన అన్నారు.'లిండ్సే ఓ గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026' పేరుతో రూపొందించిన ఈ చట్టం, రష్యా అధికారులు, బ్యాంకులు, అలాగే రష్యా ఇంధనాన్ని ప్రపంచవ్యాప్తంగా రవాణా చేస్తున్న 'షాడో ఫ్లీట్' (రహస్య ట్యాంకర్ల వ్యవస్థ) పై కఠిన ఆంక్షలు విధిస్తుంది. ఈ చట్టం ప్రకారం.. రష్యా నుంచి అత్యధికంగా చమురు, గ్యాస్ దిగుమతి చేసుకుంటున్న మొదటి ఐదు దేశాలపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కట్టబెడు తుంది. ఈ జాబితాలో భారత్, చైనాలు ప్రధానంగా ఉన్నాయి.అయితే రష్యా గ్యాస్ ఎగుమతుల్లో 15 శాతం కంటే తక్కువ దిగుమతి చేసుకుంటూ వాటిని తగ్గించడానికి గణనీయమైన చర్యలు తీసుకున్న దేశాలకు మినహాయింపు ఇచ్చారు. ఈ బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభలో 262-159 ఓట్ల తేడాతో ఆమోదం లభించింది. ప్రస్తుతం ఇది అధ్యక్షుడు ట్రంప్ సంతకం కోసం వేచి ఉంది.

## ఇరాన్ పోరులో అమెరికా యుద్ధ నేరాలు

### ఆధారాలున్నాయన్న అంతర్జాతీయ నిజనిర్ధారణ బృందం

న్యూయార్క్(జనంసాక్షి):ఇరాన్‌పై దాడుల సమయంలో అమెరికా యుద్ధ నేరాలకు పాల్పడిందా? దీనిపై ఐరాస మానవ హక్కుల సంస్థ నియమించిన అంతర్జాతీయ నిజనిర్ధారణ బృందం అవుననే అంటోంది. ఇరాన్‌పై జరిపిన రెండు దాడుల్లో అగ్రరాజ్యం యుద్ధ నేరాలకు పాల్పడిందని చెప్పేందుకు తగిన ఆధారాలు లభించాయని తెలిపింది. ఈ రెండు దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా దాదాపు 178 మంది మృతి చెందినట్లు వెల్లడించింది.నిజనిర్ధారణ బృందం ప్రస్తావించిన రెండు ఘటనల్లో ఒకటి.. మినాబ్‌లోని పాఠశాలపై తోమహాక్ క్షిపణి దాడి కాగా, మరొకటి లామెర్డ్ నగరంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్, నివాస ప్రాంతంపై జరిగిన వైమానిక దాడి. అదేవిధంగా ఇరాన్‌లో భద్రతా బలగాలు మారణకాండకు పాల్పడ్డాయని నిజనిర్ధారణ బృందం ఆరోపించింది. ఒకవైపు, సొంత ప్రభుత్వమే హక్కుల ఉల్లంఘనలకు పాల్పడటం, మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలు చేయడం.. మరోవైపు అమెరికా,



ఇజ్రాయెల్‌లతో యుద్ధం.. ఈ రెండింటి మధ్య అక్కడి పౌరులు చిక్కుకుపోయారని తెలిపింది.పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమైన సమయంలో మినాబ్‌లోని ఓ పాఠశాలపై జరిగిన దాడి ప్రపంచాన్నిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 28న ఇరాన్‌లోని ఐఆర్‌జీసీ స్థావరాలపై అమెరికా దాడులు చేస్తుండగా మినాబ్‌లోని ఓ పాఠశాలను క్షిపణి తాకింది. ఈ ఘటనలో 168 మంది మృతి చెందారని, వారిలో ఎక్కువ మంది పిల్లలే ఉన్నట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. మరోవైపు.. లామెర్డ్‌పై దాడికి తాము బాధ్యులం కాదని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఇప్పటికే ఖండించింది.

# పరిజ్ఞానం లేని రోజుల్లో గొప్ప శిల్పి విశ్వకర్మ

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17(జనంసాక్షి ):** సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందని రోజుల్లో గొప్ప నిర్మాణాలు చేసిన శిల్పి విశ్వకర్మ అని మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. గురువారము కలెక్టరేట్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆ శాఖ జిల్లా అధికారి అబ్దుల్ నదీమ్ అధ్యక్షతన నిర్వహించిన విశ్వకర్మ జయంతికి జిల్లా కలెక్టర్ హరిత, జిల్లా ఎస్పీ నీతిక పంత్, స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్ కుమార్, మున్సిపల్ చైర్మన్ ఆకాష్ తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప వ్యక్తులను నిత్యం స్మరించుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందని రోజుల్లో గొప్ప నిర్మాణాలు చేయడం విశ్వకర్మకు దక్కిందన్నారు. అటువంటి గొప్ప వ్యక్తులు నేటి టెక్నాలజీలో కూడా ఆదర్శప్రాయులని కొనియాడారు. కష్టపడేతత్వానికి, సృజనాత్మకతకు, సాంకేతిక పరిజ్ఞానానికి ప్రతీక వంటి వాడని అన్నారు. భారత నిర్మాణ శాస్త్రమైన వాస్తు శాస్త్రం ఆయన అందించినదేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మంగ, కౌన్సిలర్ వెంకన్న, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీమంతుల వేణుగోపాల్, తూమోజు సురేష్ చారి, భాస్కరాచారి పాల్గొన్నారు.

# అంతర్ జిల్లా దొంగల ముఠా పట్టివేత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17(జనంసాక్షి ):** రెబ్బెన పోలీస్ స్టేషన్ పరిధిలోనీ ఖైర్‌గావ్ గ్రామంలో జరిగిన దొంగతనం కేసును ఛేదించేందుకు జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ ఆదేశాల మేరకు మూడు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. డీఎస్పీ బి. అశోక్, రెబ్బెన సీఐ ఎం. సంజయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. తేదీ 07.09.2026న రెబ్బెన మండలం ఖైర్‌గావ్ గ్రామంలో ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంటి యజమానులు బంధువు మృతి కారణంగా తాండూర్‌కు వెళ్లి ఇంటికి తాళం వేసి వెళ్లారు. దీనిని గమనించిన నిందితులు ముందుగానే రెక్కీ నిర్వహించి,ఇల్లు ఖాళీగా ఉన్న సమయంలో తాళం పగులగొట్టి ఇంట్లోని విలువైన వస్తువులను దొంగిలించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు ఈ రోజు కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన స్విఫ్ట్ డిజైర్ కారును తనిఖీ చేశారు. కారులో తాళాలు పగులగొట్టేందుకు ఉపయోగించే సామాగ్రితో పాటు బంగారం,వెండి లభించాయి. కారులో ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా,తాండూర్, ఖైర్‌గావ్,జాకులపల్లి,రెబ్బెన ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించారు. తాండూర్ శివాజీనగర్‌కు చెందిన ఊపట్ల ప్రణయ్, శంభాజీనగర్‌కు చెందిన మంచెర్ల సతీష్‌కుమార్, శివాజీనగర్‌కు చెందిన రాజేశం, శాలిగామ కృష్ణ అనే నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుండి 10.3 తులాల బంగారం, 30 తులాల వెండి, 4 మొబైల్ ఫోన్లు, నేరానికి ఉపయోగించిన స్విఫ్ట్ డిజైర్ కారు, తాళాలు పగులగొట్టేందుకు ఉపయోగించే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి,న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన డీఎస్పీ బి. అశోక్, రెబ్బెన సీఐ ఎం. సంజయ్,ఎస్ఐ వెంకట కృష్ణ,హెచ్‌సీ రవి కుమార్,పీసీ నౌషాద్,పీసీ వెంకటేష్ లను జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ అభినందించారు.

# సీఎంను తిడుతుంటే చప్పట్లు కొడతావా..!

- ఇప్పుడు స్టేజ్ మీద ఎలా కూర్చుంటావు?
- మీసాల ప్రకాష్ పై మండిపడ్డ కాంగ్రెస్ నాయకులు
- వరంగల్లో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా రెండు వర్గాల మధ్య వాదోపవాదాలు




**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** కొండ దంపతుల కూతురు సుస్మిత పటేల్ గీసుకొండ ల నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ని తిడుతుంటే అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే అదే సభలో ఉండి చప్పట్లు కొడతావా.. ఇప్పుడు ఇక్కడ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ఎలా స్టేజి మీద కూర్చుంటావు..? అంటూ కాంగ్రెస్ పార్టీలో ఓ వర్గానికి చెందిన13వ డివిజన్ నాయకుడు ఇనుగాల బాబు తోపాటు వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పరమేశ్వర్ తదితరులు మరో వర్గానికి చెందిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ పై మండిపడ్డారు. వరంగల్ నగరంలోని ఆజం జాయ్ మిల్ గ్రౌండ్ వద్ద గురువారం సెప్టెంబర్ 17 సందర్భంగా ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రణాళిక సఘం వైస్ చైర్ పర్సన్ గద్వాల విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. సమావేశానంతరం స్టేజి దిగి బయటకి వచ్చినటువంటి అధికారులు ప్రజాప్రతినిధులు ముందుకెళ్తున్న సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమక్షంలో కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్ ను విమర్శించారు. కొండ సుస్మిత పటేల్ సీఎం పై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు అక్కడ వేదిక మీద నువ్వు ఉన్నావు. ఉండి చప్పట్లు కొట్టావు అని ఇనుగాల బాబుతో పాటు మరికొందరు గట్టిగా అడిగారు. ప్రభుత్వ పదవిని అనుభవిస్తూ అలా చేయడం కరెక్టేనా అంటూ ప్రశ్నించారు. అయితే తాను అక్కడ లేను చప్పట్లు కొట్టలేదు అని మీసాల ప్రకాష్ అనడంతో అక్కడికక్కడే సెల్ ఫోన్ లో వీడియో చూపించడంతో అయితే ఏంది అని మీసాల ప్రకాష్ అనడంతో సదరు కాంగ్రెస్ నాయకులు సీరియస్ అయిన పరిస్థితి ఏర్పడింది. ఇదంతా గమనిస్తున్న కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఇక్కడ గొడవలు వద్దు అని సర్ది చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

# రోడ్డు ప్రమాదంలో మహిళా సర్పంచ్ మృతి

- భర్తకు తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం



**నల్లబెల్లి, సెప్టెంబరు 17 (జనంసాక్షి):** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లెంకాపల్లి గ్రామ సర్పంచ్ కస్తూరి విజయలక్ష్మి (40) చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమె భర్త రవీందర్ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. విజయలక్ష్మి తన భర్త రవీందర్‌తో కలిసి బుధవారం మహబూబాబాద్ జిల్లా తాళ్లపూసలపల్లి గ్రామంలోని మనవరాలిని చూసేందుకు వెళ్లారు. అక్కడి నుంచి నర్సంపేటకు చేరుకుని, ద్విచక్రవాహనంపై లెంకాపల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. నారక్కపేట, ఇటుకాలపల్లి గ్రామాల మధ్య ఉన్న వంతెనపైకి రాగానే ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను



ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను తొలుత నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున విజయలక్ష్మి మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. సర్పంచ్ విజయలక్ష్మి అకాల మరణంతో లెంకాపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# బడిలో 'కీచక' పర్వం?!

- విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన.. చాకిరీ చేయిస్తూ వేధింపులు!
- ఖమ్మం నగర శివారులోని ఓ పాఠశాలలో వెలుగుచూసిన దారుణం..
- కలెక్టర్‌కు పూర్వ విద్యార్థుల ఫిర్యాదు..?



**ఖమ్మం బ్యూరో,( జనంసాక్షి):** అక్షరాలు దిద్ది విజ్ఞానాన్ని పంచాల్సిన గురువే కీచకుడిగా మారాడన్న తీవ్ర ఆరోపణలు ఖమ్మం నగరానికి అతి సమీపంలోని ఓ మండలంలోని ఉన్నత పాఠశాలలో పెను దుమారం రేపుతున్నాయి. విద్యాబుద్ధులు నేర్చుకునేందుకు బడికొచ్చే అమాయక విద్యార్థినుల పట్ల అత్యంత అసభ్యంగా ప్రవర్తిస్తూ, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నాడంటూ బాధ్యతాయుత స్థానంలో ఉన్న ఓ ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయుడి వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌కు పూర్వ విద్యార్థులు లిఖితపూర్వకంగా చేసిన ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పాఠశాలలో నెలకొన్న పరిస్థితులు విద్యార్థినుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయని, అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అమాయక బాలికలతో వెట్టిచాకిరీ!

భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన సదరు హెచ్‌ఎం విద్యార్థులను కనీస కనికరం లేకుండా బానిసల్లా చూస్తున్నారన్న ఆరోపణలు విస్మయం కలిగిస్తున్నాయి. పాఠశాలలో పనులు చేయడానికి సహాయక సిబ్బంది ఉన్నప్పటికీ వారిని కాదని, విద్యార్థులతో శారీరక శ్రమతో కూడిన పనులు చేయిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలోని భారీ చెట్లను కొట్టించడం, ఎత్తైన గోడలకు రంగులు (పెయింటింగ్) వేయించడం, చివరికి కూలీలు సైతం కష్టపడే సిమెంట్ పనులను అమాయక విద్యార్థులతోనే చేయిస్తున్నారని ఆరోపించారు. పాఠాలు చదువుకోవాల్సిన వేళ విద్యార్థినులతో సొంత పనులకు ఊడిగం చేయించుకుంటూ, బడిని వెట్టిచాకిరీ అడ్డాగా మార్చేశారనే విమర్శలు తీవ్రస్థాయిలో వ్యక్తమవుతున్నాయి. బడికి వచ్చే విద్యార్థినుల పట్ల సదరు ఉపాధ్యాయుడి వైఖరి అత్యంత అభ్యంతరకరంగా ఉంటోందని స్థానికులు, పూర్వ విద్యార్థులు మండిపడుతున్నారు. బాలికల ఒంటిపై చేతులు వేస్తూ మాట్లాడటం, వారితో అనవసర చనువు ప్రదర్శిస్తూ అసభ్యకరంగా ప్రవర్తించడం రోజువారీ వ్యవహారంగా మారిందని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. పిల్లలను తీవ్ర మానసిక భయాందోళనలకు గురిచేసి, తన మాటకు ఎదురుచెప్పకుండా కట్టడి చేస్తున్నారని, పవిత్రమైన విద్యామందిరంలో ఆడపిల్లల భవిష్యత్తును అంధకారం చేసేలా వికృత చేష్టలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

### తూతూమంత్రంగా విచారణ.. బాధితులకు బెదిరింపులు!

ఈ అకృత్యాలపై గతంలో ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వగా, విద్యాశాఖ పంపిన ముగ్గురు సభ్యుల విచారణ కమిటీ తూతూమంత్రంగా వ్యవహారం ముగించి చేతులు దులుపుకుందని ఫిర్యాదుదారులు విమర్శిస్తున్నారు. విచారణ అధికారులు వస్తున్న సమాచారం ముందే లీక్ కావడంతో, సదరు హెచ్‌ఎం విద్యార్థులందరినీ ఒకే గదిలో కూర్చోబెట్టి ఎవరైనా సాక్ష్యం చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించినట్లు తెలిసింది. విచారణ ప్రక్రియలో బాధితులను వ్యక్తిగతంగా పిలిచి వారి సమస్యలు తెలుసుకోవాల్సింది పోయి, సామూహికంగా కూర్చోబెట్టి నామమాత్రంగా ప్రశ్నించడంతో భయంతో ఎవరూ నోరు విప్పలేకపోయారని పేర్కొన్నారు. విచారణ ముగిసిన మరుసటి రోజే ఉదయం ప్రార్థనా సమయంలో నిలబడి "తనను ఏ అధికారి కూడా ఏమీ చేయలేరని" సవాలు విసురుతూ మాట్లాడటం చూస్తుంటే అధికారుల అండదండలు ఎవరికున్నాయో అర్థమవుతోందని పూర్వ విద్యార్థులు మండిపడుతున్నారు.

### దాతల విరాళాలూ వ్యక్తిగత ఖాతాల్లోకే?

పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు బహుమతులు, స్నాక్స్ పేరిట దాతల నుంచి సేకరించిన విరాళాల విషయంలోనూ భారీగా అక్రమాలు జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం పాఠశాల అధికారిక ఖాతాలో జమ చేయాల్సిన మొత్తాలను, సదరు ఉపాధ్యాయుడు తన సొంత డిజిటల్ చెల్లింపుల ఖాతాలకు బదిలీ చేయించుకున్నారని, ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని ఫిర్యాదులో వివరించారు. గత ప్రధానోపాధ్యాయుల హయాంలోనూ ఇలాంటి అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు చెబుతూ, దీనిపై ఉన్నతస్థాయి ఆడిట్ జరిపించాలని కోరారు.

### స్పందించకుంటే న్యాయపోరాటం!

పాఠశాల పవిత్రతను మంటగలుపుతూ, బాలికల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న సదరు కీచక ఉపాధ్యాయుడిపై సమగ్ర విచారణ జరిపి తక్షణమే విధుల నుంచి తొలగించాలని పూర్వ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా బాధ్యులపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పోస్ట్‌కార్డు పిటిషన్ ద్వారా నివేదించడంతో పాటు తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.

# తెలంగాణ చరిత్రలో మహోన్నత ఘట్టం

- ప్రజాపాలనకు మార్గదర్శకం
- ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క
- ములుగులో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు.



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 17(జనంసాక్షి) :** తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 మహోన్నత ఘట్టమని, నాటి పోరాట స్ఫూర్తి ప్రజాపాలనకు మార్గదర్శకమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రాంగణంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి జిల్లా ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, సెప్టెంబర్ 17వ తేదీకి భారతదేశ, తెలంగాణ చరిత్రలో విశిష్టమైన స్థానం ఉందన్నారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, నాటి హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కాలేదని తెలిపారు. నిరంకుశ పాలనతోపాటు రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు వీరోచితంగా పోరాడారని గుర్తుచేశారు. రైతులు, కూలీలు, మహిళలు, విద్యార్థులు, యువత ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అస్తిత్వాన్ని చాటిన ఈ చారిత్రక సందర్భాన్ని ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. నాటి పోరాట యోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే వారికి అందించే నిజమైన నివాళి అని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకంగా, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకొని, వాటికి తక్షణ పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ములుగు జిల్లా అభివృద్ధి ప్రస్థానంలో ఘట్టమ్మ వద్ద నిర్మించిన పైలాన్ ప్రాజెక్ట్ కలికితురాయిగా నిలిచిందన్నారు. నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం అందుబాటులోకి రావడంతో ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలు ఒకేచోట సులభంగా లభిస్తున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ స్ఫూర్తితో అధికారులు మరింత అంకితభావంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములై జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ, రెవెన్యూ డివిజనల్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రవిచందర్, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు, వయోవృద్ధులు, విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ మండల అధ్యక్షుడిపై దాడి

- తలపై బలంగా కొట్టి తీవ్రంగా గాయపరిచిన గుర్తుతెలియని వ్యక్తులు

**వేలేరు, సెప్టెంబర్ 17(జనం సాక్షి) :** వేలేర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న ఆయనను సాయిపేట- కేశవనగర్ సమీపంలో గుర్తుతెలియని దుండగులు అడ్డుకున్నట్లు సమాచారం. అనంతరం ఇనుప రాడ్‌తో తలపై బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. అకస్మాత్తుగా జరిగిన దాడితో లక్ష్మణ్ నాయక్ కిందపడిపోయినట్లు తెలుస్తోంది. దాడికి పాల్పడిన వ్యక్తులు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. గాయపడిన లక్ష్మణ్ నాయక్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే హన్మకొండ జిల్లా అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి బాధితుడు లక్ష్మణ్ నాయక్‌ను ఎంజీఎంలో పరామర్శించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. దాడికి గల కారణాలు, దుండగుల వివరాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టాల్సి ఉంది.

# సైబర్ మోసగాళ్ల ఆటకట్టు

- 22 మంది అరెస్ట్, 216 పాస్‌బుక్‌లు, వాహనాలు, సిమ్ కార్డులు స్వాధీనం
- దేశవ్యాప్తంగా 185 సైబర్ నేర లింకుల గుర్తింపు
- ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల్లో దర్యాప్తు
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత వెల్లడి



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** అంతర్రాష్ట్ర సైబర్ మోసాల వ్యవస్థపై వరంగల్ పోలీసులు కీలక విజయాన్ని సాధించారు. దేశవ్యాప్తంగా జరిగే ఆర్థిక సైబర్ మోసాల ద్వారా వచ్చిన నగదును మళ్లించేందుకు మ్యూల్ బ్యాంక్ ఖాతాలు, బ్యాంకింగ్ వివరాలు, సిమ్ కార్డులను సమకూర్చడం, నిర్వహించడం, దుర్వినియోగం చేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్న విస్తృతమైన నేర నెట్‌వర్క్‌ను వరంగల్ పోలీసులు ఛేదించారు.ఈ దర్యాప్తును వరంగల్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ (క్రైమ్ నెంబర్. 29/2026), ఆజంజాహీ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ (క్రైమ్. నెం. 672/2026) సమన్వయంతో నిర్వహించారు. ఈ కేసుల్లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 316(2), 318(4), 319(2), 338, 336(3), 351(2), 111 తీఆర్/డబ్ల్యు 3(5), ఐటీ యాక్ట్, 2000లోని సెక్షన్లు 66-సి, 66-డి కింద కేసులు నమోదు చేయబడ్డాయి.ఈ సందర్భంగా పోలీస్ కమిషనరేట్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వరంగల్ సిపి ఎన్.శ్వేత కేసుకు సంబంధించిన విషయాలను వివరించారు. వరంగల్ డీసీసీ బ్యాంక్ నుండి అందిన సమాచారం మేరకు, ఖాతాదారుల ప్రకటిత ఆదాయ వనరులతో పోలిస్తే అసాధారణంగా అధిక మొత్తంలో లావాదేవీలు జరుగుతున్న అనుమానాస్పద బ్యాంకు ఖాతాలపై దర్యాప్తు నిర్వహించగా ఈ నెట్‌వర్క్‌లో స్థానిక ఏజెంట్లు, మ్యూల్ ఖాతాదారులు, ఖాతాలను నిర్వహించే వ్యక్తులు, మధ్యవర్తులు, రవాణాదారులతో కూడిన సంక్లిష్ట వ్యవస్థ ఉన్నట్లు వెల్లడైందన్నారు. స్థానిక ఏజెంట్లు ప్రధాన్ మంత్రి ముద్ర యోజన పథకం ద్వారా రూ. 50,000 రుణం ఇప్పిస్తామని చెప్పి అమాయక ప్రజలను నమ్మించారని,వారి మాటలను నమ్మిన బాధితులు డీసీసీబీ బ్యాంక్, నక్కలగుట్ట బ్రాంచ్ సహా వివిధ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి, తమ బ్యాంక్ పాస్‌బుక్‌లు, ఏటీఎం కార్డులు, పాన్ వివరాలు, అనుసంధానిత సిమ్ కార్డులను ఒక్కో ఖాతాకు రూ. 6,000 నుంచి రూ. 8,000 వరకు స్వల్ప మొత్తానికి కమిషన్‌గా అందజేశారని తెలిపారు.ఈ విధంగా సేకరించిన బ్యాంకింగ్ కిట్లను వడ్డేపల్లి రోడ్, హనుమకొండ ప్రాంతంలోని క్యాంటీన్,బుక్‌స్టాల్ వంటి స్థానిక వాణిజ్య సంస్థల్లో నిల్వ చేసి, అనంతరం ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, ఇతర ప్రాంతాల్లోని అంతర్ రాష్ట్ర హ్యాండ్లర్లకు రవాణా చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు.వీరికి బ్యాంకింగ్ సదుపాయం కల్పించేందుకురమేష్ నాయక్ అనే వ్యక్తి బ్యాంకులో మార్కెటింగ్ ఏజెంట్ పని చేస్తూ తన విధులను దుర్వినియోగం చేస్తూ కొంత మంది ఏజెంట్స్ లను నియమించుకొని వారి ద్వారా సేవింగ్స్ అకౌంట్ ఓపెన్ చేసి సైబర్ నేరస్తులకి అకౌంట్ పంపించేవాడని తెలిపారు. అదే విధంగా వెంకటేశ్వర్లు మరొక బ్యాంకు నందు బ్రోకర్ గా పని చేస్తూ తన వద్దకి వచ్చిన వారికి కమీషన్ తీసుకొని కరెంటు, సేవింగ్స్ ఖాతాలను బ్యాంకు సిబ్బంది సహాయంతో అవసరమైన డాకుమెంట్స్ తానే తయారు చేసి బ్యాంకు అకౌంట్స్ తెరిచి ఇచ్చేవాడని, ఇతని సహకారం తో నేరస్తులు బ్యాంకు అకౌంట్స్ తెరిచి వివిధ రాష్ట్రాలలో ఉన్న వారికీ పంపించేవారని, అందుకు గాను వారు అధిక మొత్తంలో కమిషన్లు పొందినట్లు గుర్తించారమని సిపి తెలిపారు.

### 22మంది అరెస్టు,216 పాసుబుక్ లు, వాహనాలు స్వాధీనం

ఈ కేసుతో సంబంధం ఉన్న దేశ వ్యాప్తంగా 185 సైబర్ లింకులను గుర్తించిమొత్తం 22 మంది నిందితులను ఈ నెల 8న అరెస్ట్ చేసి, న్యాయస్థానం ముందు హాజరుపరచగా, వారిని న్యాయ రిమాండ్‌కు పంపించడం జరిగిందని తెలిపారు.వీరి వద్ద నుండి 216 బ్యాంకు పాస్ బుక్ లు, 22 ఏటియం/డెబిట్ కార్డులు,ఎస్బిఐ, ఒడిస్సా గ్రామీణ బ్యాంకు,ఉత్కల్ గ్రామీణ బ్యాంకు,డీసీసీబీ బ్యాంకు,బ్యాంక్ ఆఫ్ బరోడా తదితర బ్యాంకులకు చెందిన థర్డ్ పార్టీ బ్యాంకింగ్ కిట్లు, 8చెక్ బుక్ లు, 2 కార్లు,ఎక్స్ టర్నల్,హార్డ్ డిస్క్ లు, స్మార్ట్ ఫోన్ లు, సిమ్ కార్డులు, బ్యాంకు క్యూఆర్ కోడ్ స్కానర్లు, నాలుగు ట్రాన్సాక్షన్ డైరీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

### బ్యాంకింగ్ వివరాలను పంచుకోవద్దు

డబ్బు లేదా కమిషన్ కోసం ఎవరైనా అడిగినా బ్యాంకు ఖాతా వివరాలు, ఏటియం/డెబిట్ కార్డు, చెక్ బుక్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలు లేదా సిమ్ కార్డు ఇతరులకు ఇవ్వకూడదని సిపి ఎన్. శ్వేత సూచించారు. రుణాలు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తులు లేదా సంస్థలను నమ్మి, వారి కోసం బ్యాంకు ఖాతాలు తెరవడం లేదా మీ వ్యక్తిగత పత్రాలను మూడో వ్యక్తులకు అప్పగించడం చేయకూడదని, అలా అందించే వ్యక్తులు నేరాలకు ప్రత్యక్షంగా సహకరించినవారిగా పరిగణించబడి, వారిపై క్రిమినల్ దర్యాప్తు, అరెస్ట్, చట్టపరమైన చర్యలు చేపట్టే అవకాశం ఉందన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలపై, సైబర్ మోసాల సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ / హెల్ప్‌లైన్ 1930 ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

## డిజిటల్ నుంచి నగదు వైపునకు దేశం

సంపాదకీయం

దేశంలో నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు గత కొన్నేళ్లుగా ప్రభుత్వం, బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు కలిసి యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్)ను దేశవ్యాప్తంగా చిన్న వ్యాపారుల వరకూ తీసుకెళ్లాయి. కూరగాయల బండి తోసేవాడి దగ్గర నుంచి ఆటో డ్రైవర్ వరకూ అందరూ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డబ్బు తీసుకోవడం నేర్చుకున్నారు. ఇది నిజంగా ఒక సామాజిక మార్పు. కానీ ఇప్పుడు ఇదే యూపీఐ లావాదేవీల టర్నోవర్ ఆధారంగా చిన్న వ్యాపారులపై పన్ను భారం పడే పరిస్థితి తలెత్తడం ఆందోళన కలిగిస్తోంది.

ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్‌లు నడిపేది ఎవరు అన్నది మర్చిపోకూడని విషయం. ఫోన్‌పేను వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ నడుపుతోంది, గూగుల్ పే అమెరికన్ టెక్ దిగ్గజం గూగుల్‌దే, పేటీఎంను వన్97 కమ్యూనికేషన్స్ నిర్వహిస్తోంది. ఈ సంస్థలు లావాదేవీల డేటా ద్వారా, వ్యాపార విస్తరణ ద్వారా భారీగా లాభపడుతున్నాయి. కానీ ఆ లావాదేవీల మొత్తాన్ని 'టర్నోవర్'గా చూపించి, అదే ప్రాతిపదికన చిన్న వ్యాపారికి పన్ను నోటీసు లు వెళ్లడం అన్యాయం. టర్నోవర్ అంటే లాభం కాదు. కూరగాయల వ్యాపారి రోజుకు వేలాది రూపాయల టర్నోవర్ చూపించినా, అందులో పెట్టుబడి, నష్టం, రవాణా ఖర్చులు పోను చేతికి వచ్చేది స్వల్పమే. కొన్నిసార్లు నష్టమే మిగులుతుంది. ఏడాదికి లక్ష రూపాయల టర్నోవర్ దాటిందని జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడం, ఆ లెక్కను కేవలం యూపీఐ డేటా ఆధారంగా నిర్ధారించడం వాస్తవిక పరిస్థితిని పట్టించుకోని విధానంగా కనిపిస్తుంది.

ఈ భయం వల్ల చిన్న వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, గిగ్ వర్కర్లు మళ్ళీ నగదు లావాదేవీల వైపు మొగ్గు చూపే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు తీసేసి, "నగదు మాత్రమే" అనే బోర్డులు పెట్టుకునే ధోరణి కొన్నిచోట్ల ఇప్పటికే మొదలైంది. ఇది కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు, ప్రభుత్వం ఇన్నేళ్లుగా కష్టపడి నిర్మించిన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీసే అంశం. పారదర్శకత కోసం అమలు చేసిన వ్యవస్థే, అమలు తీరులో లోపాల వల్ల అపారదర్శకత వైపు, నగదు ఆర్థిక వ్యవస్థ వైపు దేశాన్ని వెనక్కి నెట్టే పరిస్థితి రావడం విరోధాభాసమే.

నిజానికి పన్ను వసూలు చేయాల్సింది టర్నోవర్‌పై కాదు, వాస్తవ లాభంపై అని ఆర్థిక నిపుణులు చెబుతున్న మాట. చిన్న వ్యాపారుల విషయంలో టర్నోవర్ పరిమితిని నిర్ణయించే ముందు, వారి వాస్తవ ఆదాయ స్థాయిని, వ్యాపార స్వభావాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేకపోతే డిజిటల్ ఇండియా కలలు కాగితాలకే పరిమితమై, దేశం మళ్ళీ నగదు ఆధారిత వ్యవస్థ వైపు వెనక్కి మళ్లే ప్రమాదం ఉంది.

అయితే ఇందులో మరో కోణం కూడా ఉంది. లావాదేవీలన్నీ నమోదు కావడం వల్లే పన్ను ఎగవేతను అరికట్టగలమని, పెద్ద వ్యాపారులు చిన్న వ్యాపారుల ముసుగులో పన్ను తప్పించుకోకుండా చూడగలమని ప్రభుత్వ వర్గాలు వాదిస్తున్నాయి. జీఎస్టీ నమోదు పరిమితి, నోటీసుల జారీ అనేవి కొత్త పన్నులు కాదని, ఇప్పటికే ఉన్న చట్టాల అమలులో భాగమేనని కూడా అధికారులు చెబుతున్నారు. ఈ రెండు వాదనల మధ్య సమతూకం సాధించే విధానమే ఇప్పుడు దేశానికి అవసరం.

### సెప్టెంబర్ -17 సాయుధ పోరాట గ్రామాలకి
# ముమ్మాటికీ విద్రోహ దీనమే

*రైతులు అన్ని విధాలుగా స్వేచ్ఛగా భూస్వాముల ఆధిపత్యం పెత్తనం లేకుండా తమకు రావాల్సిన న్యాయమైన వాటిని ఇతర సౌకర్యాలను నీటిని పొందుతూ వ్యవసాయం చేసుకోగలిగారు. కమ్యూనిస్టు పార్టీ పంపకాల ద్వారా కొత్తగా భూమి లభించిన వారు తమ తమ భూములను సాగు చేసుకున్నారు. కొన్ని వేల సంవత్సరాలలో మొద టిసారిగా ఏర్పడిన కొత్త జీవితం ప్రారంభమై అభివృద్ధి అయింది. సాయుధ పోరాటం ప్రారంభం కాకముందు బానిస జీవితం కొనసాగేది. సాయుధ పోరాటం గ్రామీణ జీవితంలో ప్రజల్లో విప్లవాత్మకమైన మార్పు తెచ్చిందని స్పష్టమవుతుంది. దీంతో గ్రామాల్లో కొత్త జీవితం ఏర్పడింది అదే జనతా ప్రజాతంత్ర జీవితం.*

నిన్నటి సంచిక తరువాయి



ఈ విప్లవం ద్వారానే ఇలాంటి మార్పు వస్తుంది. భూస్వాముల భూమిని పంపకం చేయడం గ్రామీణ జీవితంలో పేదరికం నిర్మూలించడం, నిరుద్యోగాన్ని నిర్మూలించడం లాంటి మార్పులను లక్షల కోట్లు ఖర్చు చేసిన నేటి ప్రభుత్వాలు సాధించలేదు.

ఈ మార్పులను ఆనాడు సాయిధ పోరాట కాలంలో విప్లవోద్యమం ద్వారా సాధించారు. దీని ద్వారా కొత్త ఆర్థిక వ్యవస్థ ఏర్పడింది. గ్రామ రాజ్యాలు ఏర్పడటం ద్వారా కొత్త రాజకీయ వ్యవస్థ ఏర్పడింది. తమ భూములు ఇళ్లను కాపాడుకోవడం కోసం ప్రజలతో ఏర్పడిన గెరిల్లా దళాలతో కొత్త మిలటరీ నిర్మాణం ఏర్పడింది. అంతేకాకుండా స్థానిక దళాలు తమ వ్యవహారాలను తామే చక్కబెట్టుకుంటూ తామే శాంతి భద్రతను పరిరక్షిస్తూ కొత్త శాంతి భద్రతల వ్యవస్థ ఏర్పడింది నూతన ఆర్థిక రాజకీయ జీవితంతో పాటు కొత్త సాంస్కృతిక జీవితం కూడా ఏర్పడింది.

ఇది నిజాం నిరంకుశ పాలన వ్యతిరేక పోరాటం, ముస్లిం వ్యతిరేక పోరాటం కాదు. పింగళి వెంకటరామిరెడ్డి పెద్ద హిందూ భూస్వామి నిజాం మంత్రివర్గంలో అతనికి స్థానం ఉండేది నిజాం తరపున యూనియన్ ప్రభుత్వంలో సంప్రదింపులు జరిపే రాయబార వర్గంలో అతడు సభ్యుడు. జిల్లాలల్లో కూడా హిందూ భూస్వాములు రజాకార్లతో చేరి దాడులు చేయించిన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. హిందూ భూస్వాములు రజాకార్ దళాలకు నాయకత్వం వహించిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇది భూస్వామ్య వ్యతిరేక, ఫ్యూడలిజానికి వ్యతిరేక ఉద్యమమే కానీ కేవలం నిజాం వ్యతిరేక ఉద్యమం కాదనేది అనేక ఉదాహరణలు ఉన్నాయి.

ఎర్రబాడు దొర జన్నారెడ్డి ప్రతాపరెడ్డి అరాచకాలకు వ్యతిరేకంగా, విసునూరు దొర రామచంద్ర రెడ్డి దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన వారు అనేకమంది ఉన్నారు.

విసునూరు దేశముకు రాపాక రామచంద్ర రెడ్డి అక్రమాలకు వ్యతిరేకంగా న్యాయపోరాటం చేసి పోరాడి దొర గుండాల చేత హత్యగావింప బడి అమరుడైన తొలి ముస్లిం యువ రైతు షేక్ బందగి, నిజాం దౌర్జన్యాలను వ్యతిరేకిస్తూ సాయుధ పోరాటం కాలంలో హైదరాబాదులో కార్మిక సంఘాల స్థాపనలో, విద్యార్థులను కమ్యూనిజం వైపు ఆకర్షించడంలో కామ్రేడ్ అసోసియేషన్ ద్వారా కీలక పాత్ర పోషించిన విప్లవకవి మగ్దమ్ మోహినుద్దీన్.

నిజాం అరాచకాలను ఎండగడుతూ తన కలం రాతల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తూ "ఇమ్రోజ్" ఉర్దూ దినపత్రిక నడిపి రజాకార్ల చేత అత్యంత పాశవికంగా హత్యగావింపబడ్డ షోయబుల్లా ఖాన్ లాంటి వారి చరిత్ర తెలంగాణ సాయుధ పోరాటం కేవలం భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన వర్గ పోరాటమే తప్ప మత వ్యతిరేక పోరాటం కాదనేది నేటికీ సజీవ సాక్ష్యం గానే నిలిచింది. హైదరాబాద్ సమస్యను ఐక్యరాజ్యసమితిలో పాకిస్తాన్ తీసుకురావడం భారత ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. చట్టరీత్యా సంస్థానాలన్నీ స్వతంత్ర రాజ్యాలు. తక్కినవి ఐచికంగానే చేరిపోయాయి. మిగిలిపోయిన వాళ్ళ హైదరాబాద్ కాశ్మీర్ అటూ ఇటూ తేల్చకుండా ఉండిపోయాయి.

చట్టరీత్యా ఒక స్వతంత్ర రాజ్యంలోకి మరొక రాజ్యమైన యూనియన్ ప్రభుత్వం సైన్యాలను పంపడం దురాక్రమణ అవుతుంది. దాన్ని పాకిస్తాన్ అయినా మరే దేశమైనా ఐక్యరాజ్యసమితిలో లేవనెత్తవచ్చు. అందుకే "పోలీస్ యాక్షన్" అని పేరు పెట్టి నిజాం సంస్థానం పైకి "ఆపరేషన్ పోలో" పేరుతో సైన్యాన్ని పంపారు. పోలీస్ యాక్షన్ అంటే శాంతి భద్రతలను కాపాడటానికి సైన్యాన్ని పంపించడం. ఈ పేరు తో ఐక్యరాజ్యసమితిలో అంతర్జాతీయంగానూ యూనియన్ ప్రభుత్వం మభ్య పెట్టే ప్రయత్నం చేసింది.

సైన్యాలను పంపినది నిజం ప్రభుత్వం మీద లేక ప్రజల మీదిక అన్నది అర్థం కాని పరిస్థితి తయారయింది. ఎందుకంటే కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర మహాసభల నాయకత్వాన ఒక విశాల ప్రాంతంలో నిజాం ప్రభుత్వాన్ని లేకుండా చేసింది. ప్రజలు సాయుధ దళాలు నిజాం ప్రభుత్వాన్ని దెబ్బతీసాయి.

చైనా విప్లవ సమయంలో లాంగ్ మార్చ్ ద్వారా చైనాలోని యేనాన్ ప్రావిన్స్ మొదటి విముక్తి అయింది.

అదేవిధంగా భారతదేశం లో కూడా సాయుధ విప్లవం ద్వారా నిజాం ప్రాంతం విముక్తి అయ్యే విప్లవ పరిస్థితి ఉంది. ఇది దేశవ్యాప్తంగా విస్తరిస్తే యూనియన్ ప్రభుత్వానికి తలనొప్పిగా మారే పరిస్థితి ఉంది. నిజాం ప్రాంతం లో అనేక అరాచకాలు, దోపిడీ పాలనా, వెట్టి చాకిరీ జరుగుతున్న పట్టించు కొని, భారత యూనియన్ ప్రభుత్వం, నిజాం ప్రాంతం లో కమ్యూనిస్ట్ లు పై చేయి సాధించి, నిజాం పాలనా కి విముక్తి పలికే సమయం వచిన్నపుడు,

ఈ పోరాటాన్ని అణచివేసేందుకు యూనియన్ సైన్యాలు నిజాం నవాబుకి వ్యతిరేకంగా కాక ఈ విప్లవ ఉద్యమాన్ని ఆచడానికి ఇక్కడికి వచ్చాయి అనేది స్పష్టం అవుతున్నది.

నిజాం నవాబు స్వతంత్రంగా ఉండటం సాధ్యం కాదనుకున్న తర్వాత, అతను లొంగిపోయినట్టుగా తాము లొంగదీసుకున్నట్టుగా యూనియన్ ప్రభుత్వం పక్కా ప్రణాలిక ప్రకారం ప్రచారం చేసుకుంది. హైదరాబాద్ యూనియన్ భారత ప్రభుత్వంలో చేరిందని ప్రకటన చేశారు.

నిజాం లొంగిపోయిన తర్వాత పట్టణాలకు పారి పోయిన భూస్వామ్యులు, యూనియన్ సైన్యలా పాటు, గాంధీ టోపీ లు ధరించి, కాంగ్రెస్ నాయకులు గా మళ్ళీ పోరాట ప్రాంతలలో అడుగు పెట్టారు.

1951 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రజలు పోరాటం ద్వారా పంచుకున్న భూములను తిరిగి యూనియన్ సైన్యాలు భూస్వాములకు కట్టబెట్టాయి.

1948 సెప్టెంబర్ 13న ప్రారంభమై సెప్టెంబర్ 17న ఆపరేషన్ పోలో ముగిసింది. మొత్తం ఐదు రోజుల పాటు కొనసాగింది.

మేజర్ జనరల్ జీ. చీ చౌదరి పర్యవేక్షణలో ఈ పోలీస్ చర్య జరిగింది. పోలీస్ యాక్షన్ జరిగిన సమయంలో అరాచకాలు, హత్యలు విపరీతంగా జరిగాయి. అప్పుడు వచ్చిన విమర్శలకు నాటి ప్రధానమంత్రి నెహ్రూ పండిట్ సుందర్ లాల్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ తీవ్రమైన లూటిలు, అత్యాచారాలు మరియు సామూహిక హత్యలు జరిగినట్లు నివేదిక ఇచ్చింది.

పోలీస్ యాక్షన్ సమయంలో ఆ తర్వాత జరిగిన హింసలో సుమారు 27,000 నుండి 40000 మంది ప్రాణాలు కోల్పోయారని ఈ కమిటీ అధికారికంగా అంచనా వేసింది. ( ఈ సంఖ్య అంతకంటే ఎక్కువగానే ఉండవచ్చు) భారత సైన్యంలోని కొందరు సైనికులు స్థానిక పోలీసులు వ్యవహరించిన తీరు అల్లరిమూకలకు సహకరించడం వల్లే ఈ నష్టం జరిగిందని నివేదిక ఇచ్చాయి.

ఈ నివేదికలోని అంశాలు భారత సైన్యం ప్రతిష్టకు భంగం కలిగిస్తాయని కారణంతో నెహ్రూ ప్రభుత్వం దశాబ్దాల తరబడి బహిరంగ పరచకుండా ఈ నివేదికను తొక్కిపెట్టింది. సుదీర్ఘకాలం తర్వాత 2013లో అధికారికంగా డిక్లాసిఫై చేసి (రహస్య నివేదిక జాబితా నుండి తొలగించి) ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.


భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం దోపిడీ, దౌర్జన్య, నిరంకుశ పాలనా పై సామాన్యులు ఆయుధం ఎత్తి, సాయుధా పోరాటం చేసి, వందలది మంది ప్రాణాలు కోల్పోయి, మూడు వేల గ్రామాల్లో, పది లక్షల ఎకరాల భూములు పంచుకొని, బానిస జీవితం నుండి విముక్తి పొంది, వెట్టి చాకిరీ, దోపిడీ లేని, జనతా ప్రజాతంత్ర జీవితం గడుపుతున్న ప్రజల పై, పోలీస్ చర్య పేరుతో దాడులు చేసి, తిరిగి భూ స్వాములకు భూములు కట్ట బెట్టి, సుమారు 40,000 మందిని పొట్టన బెట్టుకుని, అరాచకాలు సాగించిన "ఆపరేషన్ పోలో " కి బాధ్యులైన వారు, వారి వారసులు ఈ పోరాట ప్రాంతానికి ఏదో ఒక రోజు తప్పకుండ సమాధానం చెప్పే రోజు వస్తుంది.

*తెలంగాణ రైతంగా పోరాట ప్రాంతాలకి" సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విద్రోహ దీనమే."*



**అనంతుల మధు**
తెలంగాణ యువజన సంఘము
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
9505866698

# ప్రైవేట్ పాఠశాలలో "గవర్నింగ్ బాడీ" పనిచేస్తుందా?




నేటి పోటీ ప్రపంచంలో నాణ్యమైన విద్య పేరుతో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల భారము మధ్యతరగతి కుటుంబాల వెన్ను విరుస్తోంది. బుక్స్, యూనిఫాం, రవాణా, అడ్మిషన్ ఫీజు, స్కూల్ ఫీజు వంటి రకరకాల రుసుములతో తల్లిదండ్రుల జేబులకు చిల్లు పడుతుంది. నేషనల్ శాంపిల్ సర్వే 2025 ప్రకారం తెలంగాణలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థిపై కుటుంబ వ్యయం రూ.2,609 కాగా, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలో రూ.38,479. అంటే ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాల వ్యయం ప్రభుత్వ పాఠశాల కంటే దాదాపు 14.7 రెట్లు ఎక్కువ. ఇది జాతీయ సగటు రూ.28,693 కంటే అధికం. ఈ అన్యాయమైన వసూళ్లు, పారదర్శకతలేని ఫీజులను ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై నిఘా పెట్టింది. ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలు తరగతివారీ ఫీజు వివరాలను నోటీస్ బోర్డ్ పై ప్రదర్శించాలని, పాలక మండలి (గవర్నింగ్ బాడీ) సభ్యుల సంతకాలతో అధికారిక పత్రం ఉండాలని పేర్కొన్నది. సంబంధిత పరిపాలనా/ఆర్థిక నివేదికలను సమర్పించాలని కూడా ఆదేశించింది. ఈ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. G.O.Ms.No.1, Education (P.S.2), తేదీ 01-01-1994లోని నిబంధన 11 లో భాగంగా విద్యాశాఖ ఈ చర్యలు తీసుకోబోతుంది. ఈ నిబంధన ప్రకారం విద్యార్థులు లేదా తల్లిదండ్రుల నుంచి గవర్నింగ్ బాడీ నిర్ణయించిన ఫీజుకు మించి ఇతర పేర్లతో ఫీజు లేదా డొనేషన్లు వసూలు చేయరాదనే షరతు ఉంది. రూల్ 18 ప్రకారం అన్‌ఎయిడెడ్ పాఠశాలకు స్వంత ఫీజు నిర్మాణం ఉండాలి, దానిని నిర్ణయించే అధికారం గవర్నింగ్ బాడీకి ఉంది. ఈ క్రమంలో 1994 నాటి పలు నిబంధనలు 2026లో మళ్లీ చర్చకు వచ్చాయి. విద్యను వ్యాపారంగా మార్చకుండా, ఫీజుల వసూళ్లకు అడ్డుకట్ట వేసి, ప్రభుత్వ పర్యవేక్షణ బలపడాల్సిన అవసరాన్ని ఈ నిబంధనలు/రూల్స్ గుర్తుచేస్తున్నాయి.

**ఫీజు నియంత్రణలో గవర్నమెంట్ బాడీ పాత్ర!**

తాజా యుడైస్ ప్లస్ 2025-26 గణాంకాల ప్రకారం తెలంగాణలో ప్రైవేట్ పాఠశాలల్లో 64.5 శాతం మంది విద్యార్థులు చదువుతుండగా... ప్రభుత్వ పాఠశాలల వాటా 34.5శాతానికి కి పడిపోయింది. ప్రైవేట్ విద్య వైపు మొగ్గు చూపుతున్న తల్లిదండ్రుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలో విద్యా నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనం వంటి నియంత్రణ చర్యలు అత్యవసరం. తెలంగాణలోని ప్రైవేట్ పాఠశాలలు ప్రధానంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యా చట్టం-1982, దాని నిబంధనల ప్రకారం కొనసాగుతున్నాయి. రాష్ట్ర విభజన అనంతరం కూడా ఈ చట్టం అమల్లో ఉంది. G.O.Ms.No.1, తేదీ 01-01-1994 ద్వారా ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల స్థాపన, గుర్తింపు, పరిపాలన, నియంత్రణకు సంబంధించిన రూల్స్/నిబంధనలు అమలులోకి వచ్చాయి. ఈ నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠశాల నిర్వహణ యాజమాన్యం వ్యక్తిగతం కాదు. గవర్నింగ్ బాడీకి పరిపాలనలో కీలకమైన పాత్ర నిర్దేశించబడింది. రూల్ 15 ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాల పాలక మండలి ఏర్పాటు చేయాలి. ఈ బాడీలో 1.విద్యా సంస్థ యాజమాన్య ప్రతినిధి, 2.పాఠశాల కరస్పాండెంట్, 3.ప్రధానోపాధ్యాయులు, 4. ఉపాధ్యాయుల నుంచి ఒక ప్రతినిధి, 5.పేరెంట్ టీచర్ అసోసియేషన్ అధ్యక్షులు, 5.జిల్లా విద్యాధికారి నామినేట్ చెందిన ఒక విద్యావంతురాలైన తల్లి ఉంటారు. ఈ ఐదుగురి పాలక మండలి విద్యా సంవత్సరం ఆరంభంలోనే సమావేశమై వివిధ తరగతులకు వసూలు చేయాల్సిన ఫీజు నిర్మాణం, సిబ్బంది వేతనాలపై నిర్ణయాలు తీసుకోవాలి. అడ్మిషన్స్ పూర్తయిన తరువాత పాఠశాల ఆదాయ-వ్యయ పరిస్థితిని సమీక్షించి గత నిర్ణయాలను ఆమోదించాలి లేదా అవసరమైతే సవరించవచ్చు. సంవత్సరానికి కనీసం మూడు సమావేశాలు నిర్వహించడం, సభ్యులకు ముందస్తు రాతపూర్వక నోటీసు ఇవ్వడం, అవసరమైన కోరం పాటించడం వంటి అంశాలు కూడా ఈ వ్యవస్థలో భాగం. అదే సమయంలో రూల్ 18 ప్రకారం ఫీజు నిర్ణయించేటప్పుడు ఉపాధ్యాయుల జీతాలు, భవన అద్దె, భవన నిర్వహణ, విద్యుత్, నీరు, కార్యాలయ ఖర్చులు, తరగతి గది అవసరాలు, లైబ్రరీ, ల్యాబొరేటరీ, ఆడిట్ తదితర వాస్తవ వ్యయాలన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. ఈ ప్రజాస్వామ్య నిర్ణయాలు పారదర్శకత, జవాబుదారి తనాన్ని పెంచుతాయి.


**కాగితాలకే పరిమితమైన 'గవర్నమెంట్ బాడీ'!**

నేడు అనేక ప్రైవేట్ పాఠశాలల్లో గవర్నింగ్ బాడీ నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ ఏర్పడిన కేవలం రికార్డులకే పరిమితమైనది. పేరెంట్ టీచర్ అసోసియేషన్ ప్రతినిధి, ఉపాధ్యాయ ప్రతినిధి, తల్లిదండ్రుల ప్రతినిధులకు నిజమైన నిర్ణయాధికారం ఉందా? ఫీజు పెంపుపై వారి అభిప్రాయం తీసుకుంటున్నారా? అనేది ప్రశ్నార్థకమే. మెజార్టీ తల్లిదండ్రుల కు అసలు ప్రైవేట్ పాఠశాలలో పాలక మండలి ఉంటుందనే విషయం కూడా తెలియదు. కొన్ని పాఠశాలలో సమావేశాలు నిర్వహించకుండా లేదా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రాతినిధ్యాన్ని నామమాత్రంగా ఉంచి యాజమాన్యం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. అయినా ప్రభుత్వాలు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నాయి. మెజార్టీ విద్యాసంస్థల స్థాపన, నిర్వహణలో ఆధిపత్య కులాలే ఉండడం, అలాగే అధికారంలోని అగ్రవర్ణ నాయకులే ప్రైవేట్ విద్యాసంస్థల్లో భాగస్వాములు కావడంతో ప్రభుత్వ నియంత్రణ బలహీనపడింది. అంతేకాకుండా ఆ విద్య సంస్థల ఎన్నికల ఫండింగ్ ప్రయోజనాలు కఠిన చర్యలకు అడ్డంకిగా మారాయి. దీంతో చట్టాలు ఉన్నప్పటికీ వాటిని కఠినంగా అమలు చేయడం లేదు. విద్య హక్కు చట్ట-2009 ప్రకారం ప్రజల భాగస్వామ్యానికి ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీని ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీకి సమావేశాలు, తల్లిదండ్రుల భాగస్వామ్యం, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, నిధుల వినియోగంపై పర్యవేక్షణ వంటి బాధ్యతలు ఉంటాయి. మరి భారీ సంఖ్యలో విద్యార్థులు చదువుతున్న ప్రైవేట్ పాఠశాలల్లో ఇలాంటి కమిటీలకు స్థానం లేకపోవడం శోచనీయం. పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం లేకుండా విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం సాధ్యం కాదు. కాగితాలపై ఉన్న గవర్నింగ్ బాడీలు అమలయ్యేలా చర్యలు చేపట్టాలి. ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లోనూ పాఠశాల యాజమాన్య కమిటీలను ఏర్పాటుకు విద్యా హక్కు చట్టాన్ని సవరించాలి. తద్వారా యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలకు అడ్డుకట్ట వేయవచ్చు. వ్యాపార దృక్పథంతో కొనసాగుతున్న ప్రైవేట్ విద్యా వ్యవస్థకు అడ్డుకట్ట వేయాలంటే వాటి నియంత్రణతో పాటు ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలి. అప్పుడే అందరికీ నాణ్యమైన, సమాన విద్య అందుతుంది.



**సంపతి రమేష్ మహారాజ్**
సామాజిక విశ్లేషకులు
7988579428

## చరిత్రను వక్రీకరిస్తే అది చెరిగిపోదు, ఇది మట్టిమానషులు చరిత్ర



1946 సెప్టెంబర్ 11 నుండి 1951 అక్టోబర్ 21 వరకు ఐదు సంవత్సరాల పాటు వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగింది. ప్రపంచ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించదగిన పోరాటమిది. దేశ స్వాతంత్రం వచ్చేనాటికి 565 సంస్థానాలు ఉన్నాయి. వీటిలో అతిపెద్ద రాజ్యం హైదరాబాద్ సంస్థానం. నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పరిపాలిస్తున్నాడు. తెలంగాణతో పాటు ప్రస్తుత కర్ణాటక మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు ఆనాడు హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉన్నాయి. తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం గ్రామాలలో భూస్వాములు, జమీందారులు, దేశముక్, జగిర్దార్ల, దోపిడీకి అణిచివేతకు వ్యతిరేకంగా సాగిన పోరాటం అది. గ్రామ ప్రజలంతా భూస్వాములకు వెట్టిచాకిరి చేయాలి. భూస్వాముల భూమి దునిన్న తర్వాతనే తమ సొంత భూమిని సాగు చేయాలి .అనుకూల సమయంలో భూస్వాముల భూమిని దున్ని విత్తనాలు వేసి నాట్లు నాటి ఆ తర్వాత తమ భూమిలో అడుగు పెట్టాలి. అప్పటికి అనుకూల వాతావరణ పరిస్థితులు ఉండవు. ఫలితంగా తమ భూమిలో తగినంత పంట పండేది కాదు. తాము కట్టవలసిన పన్నులు పోగా తినడానికి తిండి మిగిలేదే కాదు. భూస్వాములకు అప్పుల పాలయ్యేవారు. దీంతో వెట్టి చాకిరి చేయవలసి వచ్చేది. వృత్తిదారులు తమ ఉత్పత్తులు ఉచితంగా ఇవ్వాలి. అన్ని ఇచ్చినా సరే దొర, జమీందారులు తృప్తి పడే వారే కాదు. కులవృత్తులన్నిటిమీద పన్ను కూడా చెల్లించాలి. పెళ్లి అయినా చావు కైనా పన్ను తప్పదు. జమీందారులకు కూడా పన్ను చెల్లించవలసిందే. పన్ను కట్టలేక పారిపోయిన రైతులను వెతికి పట్టుకోవచ్చి చిత్రహింసలు పెట్టి మరీ పన్నులు వసూలు చేసేవారు . భూస్వామి కన్నుబడ్డ మహిళలను వదిలే వారే కాదు.

భాషా సాంస్కృతిక వివక్షత కొనసాగేది. తెలుగు మాట్లాడితే చిన్న చూపుతో చూసే ధోరణి ఉండేది. ఉర్దూ లేదా మరాఠీ మాట్లాడే వారిని గౌరవంగా చూసేవారు. తెలుగులో చదువుకునే అవకాశం లేదు .ఆర్థిక, సామాజిక , సాంస్కృతిక సమస్యల నిలయంగా ఆనాటి తెలంగాణ ఉండేది. ఆ సమస్యలే గ్రామాల్లో భూస్వామ్య , దోపిడీ , పెత్తందారీ తనానికి వ్యతిరేకంగా 1930లో ఆంధ్ర మహాసభ ఏర్పడింది. ఈ ఆంధ్ర మహాసభ తెలుగు భాషా, సాంస్కృతిక సమస్యల మీద కృషి చేసింది. క్రమంగా అది భాషా పరమైన సమస్యలకే పరిమితం కాకుండా రైతులు, కూలీలు గ్రామీణ పెత్తందారుల దోపిడీ , మాతృభాషకు తగిన స్థానం దక్కకపోవడం ఆంధ్ర మహాసభలో అత్యధికులను కదిలించింది. బలవంతపు వసూళ్లు అధిక పన్ను భరించలేక ప్రజలు ఆంధ్ర మహాసభకు దగ్గరయ్యారు. సంఘం పేరుతో సభ్యులయ్యారు. సంఘం తమ సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుంది అని గట్టి నమ్మకం. అందుకే అన్యాయాన్ని ప్రశ్నించే వారంతా సంఘంలో సభ్యులయ్యారు.

1944లో భువనగిరి సభతో ఆంధ్ర మహాసభ స్వభావం మారింది. సాంస్కృతిక సంఘంగా మాత్రమే పరిమితం కాలేదు. అది రైతాంగ సమస్యల మీద పోరాట సంఘంగా అవతరించింది. సంఘం పేరుతో రైతాంగ గుండెల్లో నిలిచిపోయింది. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి వంటి వారి నాయకత్వంలోకి వచ్చారు. అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికయ్యారు . ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, ఆరుట్ల రామచంద్రారెడ్డి ,తదితరులు ఆంధ్ర మహాసభ కార్యకర్తలుగా ఉన్నారు. ఇకనుంచి జనం సంఘంగానే పిలుచుకున్నారు. అన్యాయాలను అరాచకాలను ప్రశ్నించడం మొదలు పెట్టారు. వెట్టిచాకిరికి వ్యతిరేకంగా మొదలైన ఈ ప్రతిఘటన ఉద్యమం క్రమంగా భూ పోరాటంగా మారింది. దున్నేవానికే భూమి దక్కాలని నినదించింది. సోమరిపోతులుగా ఉండి పెత్తనం చేయడం ఇక చెల్లదని భూస్వాములు, జమీందారులు, దేశముక్‌ల మీద తిరుగుబాటు ప్రకటించి౦ది. నిజాం పునాదులను కదిలించింది. నిరంకుశ పాలన కుప్పకూలే స్థితి ఏర్పడింది. గోల్కొండ ఖిల్లా కిందా నీ గోరిగడతం కొడుకు అని ఉద్యమకారులు నిజాం నవాబు గల్లా బట్టి గుంజి నడి బజార్లో ప్రజా కోర్టులో నిలబెట్టే పరిస్థితి ఏర్పడింది. ఇంకా ఏమాత్రం ఆలస్యమైనా నిజాం రాచరిక సౌధం కుప్పకూలడం ఖాయం తెలంగాణ గడ్డమీద ఎర్రజెండా కమ్యూనిస్టులు కైవసం చేసుకోవడం ఖాయం అన్న పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యం నెహ్రూ, పటేల్ ప్రభుత్వంకు ఇష్టం లేదు. ఇదే జరిగితే భవిష్యత్తు భారత దేశ పరిస్థితి ఎట్లా ఉంటుందో ఊహించలేనంత అమాయకులు కాదు వారు. అందుకే ఆగమేఘాల మీద సైన్యాన్ని తరలించారు. 1948 సెప్టెంబర్ 13న పటేల్ సైన్యం హైదరాబాద్ సంస్థానంలో అడుగుపెట్టాయి. అప్పటికే జబ్బలు జారేసి నిజాం రాజు సెప్టెంబర్ 17న సంస్థానాన్ని ఇండియన్ యూనియన్ లో విలీనం చేస్తున్నట్టు ప్రకటించాడు.

నిజాం పాలన అంతం కావాలని ప్రాణాలకు తెగించి పోరాడుతున్న తెలంగాణ ప్రజల మీద రాజ ప్రముఖ పేరుతో కూర్చోబెట్టాడు. యుద్ధంలో లొంగదీసుకున్నామన్నా పటేల్ సైన్యం శత్రువులను శిక్షించలేదు అందలం ఎక్కించి సకల సౌకర్యాలు కల్పించి సర్దార్ పటేల్ ఉక్కుమనిషి సైన్యాన్ని పంపి నిజాం రాజును లొంగదీసుకున్నాడని ఆర్ఎస్ఎస్ బిజెపి ప్రచారం చేస్తోంది. యధాతథంగా ఒప్పందం చేసుకున్న విషయాన్ని కావాలనే దాచి పెడుతున్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దాటికి తట్టుకోలేక రాజు చేతులెత్తేస్తేనే ఆ సమయంలో పటేల్ సైన్యం రంగంలోకి దిగింది. ఈ విషయాన్ని కావాలనే విస్మరిస్తున్నారు. పటేల్ సైన్యాలు వచ్చి ఉండకపోతే నిజాం రాచరికం కుప్పకూలేది తెలంగాణ కమ్యూనిస్టుల వశమయేది. భూస్వామ్య వ్యవస్థ రద్దు అయ్యేది. దున్నేవాడికే భూమి దక్కేది. నిరంకుశ నిజాం రాజును నరహంతక రజాకార్ల నాయకుడు కాసిం రజ్వికి ప్రజా కోర్టులో శిక్ష పడేది.పటేల్ సైన్యాలు రంగంలోకి దిగి నిజాం రాజును కాసిం రజ్వి ని భూస్వాములను కాపాడారు. తెలంగాణ గడ్డ కమ్యూనిస్టుల వశం కాకుండా అడ్డుకున్నారు. పేదలు దక్కించుకున్న భూములు గుంజుకొని మళ్లీ భూస్వాములకు అప్పగించారు. హైదరాబాద్ సంస్థానాన్ని వదిలిపెట్టిన , వదిలిపెట్టి పారిపోయిన వారంతా పటేల్ సైన్యాల రాకతో మళ్లీ గ్రామాలకు తరలివచ్చారు. పటేల్ సైన్యం వారికి పూర్తి భద్రత కల్పించింది. కమ్యూనిస్టు నాయకత్వంలో సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తిరుగుబాటు జరిపిన వారిని అణచివేసే పని మొదలుపెట్టారు. రైతాంగ పోరాటం సాగకపోతే 1948 సెప్టెంబర్ 17 హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయ్యేదే కాదు. ఆ ఘట్టం చరిత్రలో ఉండేదే కాదు. ఇది పూర్తిగా భారత దేశంలో విలీనం కావడం ఎర్ర జెండా విజయమే. సుదీర్ఘ కాలం పాటు సాగిన వీరోచిత రైతాంగ పోరాటం ఫలితంగా విలీనం కోరుకున్న తెలంగాణ ప్రజలు దానికోసం డిమాండ్ చేస్తూ వచ్చిన కమ్యూనిస్టు పార్టీ ఈ విలీనాని ఆహ్వానించింది. అప్పటికే పేద రైతులు సాగు చేసుకుంటున్నా పది లక్షల ఎకరాల భూమి మీద సాగుదారులకే హక్కు ఉండాలని రైతులు కోరుకున్నారు. వారికి నాయకత్వం వహిస్తున్న కమ్యూనిస్టు పార్టీ అదే డిమాండ్ చేసింది. కానీ నెహ్రూ, పటేల్ సైన్యం వచ్చి ఆ భూములు గుంజుకొని భూస్వాముల కు కట్టబెట్టడానికి కమ్యూనిస్టు ఉద్యమాన్ని అణిచివేయడానికి ఈ ప్రతిపాదనను తిరస్కరించారు. పోరాడుతున్న ప్రజల మీద సైన్యం విరుచుకో పడ్డది. రాజు పేరు మారి రాజ ప్రముఖ పేరుతో ఉన్న పాలకులు ఉస్మాన్ అలీ ఖాన్ కాసిం రజ్వీ రజాక్ సైన్యానికి తోడుగా ఇప్పుడు పటేల్ సైన్యం చేరింది.

పటేల్ సైన్యానికి రజాకారులు పూర్తి సహకారం అందించారు. నిరంకుశ పాలన 1500 మందిని పొట్టన పెట్టుకుంది .పటేల్ సైన్యం 2500 మందిని పొట్టన పెట్టుకున్నాయి. అయినా పోరాటాన్ని అనచడం సైన్యానికి కూడా సాధ్యం కాలేదు. భూమి మీద హక్కులు ఇవ్వకుండా భూమి పంచకుండా పోరాటం ఆగదని నెహ్రూ ప్రభుత్వానికి అర్థమైంది. రక్షిత కౌలుదారి చట్టం 1951లో ప్రకటించింది. భూసంస్కరణ అమలు చేస్తానని వాగ్దానం చేసింది. ఈ నేపథ్యంలో 1951 అక్టోబర్ 21న సాయుధ రైతాంగ పోరాటాన్ని విరమించారు.



**మాలోతు సాగర్**
యంసీపీఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు
సెల్ నెంబర్ 7013805411

# అన్ని రంగాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి కృషి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడిఓసీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ మరియు చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లాకు విచ్చేసిన మంత్రికి జిల్లా కలెక్టర్ అంకిత్ పూల మొక్కను అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రజా పాలన దినోత్సవ సందేశాన్ని అందించారు. అనంతరం పత్రికా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 17వ తేదీ తెలంగాణ చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రోజన్నారు. హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. యువతకు నాణ్యమైన విద్య, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా విద్యా సంస్థలు, మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సాగునీరు, విద్యుత్, మార్కెటింగ్, రవాణా సౌకర్యాలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు విస్తృతమైన సహజ వనరులు, అటవీ సంపద, గిరిజన సంస్కృతి, బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. సింగరేణి సంస్థ ద్వారా బొగ్గు ఉత్పత్తి, పాల్వంచ థర్మల్ పవర్ స్టేషన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిలో జిల్లా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జిల్లాలో మెడికల్ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీతో పాటు ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుతో విద్యా, వైద్య రంగాల్లో మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి రహదారి, రైల్వే కనెక్టివిటీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు . పాండురంగాపురం నుంచి మాల్కంగిరి వైపు రైల్వే మార్గం అభివృద్ధి ద్వారా భద్రాచలానికి రైల్వే కనెక్టివిటీ కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అమరావతి--జగదల్‌పూర్ జాతీయ రహదారిని కొత్తగూడెం, భద్రాచలం మీదుగా నాలుగు లేన్లుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కొత్తగూడెం-ఇల్లెందు-హైదరాబాద్ మార్గాన్ని మరింత సులభతరం చేయడంతో పాటు జిల్లాలోని ఇతర ప్రధాన రహదారులను అభివృద్ధి చేసేందుకు కూడా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. రహదారి, రైల్వే రవాణాతో పాటు గోదావరి నదీ మార్గం ద్వారా రవాణా అవకాశాలను అభివృద్ధి చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు సులభంగా చేరుకునేలా రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా జిల్లాలో పర్యాటక రంగానికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా, పర్యాటకం, మౌలిక వసతులు తదితర అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎం. విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి,జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీ సకాలంలో పూర్తి చేయాలి

- బీఎల్ఓలకు ఘట్కేసర్ సర్కిల్ డీసీ వాణిరెడ్డి ఆదేశం



**కీసర, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** తెలంగాణలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా అర్హులైన ప్రతి వ్యక్తికి నోటీసులను సకాలంలో, క్రమబద్ధంగా పంపిణీ చేయాలని ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణిరెడ్డి బీఎల్ఓలను ఆదేశించారు. నాగారం డివిజన్ కార్యాలయంలో గురువారం బీఎల్ఓలతో నోటీసుల పంపిణీపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వాణిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి బీఎల్ఓ తమకు కేటాయించిన పోలింగ్‌స్టేషన్ పరిధిలో నోటీసుల పంపిణీ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. నోటీసులు అందజేసిన వివరాలతోపాటు, స్వీకరణ సంతకాలు, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. నోటీసు అందుబాటులో లేని వ్యక్తుల విషయంలో నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నోటీసుల పంపిణీలో ఎలాంటి జాప్యం లేకుండా, నిర్దేశిత గడువులో ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేలా బీఎల్ఓలు సమన్వయంతో పనిచేయాలని, నోటీసుల పంపిణీ పురోగతిని ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు నివేదించాలని వాణిరెడ్డి సూచించారు.

## రాహుల్ గాంధీ ప్రధాని కావాలంటూ పాదయాత్ర

- పాదయాత్రకు ఘన స్వాగతం పలికిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**సంగారెడ్డి, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలనే ఆకాంక్షతో ఒంగోలుకు చెందిన ఏపీ హైకోర్టు అడ్వకేట్ వెంకటేశ్వర్లు చేపట్టిన పాదయాత్ర గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాదయాత్రకు స్వాగతం పలికి, వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. అనంతరం పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలనే ఆకాంక్షతో వెంకటేశ్వర్లు కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. ఇప్పటివరకు నాలుగు రాష్ట్రాల మీదుగా సుమారు 1,590 కిలోమీటర్లు నడిచి వేలాది మంది ప్రజలను కలుసుకున్నారని తెలిపారు. పాదయాత్రలో భాగంగా హోటళ్లు, టీ స్టాళ్లు, పొలాలు, పరిశ్రమలు తదితర ప్రాంతాల్లో సామాన్య ప్రజలను కలుసుకుని వారి అభిప్రాయాలను వెంకటేశ్వర్లు తెలుసుకుంటున్నారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఇప్పటివరకు సుమారు 30 వేల మందిని కలుసుకున్నారని, కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు సుమారు 4,500 కిలోమీటర్ల పాదయాత్రలో రెండు లక్షలకు పైగా ప్రజలను కలుసుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని చెప్పారు. రాహుల్ గాంధీ పాదయాత్రలు, ఆయన కుటుంబం దేశం కోసం చేసిన త్యాగాలను ప్రజలకు వివరిస్తూ వెంకటేశ్వర్లు ఈ యాత్ర కొనసాగిస్తున్నారని జగ్గారెడ్డి అన్నారు. పాదయాత్ర పూర్తయిన అనంతరం వెంకటేశ్వర్లును స్వయంగా తీసుకెళ్లి రాహుల్ గాంధీని కలిపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల తో పాజి అనంత కిషన్, జూలకంటి ఆంజనేయులు, శ్రీహరి, రామ్ రెడ్డి, ప్రభు గౌడ్,. తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రిలో మరో భారీ ఆర్థిక మోసం..!

- అధిక వడ్డీ, భారీ రాబడుల ఆశ చూపి లక్షలు వసూలు చేశారంటూ ఆరోపణలు
- న్యాయం కోసం ఇంటి ఎదుట ధర్నా.. నిద్రమాత్రలు మింగిన మహిళ



**భద్రాచలం, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** భద్రాచలంలో మరో భారీ ఆర్థిక మోసం వెలుగుచూసింది. అధిక వడ్డీలు, భారీ రాబడులు వస్తాయంటూ నమ్మించి తమ వద్ద నుంచి లక్షలాది రూపాయలు తీసుకున్నారని ఆరోపిస్తూ పలువురు బాధితులు గురువారం 'భద్రాద్రి' అనే వ్యక్తి ఇంటి ఎదుట ధర్నాకు దిగారు. తమ కష్టార్జిత సొమ్మును తిరిగి ఇప్పించాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కష్టపడి కూడబెట్టుకున్న డబ్బులను నమ్మకంతో అప్పగించామని, అయితే ప్రస్తుతం సొమ్ము తిరిగి రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి తిరిగి చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**ధర్నా వద్ద కలకలం.. మహిళ ఆత్మహత్యాయత్నం**

బాధితుల ధర్నా కొనసాగుతున్న సమయంలో ఓ మహిళా బాధితురాలు తీవ్ర మనోవేదనకు గురై నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వెంటనే అప్రమత్తమైన తోటి బాధితులు, స్థానికులు ఆమెను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సకాలంలో చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పినట్లు సమాచారం.

తమ నుంచి తీసుకున్న డబ్బులను వెంటనే తిరిగి చెల్లించాలని బాధితులు డిమాండ్ చేశారు. సొమ్ము తిరిగి అందే వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చిచెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం



**కాప్రా, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పేర్కొన్నారు. గురువారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఈసీ నగర్ సీనియర్ సిటిజన్ భవన లో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పది సంవత్సరాల సుదీర్ఘ కాలంలో ఏ ప్రభుత్వాలూ అందించని విధంగా, ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నూతన రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను చేపట్టిందని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి వేచి చూస్తున్న పేద, నడివయస్సు, ఎగువ దిగువ తరగతుల కుటుంబాలకు ఈ నిర్ణయంతో ఎంతో ఊరట లభించిందని, ఈ రకమైన ప్రజాక్షేమ సంక్షేమ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు బొడిగ రవి గౌడ్, బొడిగ ప్రభు గౌడ్, కడియాల భరత్, శంకర్ నాయక్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీతోనే మహేశ్వరం మండలం అభివృద్ధి

- మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలి
- ఎఫ్‌సీడీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన మహేశ్వరం మండల ప్రజలు



**మహేశ్వరం, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** మహేశ్వరం మండలంలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేస్తానే మహేశ్వరం మండలం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి అన్నారు. ఫ్యూచర్ సిటీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం మహేశ్వరం మండల కేంద్రం నుంచి ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయం వరకు ప్రజలు భారీ ర్యాలీతో బయలుదేరి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ రఘుపతి మాట్లాడుతూ...ఫ్యూచర్ సిటీతోనే మహేశ్వరం మండలం అభివృద్ధి చెందుతుందన్నారు. మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలన్నారు. మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయకుండా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కుట్రలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచులు తమ గ్రామాల అభివృద్ధి, మహేశ్వరం మండల ప్రజల అభివృద్ధి,సంక్షేమం కోసం,భవిష్యత్ అభివృద్ధి కోసం తమ గ్రామ పంచాయతీలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని గ్రామ పంచాయతీలల్లో తీర్మానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేష్ యాదవ్,జేఏసీ గౌరవ అధ్యక్షుడు మనోహర్,సర్పంచులు దేవేందర్ నాయక్,చేపంగి ప్రవీణ్,గొల్లూరి రాజు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకి ఈశ్వర్,ఆవుల యాదయ్య,వర్కల యాదగిరి గౌడ్, ఫ్యూచర్ సిటీ జేఏసీ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పొదుపు, పెట్టుబడులపై విద్యార్థులకు అవగాహన



**హయత్‌నగర్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్‌నగర్‌లో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బీఏ విద్యార్థులకు 'పొదుపు మరియు పెట్టుబడులు' అంశంపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా సెబీ సర్టిఫైడ్ మోటివేటర్, ట్రైనర్ మూచ్చ శ్రీనివాస్ రెడ్డి హాజరై, విద్యార్థులకు పొదుపు, పెట్టుబడులకు సంబంధించిన వివిధ మార్గాలను వివరించారు. పెట్టుబడుల్లో ఉండే రిస్క్‌లను ఎలా ఎదుర్కోవాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ, విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే సంపాదనతో పాటు పొదుపు, సరైన పెట్టుబడి విధానాలపై అవగాహన కలిగి ఉండటం అవసరమని అన్నారు. అర్థశాస్త్ర విభాగాధిపతి వి. ఇందిర మాట్లాడుతూ అధిక లాభాల కోసం ఆశపడకుండా చట్టబద్ధమైన పెట్టుబడి విధానాలను మాత్రమే అనుసరించాలని సూచించారు. మోసపూరిత ఫోన్ కాల్స్, మొబైల్ యాప్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకులు షేక్ మహబూబ్, డి. రమాదేవితో పాటు కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, కొత్తగూడెంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్య మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ , హైదరాబాద్ సంస్థ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా రూ.67.41 లక్షల విలువైన ఆధునిక వైద్య, ఆసుపత్రి పరిశుభ్రత పరికరాలను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అందజేసింది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ సమక్షంలో ఈసిఐఎల్ అధికారులు ఈ పరికరాలను ఆసుపత్రి అధికారులకు అందజేశారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా అందజేసిన పరికరాల్లో ఐసీయూ సేవల కోసం 3-ఫంక్షన్ రిమోట్ ఆపరేటెడ్ ఫౌలర్ కాట్స్, నేత్ర వైద్య సేవల కోసం ఆప్తాల్మిక్ ఆపరేటింగ్ మైక్రోస్కోప్, ఫుట్ అడ్జస్ట్మెంట్ సదుపాయంతో కూడిన ఆప్తాల్మిక్ ఎలక్ట్రిక్ ఆపరేషన్ టేబుల్, ఆర్థోపెడిక్ డ్రిల్ యూనిట్ విత్ యాక్సెసరీస్, వాక్యూమ్ అసిస్టెడ్ క్లోజర్ (వాజ) మెషిన్ ఉన్నాయి. అదేవిధంగా ఆసుపత్రి పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు స్క్రబ్బింగ్ మెషిన్, కాంపాక్ట్ వాక్-బిహైండ్ స్వీపర్, హై-ప్రెజర్ వాషర్ వంటి పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూలి , సిఎస్ ఆర్ సంస్థల సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రులకు అందుతున్న వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అందుబాటులోకి వచ్చిన ఆధునిక పరికరాలతో ఐసీయూ, నేత్ర, ఆర్థోపెడిక్ తదితర వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. రోగులకు సకాలంలో అవసరమైన వైద్యం అందేలా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అంకిత్ ఆసుపత్రి క్యాజువాలిటీ విభాగాన్ని సందర్శించి అక్కడి వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యం కోసం వేచి ఉన్న ఓ రోగిని గమనించిన కలెక్టర్, ఎందుకు వేచి ఉన్నారు, సమస్య ఏమిటని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఓపీ సమయం ముగిసిన అనంతరం ఆసుపత్రికి వచ్చినందున వేచి ఉన్నట్లు రోగి తెలిపాడు. వెంటనే స్పందించిన కలెక్టర్, ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన అత్యవసర వైద్య సేవలు అందించాలని సంబంధిత వైద్య సిబ్బందిని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చే రోగులకు తక్షణ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వైద్య సేవల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. అదేవిధంగా ఆసుపత్రి పరిశుభ్రతకు అందజేసిన పరికరాలను సమర్థవంతంగా వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు, వైద్య విభాగాలు పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని, రోగులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈసిఐఎల్ సంస్థ తరపున డైరెక్టర్ (పర్సనల్) కన్నెన్ వి.ఎ.ఎస్., సీఎంఓ అండ్ ఇన్‌చార్జి డా. పి. వేణుబాబు, డిప్యూటీ మేనేజర్ సునీల్ కుమార్ జె. డిప్యూటీ మేనేజర్ (సివిల్) అనిల్ కుమార్ ఏ, ఈసీఓఏ అధ్యక్షులు పూర్ణచందర్ పి. ఫోటోగ్రఫీ అధికారి సాంబమూర్తి పాల్గొన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. రాధామోహన్, ఝూా సునీత, ఆసుపత్రి సీనియర్ అధికారులు, వైద్యులు, నర్సింగ్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**హాలియా, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** అనుముల మండల పరిధిలోని 14వ మైలు చెక్‌పోస్ట్ వద్ద గణేష్ నిమజ్జన కార్యక్రమం కోసం చేపడుతున్న ఏర్పాట్లను నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య శాఖల అధికారులను ఆదేశించారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, అత్యవసర సేవలు, బారికేడింగ్ తదితర ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని తెలిపారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా మరియు పరిశుభ్రమైన వాతావరణంలో జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ రెవెన్యూ అధికారి రమణారెడ్డి , డీఎస్పీ రవి, సీఐ, రాఘవరావు తహసీల్దార్, చందర్ రావు హాలియా మున్సిపాలిటీ చైర్మన్, చింతల చంద్ర రెడ్డి మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, హాలియా ఎస్ఐతో సాయి ప్రశాంత్ పాటు అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- పారదర్శకంగా ప్రజలకు ప్రభుత్వ సేవలు
- దివ్యాంగులకు సహాయ పరికరాల పంపిణీ
- సంగారెడ్డిలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్యానికి శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రభుత్వ సేవలు అందించేందుకు ప్రజాపాలనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి వారి సమస్యలను తెలుసుకుని సత్వర పరిష్కారం చూపేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు, పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి అర్హులు ప్రయోజనం పొందేలా చూడాలని సూచించారు.

**అమరవీరులకు ఘన నివాళి**

అంతకుముందు మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

**దివ్యాంగులకు రూ.13.10 లక్షల విలువైన పరికరాలు**

ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత సహాయ పరికరాలను పంపిణీ చేశారు. తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ, హైదరాబాద్ ఆధ్వర్యంలో గ్లోబల్ గ్రీన్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, సంగారెడ్డి సహకారంతో సుమారు రూ.13.10 లక్షల విలువైన 21 బ్యాటరీ ట్రైసైకిళ్లు, ఒక బ్యాటరీ ఆటో అందజేశారు.
దివ్యాంగులు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఈ సహాయ పరికరాలు దోహదపడతాయని అధికారులు తెలిపారు. అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వం, వివిధ సంస్థల సహకారంతో అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.
కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, అదనపు కలెక్టర్లు పాండు, సంగీత, జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి లలితకుమారి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగ పోరాటానికి స్ఫూర్తి దొడ్డి కొమురయ్య

- సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్



**రాజోళి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** రాజోళి మండల కేంద్రంలో గురువారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ..తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజల కోసం మొట్టమొదటిగా ప్రాణత్యాగం చేసిన మహాయోధుడు దొడ్డి కొమురయ్య అని పేర్కొన్నారు. జమీందారులు, పెత్తందారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ వంటి వీర మహిళలు పోరాడారని తెలిపారు. నాటి దొరల పాలనలో వెట్టిచాకిరీ, అధిక శిస్తులు, బలవంతపు వసూళ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. పంటకు శిస్తు చెల్లించకపోతే దొరలు దౌర్జన్యంగా పంటను ఇళ్ల నుంచి తరలించేవారని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో సుమారు 4 వేల మంది రైతులు ప్రాణత్యాగం చేశారని విజయ్‌కుమార్ తెలిపారు. రైతాంగం, కూలీలు, సామాన్య ప్రజల హక్కుల కోసం కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు చేసిన త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, మద్దిలేటి, మద్దూర్ గోవర్ధన్‌రెడ్డి, రాజశేఖర్మ రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, గౌండరాజు, సౌలు తదితరులు పాల్గొన్నారు.

## ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు




**జడ్చర్ల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** మహిళలను, అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని జడ్చర్ల ఎస్సై మల్లేష్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ డి. జానకి ఆదేశాల మేరకు గురువారం జడ్చర్ల మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో సురక్ష పోలీసు కళాబృందం, మహిళా రక్షణ బృందం (షీ టీమ్), మానవ అక్రమ రవాణా నిరోధక బృందం సంయుక్తంగా ప్రజా భద్రత -- పోలీసు బాధ్యత అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై మల్లేష్ మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, లింగ వివక్షను వీడాలని సూచించారు. అత్యవసర సమయాల్లో 112, షీ టీమ్ నంబర్ 8712659365, మానవ అక్రమ రవాణా నిరోధక బృందం నంబర్ 8712680066 లను సంప్రదించాలని తెలిపారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థపై 1098, సైబర్ నేరాలపై 1930 నంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. మైనర్ డ్రైవింగ్, మాదక ద్రవ్యాల ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్, ఇన్చార్జ్ కృష్ణయ్య నేతృత్వం వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లింగం, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది జయరాణి, సక్రి, వరప్రసాద్, శ్రీరామ ట్రస్ట్ ప్రతినిధి బండి వేణు, కళాబృందం సభ్యులు రాములు, జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు బాధ్యతాయుత పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**వనపర్తి, సెప్టెంబరు 17 (జనంసాక్షి) :** ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి అజెండాతో ప్రజలకు బాధ్యతాయుత పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనమండలి చీఫ్‌విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా గురువారం వనపర్తి ఐడీఓసీ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికను వివరించారు.మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు 3.84 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారని, ఇందుకోసం ప్రభుత్వం రూ.161.16 కోట్లు భరించిందని తెలిపారు. రూ.500కే వంటగ్యాస్ పథకం కింద 85,383 మందికి 5,12,439 సిలిండర్లు పంపిణీ చేసి రూ.15.71 కోట్ల సబ్సిడీ అందించినట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల కింద రూ.7.72 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.రైతు బీమా కింద 702 మంది రైతు కుటుంబాలకు రూ.35.10 కోట్లు, రైతు భరోసా కింద 1,82,768 మంది రైతుల ఖాతాల్లో రూ.212.32 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. కర్నేతండా ఎత్తిపోతల పథకాన్ని రూ.76.19 కోట్లతో పూర్తి చేసి 4,235 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామన్నారు. లోటు వర్షపాతం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 1,83,568 రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, 26,465 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు 1,04,000 మంది కుటుంబ సభ్యులను అదనంగా చేర్చినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన 5,874 ఇళ్లలో 92 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయని, ఇప్పటివరకు రూ.170.84 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. గృహజ్యోతి కింద 85,423 కుటుంబాలకు 21.60 లక్షల జీరో బిల్లులు జారీ చేసి రూ.62.60 కోట్ల సబ్సిడీ అందించినట్లు చెప్పారు.వైద్య రంగంలో జిల్లా ఆసుపత్రి నిర్మాణానికి రూ.203.95 కోట్లు, పెబ్బేరు, ఆత్మకూరులో 50 పడకల ఆసుపత్రుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రూ.200 కోట్ల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. భూ భారతి కింద అందిన 12,851 దరఖాస్తుల్లో 11,403 పరిష్కరించినట్లు



వెల్లడించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు 2,221 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జిల్లా అభివృద్ధికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పట్నం మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీతారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, వినోద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దిగ్వాల్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

- ఎఫ్ఎల్ఎన్ బోధనపై జిల్లా తనిఖీ బృందం పరిశీలన



**కోహిర్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి రోహిణి ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమం అమలు, పాఠశాలల పనితీరును పరిశీలించేందుకు జిల్లా విద్యాశాఖ తనిఖీ బృందం గురువారం కోహిర్ మండలంలోని దిగ్వాల్ ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసింది. మండల విద్యాధికారి శ్రీ జాకిర్ హుస్సేన్‌తో పాటు జిల్లా తనిఖీ బృందం సభ్యులు సురేష్, వల్లభజోషి, సంతోషమ్మ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వివిధ రికార్డులను పరిశీలించడంతో పాటు తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న అసెస్‌మెంట్ ప్రక్రియను కూడా పరిశీలించారు.
కనీస అభ్యసన స్థాయికి చేరేలా బోధన
విద్యార్థులు నిర్దేశించిన కనీస అభ్యసన స్థాయిని సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులు సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధనా కార్యకలాపాలను రూపొందించుకుని, తరగతి గదుల్లో వాటిని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు.
విద్యార్థుల్లో వెనుకబడిన అభ్యసన సామర్థ్యాలను గుర్తించి వారికి ప్రత్యేకంగా రెమిడియల్ టీచింగ్ (పునర్విద్యాబోధన) అందించాలని సూచించారు. విద్యార్థుల పురోగతిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, అవసరమైన చోట అదనపు బోధన అందించాలని అధికారులు పేర్కొన్నారు.
పాఠశాల రికార్డుల నిర్వహణ, విద్యార్థుల అభ్యసన స్థాయిలు, బోధనా పద్ధతులు తదితర అంశాలపై అధికారులు ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచే దిశగా సమష్టిగా పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీలో ప్రధానోపాధ్యాయులు యూసుఫ్‌తార్, ఉపాధ్యాయులు కె. సురేందర్, రాజేశ్వరి, సీఆర్‌పీ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీల అభివృద్ధికి కేసీఆర్ హయాంలో ప్రాధాన్యం

- ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. కొండాపూర్ మండలం శివన్నగూడెం తండా, తమ్మలి భాయ్ తండాల్లో బీఆర్ఎస్ నాయకులు, గిరిజనులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా చింత ప్రభాకర్ మాట్లాడుతూ ఎస్టీల సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక అభివృద్ధి నిధి ద్వారా 2022--23లో రూ.13,412.63 కోట్లు, 2023--24లో రూ.15,232.62 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచుతూ 2022లో నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. గిరిజన రైతుల భూములను సాగులోకి తీసుకురావడానికి గిరి వికాసం పథకం అమలు చేసి, 19,698 మంది రైతులకు చెందిన 56,613 ఎకరాలను సాగులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. గిరిజన విద్యార్థుల కోసం గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, ఐఐటీ, నీట్ శిక్షణ, ఉపకార వేతనాలు వంటి కార్యక్రమాలు అమలు చేశామని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 71 ప్రత్యేక గురుకులాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. గిరిజన ఆవాసాల్లో రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యాల కోసం ప్రత్యేక నిధులు కేటాయించామని, తాగునీటి కోసం రూ.1,000 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. యువతకు ఉపాధి, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాల కోసం శిక్షణ కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2023లో ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ ప్రకటనలోని హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని చింత ప్రభాకర్ డిమాండ్ చేశారు. గిరిజన కార్పొరేషన్, గిరిజన అభివృద్ధి సంస్థల ఏర్పాటు, సమగ్ర గిరిజన అభివృద్ధి పథకం, ప్రతి మండలంలో ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాల ఏర్పాటు వంటి హామీలను అమలు చేయాలని కోరారు.
కార్యక్రమంలో మాజీ డీసీసీబీ ఉపాధ్యక్షుడు పట్నం మాణిక్యం, మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్‌రెడ్డి, డాక్టర్ శ్రీహరి, మాజీ జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు విఠల్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**కృష్ణ, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. కృష్ణ మండల పరిధిలోని కృష్ణా నది వద్ద గణేష్ విగ్రహాల నిమజ్జనం నిర్వహించే ప్రదేశాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీస్ అధికారులతో కలిసి క్షేత్రస్థా యిలో పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తు లు, గణేష్ మండపాల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారు లకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిమజ్జనం సమయంలో ప్రజల భద్ర తకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నది వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. నిమజ్జన ప్రదేశంలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేసి, నిరంతరం ప్రజలకు భద్రతా సూచనలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
కృష్ణా నది వద్ద నీటి ప్రవాహం, లోతు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా ఫైర్ సిబ్బంది, ఎలక్ట్రికల్ శాఖ అధికారులు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు.
గణేష్ విగ్రహాలు నిమజ్జన ప్రదేశానికి చేరుకునే సమయంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్, బారికేడింగ్ తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. భారీ విగ్రహాలు పెద్ద సంఖ్యలో కృష్ణా నది వరకు వచ్చే అవకాశం ఉన్నందున, ఆయా మార్గాల్లో క్షేత్రస్థాయిలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు.
"ఒక నిండు ప్రాణం ఎంతో విలువైనది. నిమజ్జనం సందర్భంగా చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి దారితీసే అవకాశం ఉంది. కాబట్టి ప్రతి ఒక్కరి భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలాంటి అపశృతి జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి" అని ఎస్పీ సూచించారు.
గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులు కూడా పోలీసు అధికారులు సూచించే భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నది లోతైన ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ కోరారు.
నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా రిసోర్స్‌లు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.
జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద గణేష్ విగ్రహాలు కృష్ణా నది వద్దకు వచ్చే అవకాశం ఉన్నందున, నిమజ్జన మార్గాలు, నది పరిసర ప్రాంతాలు, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ పాయింట్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని ఎస్పీ ఆదేశించారు.
గణేష్ నిమజ్జనం శాంతియుతంగా, భక్తి భావంతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సురక్షితంగా పూర్తయ్యేలా పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపడుతుందని ఎస్పీ తెలిపారు. ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు మహేష్ నల్లపు లింగయ్య, సీఐ రామ్ లాల్ విజయ్ భాస్కర్, ఎస్ఐ లు నవీద్, భాగ్యలక్ష్మి రెడ్డి, తాసిల్దార్ శ్రీనివాస్, జిపిఓ, లోకల్ ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

## విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** విశ్వబ్రాహ్మణులు, విశ్వకర్మ కులస్తుల ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని వారి సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. జగదీష్ అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్ విశ్వకర్మ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌చారి, మరో జిల్లా అధ్యక్షుడు అంజనేయులు చారి మాట్లాడుతూ.. విశ్వకర్మ భగవాన్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. విశ్వకర్మ సంఘం కోసం జిల్లాలో ప్రత్యేకంగా సంఘ భవనం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బ్రహ్మం చారి, ప్రధాన కార్యదర్శి నాగభూషణం చారి, మోహన్‌చారి, పాండు చారి, నరేందర్ చారి, వెంకటాచారి, శ్రీనివాస్ చారి, కృష్ణ చారి తదితర సంఘ నాయకులు పాల్గొని విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూజలు చేశారు.

# యువతి వేధింపుల వల్లే సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య

- న్యాయం చేయాలంటూ తల్లిదండ్రుల ఆవేదన



**తాండూర్, సెప్టెంబర్ 17(జనం సాక్షి) :** తమ కుమారుడి మృతికి కారణమైన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని రాజీవ్ నగర్‌కు చెందిన ఉప్రే కిషన్, ఆయన భార్య గౌరు పోలీసు ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. తాండూరులోని ఐబీ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ విలేకరుల సమావేశంలో వారు పాల్గొని తమ ఆవేదనను మీడియా ముందు వ్యక్తం చేశారు.బాధిత తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం... వారి కుమారుడు ఉప్రే ప్రణీత్ కొంతకాలంగా సింగరేణిలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే, ఈ ఏడాది ఏప్రిల్ 22న ప్రణీత్ తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజీవ్ నగర్‌కు చెందిన ఒక యువతి ప్రణీత్ నుండి భారీగా డబ్బు, బంగారం, చైన్లు, ల్యాప్‌టాప్, స్కూటీతో పాటు ఇతర విలువైన వస్తువులను తీసుకుందని వారు ఆరోపించారు. అంతేకాకుండా, సదరు యువతి ప్రణీత్‌ను తీవ్రమైన మానసిక వేధింపులకు గురిచేసిందని, ఆ వేధింపులు తట్టుకోలేకే తమ కుమారుడు బలవన్మరణానికి పాల్పడ్డాడని వారు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై తాండూరు పోలీస్ స్టేషన్, సీఐ కార్యాలయాల్లో ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి న్యాయం జరగలేదని తల్లిదండ్రులు వాపోయారు. ప్రణీత్ మరణించిన తర్వాత పోలీసులు అతని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారని, అందులో ఆత్మహత్యకు గల కీలక ఆధారాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. అయితే, పోలీసులు కేసు నమోదు చేయకుండా కేవలం ఫోన్ మాత్రమే దగ్గర పెట్టుకున్నారని వారు తీవ్ర ఆరోపణలు చేశారు.ఈ విషయంలో న్యాయం కోసం తాము రామగుండం సీపీ కార్యాలయంలో కూడా వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి, తమ కుమారుడి మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఉప్రే కిషన్, గౌరు దంపతులు వేడుకుంటున్నారు.

### తిర్యాణి ఆకాంక్షిత మండల సమగ్ర అభివృద్ధికి

# సీవైడిఓతో ఒప్పందం

- జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17(జనంసాక్షి):** జిల్లాలోని తిర్యాణి ఆకాంక్షిత మండలంలో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేసేందుకు సి.వై.డి.ఓ. సంస్థతో ఒప్పందం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి సి.వై.డి.ఓ. ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చు కున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆకాంక్షిత మండల అభివృద్ధిలో భాగంగా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ప్రాథమిక మౌలిక వసతులను బలోపేతం చేయడం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల ఫలాలను అర్హులైన ప్రజలకు సమర్థవంతంగా అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సి.వై.డి.ఓ. సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఎంపిక చేసిన 20 గ్రామాలలో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, పోషకాహారం తదితర కీలక రంగాలలో అవసరాలను గుర్తించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యా ప్రమాణాల మెరుగుదల, ఆరోగ్య సేవల బలోపేతం, సురక్షిత తాగునీటి లభ్యత, సాగునీటి వసతుల అభివృద్ధి, పోషకాహార స్థాయిల పెంపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా ఎంపిక చేసిన గ్రామాలలో ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కల్పించే విధంగా కార్యక్రమాలు రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రవీణ్ జాదవ్, జాయింట్ డైరెక్టర్ డా. నాగేశ్వర్, సి.వై.డి.ఓ. ప్రాజెక్ట్ మేనేజర్ సాయి నితీష్, నీతి ఆయోగ్ కో-ఆర్డినేటర్ డా. బాలరాజు రాజారాం తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలే వారి గౌరవం

- ఘనంగా కొత్తగూడ లో 'కొత్తల పండుగ'



**కొత్తగూడ సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** సంస్కృతి సంప్రదాయాలే ఆదివాసీలకు గుర్తింపు అని, వాటిని కాపాడుకోకపోతే జాతి మనుగడకే ప్రమాదమని ఆదివాసీ దొర పటేళు ,, తుడుందెబ్బ, గిరిజన ఉద్యోగ సంఘ నాయకులు అన్నారు.?కొత్తగూడ మండలం గాంధీనగర్‌లోని శ్రీ సమ్మక్క-సారలమ్మ ఆలయ ప్రాంగణంలో 'కొత్తల (పెద్దల) పండుగ' భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది.అమరవీరుడు కుమ్రం భీం విగ్రహం, బొడ్రాయి వద్ద పూజల అనంతరం అమ్మవార్ల ప్రాంగణంలో గిరిజన సంప్రదాయ పూజలు నిర్వహించారు.?పంటల వెన్నులు కట్టి పూర్వీకులను స్మరించుకున్నారు. యువత గిరిజన సాంస్కృతిక వారసత్వాన్ని, ఐకమత్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు మల్లెల రాము కుంజ నర్సింగ రావు పూనెం సందీప్ కుమార్ మల్లెల సారయ్య ఈసం రంగ రావు ఆదివాసీ దొర పటేళ్ళు మల్లెల బాబు సిద్దబోయిన భద్రయ్య అలెం గణేష్ మల్లెల నర్సయ్య కంగాల రవి వజ్జ బాలరాజు గుమ్మడి సమ్మయ్య ఆదివాసీ ఉద్యోగ సంఘ నాయకులు గుమ్మడి లక్ష్మి నారాయణ చుంచ సారయ్య దొర వాసం కిషేందర్ అలెం సాంబయ్య ఏంపల్లి సమ్మయ్య బంగారి నాగేశ్వర్ రావు మల్లెల శ్రీను ఆదివాసీ శివ సత్తులు ఏంపల్లి సరజన పాల్గొన్నారు.

# డైరెక్ట్ సెల్లింగ్‌తోనే ఆర్థికాభివృద్ధి

- బ్యూల ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సిఎండి సైదులు




పాలకుర్తి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) డైరెక్ట్ సెల్లింగ్ తోనే ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని బ్యూల ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సి.ఎండి తిప్పలి సైదులు తెలిపారు.గురువారం మండల కేంద్రంలో గల బ్యూలా ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో డైరెక్ట్ సెల్లింగ్ నిర్వహణపై వినియోగదారులకు మాంగల్య గార్డెన్ లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ రాబోయే కాలంలో ప్రతి ఇంట్లో ఒక్కరైనా మార్కెటింగ్ స్వీకరించి తమ మనుగడ సాధిస్తారణడంలో అతియో శక్తి కాదన్నారు. భారత దేశంలో ఆర్థిక విలువలకు అనుగుణంగా భారతీయుల మానసిక వికాసానికి అనుకూలంగా ప్రోడక్ట్ మార్కెటింగ్ లో ఉన్న అమూల్యమైన ప్రతిపాదనలు అందించాలని బ్యూలా ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్ దృఢ సంకల్పంతో మార్కెటింగ్ సీలింగ్ విధానాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. కృత నిశ్చయంతో కుటుంబ అవసరాల కోసం ఉపయోగపడే వస్తువులు మధ్య దళారీల ప్రమేయం లేకుండా కంపెనీ తయారు చేసిన వస్తువులను నేరుగా వినియోగదారులకు అందిస్తామని వివరించారు. డైరెక్ట్ సెల్లింగ్ తో ఆర్థిక వ్యవస్థ మెరుగు పడుతుందని, ప్రతి ఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. ప్రైవేట్ లిమిటెడ్ వినియోగదారులకు విలువగల కిట్టును అందిస్తామని తెలిపారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రజా ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ



**మావల, సెప్టెంబర్18 (జనం సాక్షి):** ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని గాయత్రి గార్డెన్‌లో నిర్వహించిన రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా కళ్ల అద్దాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారులు మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా రెండో విడతలో భాగంగా 750 మంది లబ్ధిదారులకు రూ. 5 లక్షల చొప్పున ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 6 వేలకు పైగా ఇళ్లు మంజూరయ్యాయని, అర్హత ఉండి ఏ ఒక్కరికీ పథకం మిస్సయినా, తక్షణమే పరిశీలించి మంజూరు పత్రం అందజేస్తామని భరోసానిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి అనేక సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తున్నామని వెల్లడించారు. ప్రజాపాలన దినోత్సవ వేడుకలలో భాగంగా రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లు సైతం మంజుయ్యాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక పాలనకు నిదర్శనమన్నారు. ఆదిలాబాదు జిల్లా విమానాశ్రయం నిర్మాణంతో జిల్లా రూపురేఖలు మారనున్నాయని, జిల్లా మరింత ఆర్థిక అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ... జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి సంక్షేమ పథకాలు చేరేలా యంత్రాంగం పారదర్శకంగా పనిచేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో భాగంగా తొమ్మిది మండలాల పరిధిలో సుమారు 700 మందికి మంజూరు పత్రాలు అందజేస్తున్నామని, అలాగే స్లాబ్ రిప్లేస్‌మెంట్, మొదటి విడత పెండింగ్ బిల్లుల చెల్లింపులు సైతం ప్రక్రియల వారీగా పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. జిల్లాలో ఆరోగ్య పాఠశాలల ద్వారా విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలు, సర్జరీలు అందజేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు నిరంతరం శ్రమిస్తారని ఆయన భరోసానిచ్చారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ... సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా, నిజమైన నిరుపేదలకు, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలని అన్నారు. ఇళ్లు లేని పేదవాళ్లను గుర్తించి, క్షేత్రస్థాయిలో పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వ పథకాలను అందించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను, విద్యార్థులకు కళ్ళ అద్దాలను ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యే, కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, ఎస్.రాజేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషా, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, పిడి హౌసింగ్ శంకర్, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, డిఈఓ మాధవి, ఆత్మ చైర్మన్ సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ రోహిత్, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచ్లు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# త్యాగధనుల పోరాట ఫలితమే ఈ విజయం

- ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ గద్వాల విజయలక్ష్మి
- వరంగల్‌లో ప్రజాపాలన దినోత్సవం



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** ఎందరో త్యాగదనుల పోరాట ఫలితమే ఈ విజయం అని ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. గురువారం వరంగల్ లో సెప్టెంబర్ 17 సందర్భంగా ప్రజా పాలన దినోత్సవం నిర్వహించారు. ప్రజా పాలన దినోత్సవాన్ని వరంగల్ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఖిలా వరంగల్‌లోని అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు ముఖ్య అతిథి నివాళు లర్పించారు. అనంతరం ఐడీఓసీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి హాజరయ్యారు.వారికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ,డీసీపీ అంకిత్ కుమార్ లు పూల బొకే అందించి స్వాగతం పలికారు. అనంతరం విశ్వ కర్మ జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూల మాల సమర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ముందుగా వందేమాతరంజాతీయ గేయం ఆలాపన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరిం చారు. అనంతరం జాతీయ గీతం, రాష్ట్ర గీతం ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్లానింగ్ బోర్డ్ వైస్ ఛైర్పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి పోలీసు గౌరవ వందన స్వీకరించారు. అనంతరం ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథి ప్రసంగించారు. ప్రజా పాలనలో పారదర్శకత, ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమ లుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. వరంగల్ జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం జాతీయ గీతంతో కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు రిటైర్డ్ ఐపీఎస్, మేర కార్పొరేషన్ చైర్మెన్ వెంకట్రాజం ,గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ లు గణేష్, కిషోర్ కుమార్, డిఆర్వో విజయ లక్ష్మి, ఆర్డీవో సుమ, సంబంధిత మండల తహసీల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ప్రపంచ బ్యాంకు సహకారం

- వరంగల్ నగరంలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం పర్యటన
- నగర అభివృద్ధికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులపై చర్చ



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** హనుమకొండలోని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా ఛైర్ పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండ,వరంగల్ జిల్లాలో కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తేజావత్ వెంకన్న, ఇతర అధికారులు వరంగల్ నగర అభివృద్ధికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులపై సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్ నగరంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్న ప్రాంతాల్లో ప్రపంచ బ్యాంకు బృందం సభ్యులు పర్యటించారు. ఈ సమావేశంలో వరంగల్ నగరంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనుల ప్రాజెక్టు వివరాలపై చర్చించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు కలెక్టర్లు, అధికారులు వివరించారు. ఈ సందర్భంగా నగరాభి వృద్ధికి సంబంధించి ప్రపంచ బ్యాంకు రుణం కింద చేపట్టేందుకు అర్హత కలిగిన ప్రాజెక్టులు, ప్రాజెక్టుల ప్రతిపాదనలు ఏ విధంగా ఉండాలి, డీపీఆర్‌లను ఏ గడువులోగా సమర్పించాలి, తదితర అంశాలపై ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్లు, అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ రుణ సహాయంలో 70 శాతం ప్రపంచ బ్యాంకు రుణంగా, మిగిలిన 30 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఉండే విధంగా ప్రతిపాదన రూపొందించినట్లు అధికారులు వివరించారు. ప్రపంచ బ్యాంకు నిర్దేశించిన మార్గదర్శ కాలకు అనుగుణంగా ప్రతిపాదనలు, డీపీఆర్‌లను సిద్ధం చేసి సమర్పించడం ద్వారా వరంగల్ నగరంలో మౌలిక వసతులు, రవాణా, డ్రైనేజీ, పర్యాటకం, హెరిటేజ్ పరిరక్షణ, పట్టణ సుందరీకరణ తదితర రంగాల్లో సమగ్ర అభివృద్ధికి బాటలు వేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.ఈ సమావేశంలో కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, ఇతర అధికారులతో పాటు కన్సల్టెంట్ ప్రతినిధి ఆనంద్ పాల్గొన్నారు.

# ఇంటింటికి తిరగకుండానే చేయూత పింఛన్ల వెరిఫికేషన్!

- గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద కూర్చుని లబ్ధిదారుల వెరిఫికేషన్ పూర్తి...
- అధికారుల పని తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న గ్రామాల్లోని ప్రజలు...



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ఇంటింటికి తిరగకుండా గ్రామపంచాయతీ కార్యాలయాల వద్దనే అధికారులు కూర్చుని చేయూత పింఛన్ల వెరిఫికేషన్ ను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు బహటంగా వినిపిస్తున్నాయి. గ్రామాలలోని ప్రజలు అధికారుల పని తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా వితంతువులు, వికలాంగులు, గీత కార్మికులకు చేయూత పథకాన్ని ప్రవేశపెట్టి పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరింది. చెన్నారావుపేట మండలంలో 30 గ్రామాల నుండి 790 మంది చేయూత పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి ఇంటింటికి తిరిగి వెరిఫికేషన్ చేయడానికి 10 మంది గెజిటెడ్ అధికారులను ప్రభుత్వం నియమించింది. వీరు నేడు గురువారం నుండి 25వ తేదీ వరకు గ్రామాల్లోకి వెళ్లి ఇంటింటికి తిరిగి దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను పూర్తిస్థాయిలో వెరిఫికేషన్ చేయాల్సి ఉంది. కానీ మొట్టమొదటి రోజే అధికారులు ఇంటింటికి వెళ్లకుండా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్దకే పిలిపించుకొని వెరిఫికేషన్ చేశారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ఉన్న వారిని పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకుని వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నట్లుగా రాసుకొని వెళ్లారని ఇది సరైన న్యాయం కాదని పలువురు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చేయూత పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల ఇంటింటికి తిరిగి సరైన ధృవపత్రాలను పరిశీలించి వెరిఫికేషన్ ను పారదర్శకంగా నిర్వహించి అసలైన పింఛన్ లబ్ధిదారులను గుర్తించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## అటవీ భూమి ఆక్రమణ

- నిందితుడికి 15 రోజుల రిమాండ్

**కెరమెరి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** కెరమెరి మండలంలోని ఖేలీ-కె గ్రామానికి చెందిన కేంద్రే విష్ణు రిజర్వ్ ఫారెస్ట్‌లో చెట్లు నరికి అడవిని ఆక్రమించినందుకు కేసు నమోదు చేసినట్లు ఎఫ్.ఆర్.ఓ మజారుద్దీన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రేంజ్ పరిధిలోని పరస్వాడ బీట్, కంపార్ట్‌మెంట్ నం. 32లో అటవీ భూమిని ఆక్రమించినట్లు గుర్తించి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. విచారణ అనంతరం గురువారం నాడు నిందితుడిని ఆసిఫాబాద్ జిల్లా కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 15 రోజుల రిమాండ్ విధించడం జరిగిందన్నారు. అనంతరం నిందితున్ని ఆసిఫాబాద్ స్పెషల్ సబ్ జైలుకు తరలించడం జరిగిందన్నారు. అటవీ సంపదను ధ్వంసం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎఫ్ఆర్ఓ హెచ్చరించారు.

## 22 ఏ భూముల విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పక పాటించాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** భూముల రీ-సర్వే పనులను ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారుభూ రీ సర్వే ప్రక్రియ పురోగతి, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, 22 ఏ దరఖాస్తుల పరిశీలన మొదలగు అంశాల మీద గురువారం సంబంధిత అధికారులతో కలెక్టరెట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి రివ్యూ నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడానికి ప్రభుత్వం చేపట్టిన భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు ఈ సందర్భంగా కలెక్టర్..ఇప్పటివరకు ఎన్ని ఎకరాలు చేసారు.ఇంకా ఎంత చేయాలి అని అడిగి తెలుసుకున్నారుఅనంతరం భూ భారతి దరఖాస్తుల గురించి సమీక్షిస్తూ.. పెండింగ్ దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా వేగంగా, పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. 22ఏ భూముల చేర్పులు, తొలగింపులపై రెవెన్యూ రికార్డులను పక్కాగా పరిశీలించాలన్నారు ఎలాంటి పొరపాట్లు లేకుండా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ రవి, ఆర్డీవో లు వెంకన్న, వెంకటేశ్వర్లు, తహసీల్దార్ లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

**కుబీర్, సెప్టెంబర్ 17, (జనంసాక్షి):** పాలాజ్ కర్ర గణేష్ దర్శనం ముగించుకుని సంతోషంగా ఇంటిబాట పట్టిన భక్తులకు మార్గమధ్యలో ప్రమాదం ఆందోళనకు గురిచేసింది. కుబీర్ మండలం పల్సి గ్రామ సమీపంలో గురువారం ఎనిమిది మంది ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఆటోలో డ్రైవర్‌తో పాటు ఎనిమిది మంది ఉన్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారికి ఎలాంటి ప్రాణాపాయం లేదని తెలిపారు. దర్శనం ముగించుకుని క్షేమంగా ఇళ్లకు చేరాల్సిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.

## ప్రజా పాలనలో పోలీసుల పాత్ర కీలకం



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్బివిఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో గురువారం వేడుకలు నిర్వహించారు. అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిష్ట్, ఐపీఎస్ జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, సుపరిపాలన, పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రజా పాలనలో భాగంగా పాటించాలని ఆమె అన్నారు. ప్రతి పౌరుడితో గౌరవంగా వ్యవహరిస్తూ నిష్పాక్షికంగా విధులు నిర్వహించి బాధితులకు న్యాయం అందించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. సైబర్ నేరాలు, మహిళలు, బాలలపై నేరాలు, మాదకద్రవ్యాలు, ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొనేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు మానవీయ విలువలతో కూడిన పోలీసింగ్ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చేతన, మురళీధర్ ఐపీఎస్, వెంకటేశ్వర్లు, కేఆర్కే ప్రసాద్, వేమా శ్రీనివాసరెడ్డి, టి. భరత్, యార్లగడ్డ రాంబాబు, వేముల శ్రీనివాసరావు, డీఎస్పీలు సతీష్, ఆదూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పథకాలు ఆదర్శం



**మొయినాబాద్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు వెయ్యి రోజుల పాలన ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని సర్దార్నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగయ్య, మండల రైతు సంఘం అధ్యక్షుడు బొక్క వెంకట్రెడ్డి, తోలకట్ట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చాకలి శ్రీశైలంలు పేర్కొన్నారు. గురువారం తోల్ కట్ట గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడుతూ తోల్కట్ట గ్రామం నుంచి కొందరు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్లో చేరినట్లు వార్తలు అవాస్తవం అని కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్లోకి ఎవరు వెళ్లలేదన్నారు. గతంలో ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో ఉన్న వారే బీఆర్ఎస్ కండువాలు కప్పుకోని పార్టీ మారినట్లు చెప్పుకుంటున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ వథకాలనుప్రజలకు వివరిస్తున్నామన్నారు. ముఖ్యంగా సొంతింటి కల పేదలకు ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు వరంగా మారయన్నారు. ఈ కార్యక్రమంలో అమితఖాన్, మల్లేష్, కుమార్, సాజిత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## షామీర్పేట ప్రభుత్వ ఐటీఐలో ఘనంగా స్నాతకోత్సవ వేడుకలు




**శామీర్పేట్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** షామీర్ పేటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా తెలంగాణ ఉపాధి, శిక్షణ శాఖ ఉప సంచాలకులు నర్సయ్య, సహాయ సంచాలకులు చంద్ర శేఖర్, ప్రాంతీయ ఉప సంచాలకులు సీతా రాములు, టి జి ఓ ల అధ్యక్షులు వినోద్ కుమార్, డి ఆర్ డి ఓ సాంబాశివ రావు, టి జి ఓ కార్యదర్శి కురుమూర్తి, హైదరాబాద్ ప్రాంతీయ శిక్షణ అధికారి సాయి బాబ, శామీర్ పేట్ ఐటీఐ రవీందర్, సూపరి డెంట్ వెంకట్ రాజు, ప్రిన్సిపాల్ హరికృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసు కున్న ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్, ఇండస్ట్రీస్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన విద్యార్థులకు సర్టిఫికెట్లు అంద జేశారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకొని, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐటీఐ శిక్షణ యువతకు ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

## రైతులకు తక్షణమే సాగునీరు అందించాలి

- ఎమ్మెల్యే విజయుడు డిమాండ్



**అలంపూర్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** అలంపూర్ నియోజకవర్గంలోని పంట పొలాలకు తక్షణమే సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే విజయుడు ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. పంటలు దెబ్బతినకుండా నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలనే ప్రధాన డిమాండ్తో ఆయన రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, ఇరిగేషన్ ఎస్ఈలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కృష్ణా నదిపై నిర్మించిన జూరాల ప్రాజెక్టు ఈ ప్రాంతానికి తాగు, సాగు నీటిని అందించే కీలక వనరు అని ఆయన గుర్తుచేశారు. ఇటీవల భారీగా వరదలు వచ్చిన నేపథ్యంలో, జూరాల మెయిన్ కెనాల్ తో పాటు నెట్టెంపాడు 100, 106 ప్యాకేజీల పరిధిలోని కాలువల ద్వారా తక్షణమే నీటిని విడుదల చేయాలని కోరారు. ఆయా ప్యాకేజీల పరిధిలోని ప్రతీ రైతు పొలానికి నీరందేలా ఇరిగేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, ఎండిపోతున్న పంటలను కాపాడాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# గిరిజనుల గుండెల్లో కేసీఆర్దే ప్రథమ స్థానం

- మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సేరి సుభాష్ రెడ్డి



**హవేలీ ఘన్పూర్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్రెడ్డి అన్నారు. గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచడంతో పాటు తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి మౌలిక వసతులు కల్పించిన ఘనత కేసీఆర్కే దక్కుతుందని పేర్కొన్నారు. గురువారం హవెలిఘనపూర్ మండలం సుల్తాన్పూర్ తండాలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్రెడ్డితో కలిసి పద్మా దేవేందర్రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించి, గిరిజన మహిళలతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తండాకు చేరుకున్న నాయకులకు గిరిజన మహిళలు సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. అనంతరం బంజారా సంప్రదాయ నృత్యాల్లో పద్మా దేవేందర్రెడ్డి ఉత్సాహంగా పాల్గొనడంతో తండాలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పద్మా దేవేందర్రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం గిరిజనుల ఆత్మగౌరవానికి పెద్దపీట వేసిందన్నారు. రిజర్వేషన్ల పెంపుతో పాటు తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య వంటి మౌలిక వసతులు కల్పించిందని తెలిపారు. గిరిజన విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. సంత్ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్న ఘనత కూడా కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని పద్మా దేవేందర్రెడ్డి విమర్శించారు. రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారని, నాణ్యమైన విద్యుత్ సరఫరా లేక పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. తండాల్లో తాగునీటి సమస్యలు కూడా తలెత్తుతున్నాయని పేర్కొంటూ రైతులు, గిరిజనుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్రెడ్డి మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడంతో పాటు మౌలిక వసతులు కల్పించిందని తెలిపారు. గిరిజన విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్పూర్ తండా సర్పంచ్ రమేష్, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు ఎం. లావణ్యరెడ్డి, మెదక్, హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు ఎం. అంజగౌడ్, సీహెచ్. శ్రీనివాస్రెడ్డి, మాజీ ఎంపీపీ కిష్టయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ లు ఆరేళ్ల. మల్లికార్జున్గౌడ్, బట్టి జగపతి, హవెలి ఘనపూర్ సర్పంచ్ సాయిలు, ఉపసర్పంచ్ రాజు, నాగపూర్ సొసైటీ చైర్మన్ శ్రీహరి, మాజీ సర్పంచులు యామిరెడ్డి లింగం, శ్రీహరి, సాయగౌడ్, మండల, గ్రామాల నాయకులు, కార్యకర్తలు, గిరిజన మహిళలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను భావితరాలకు చాటాలి

- కొడంగల్ సీపీఐ నియోజకవర్గ ఇన్చార్జి గంటి సురేష్ కుమార్



**కొడంగల్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన మహత్తర ప్రజా పోరాటమని కొడంగల్ సీపీఐ నియోజకవర్గ ఇన్చార్జి గంటి సురేష్ కుమార్ అన్నారు. హైదరాబాద్లో నిర్వహించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభలో ఆయన పాల్గొనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో ఫోన్ లో గంటి సురేష్ కుమార్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగం సాగించిన పోరాటం దేశ చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగి ఉందన్నారు. వేలాది మంది రైతులు, కూలీలు, ప్రజలు తమ హక్కుల కోసం పోరాడారని, అనేకమంది ప్రాణత్యాగాలు చేశారని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించకుండా వాస్తవాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ పోరాటం వెనుక ఉన్న ప్రజా ఉద్యమ స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాలని కోరారు. భూమి, రైతు, కూలీ సమస్యలు నేటికీ కొనసాగుతున్న నేపథ్యంలో రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి విద్యార్థులకు చారిత్రక వాస్తవాలను తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్లో జరిగిన ముగింపు సభకు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు, రైతులు, కార్మికులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సమాజ సేవలోనే నిజమైన సంతోషం



**జడ్చర్ల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** సమాజ సేవలోనే నిజమైన సంతోషం ఉందని బీజేపీ నాయకుడు గోనెల రాకేష్ తెలిపారు. గురువారం భారత ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా జడ్చర్ల శ్రీ సత్యేశ్వర సేవా ఆశ్రమంలో కావరమ్మపేట బీజేపీ నాయకుడు గోనెల రాకేష్ మిత్రబృందం నేతృత్వంలో ఆశ్రమంలోని అనాథలకు, మానసిక దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోనెల రాకేష్ మాట్లాడుతూ సమాజ సేవలోనే నిజమైన ఆత్మతృప్తి ఉందన్నారు. నిరుపేదలకు, దివ్యాంగులకు సాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రధాని మోదీ సేవానిరతిని ఆదర్శంగా తీసుకుని కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఆశ్రమ నిత్య అన్నదానానికి తమ వంతు ఆర్థిక సాయం అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బుక్క నవీన్ కుమార్, పిట్టల నరేష్ ముదిరాజ్, సామల నాగరాజు, చాకలి శివకుమార్ రజక, పున్న శివకుమార్, వడ్లని చెన్నయ్య యాదవ్, గుండు శివకుమార్ ముదిరాజ్, చింతకుంట వెంకటేష్ ముదిరాజ్, పెండ్యాల వరప్రసాద్, బుక్క యాదయ్య, పెద్ద గొల్ల శ్రీశైలం యాదవ్, రాపల్లె శివకుమార్ యాదవ్, నవీన్ చారి, శివ చారి, గుండు శంకర్ ముదిరాజ్, గుండు లింగం ప్రసాద్ ముదిరాజ్, ముష్టి మహేష్ యాదవ్, ముష్టి రమేష్ యాదవ్, కంబు వంశీ కుమార్ ముదిరాజ్, కంబు పవన్ కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్



**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** దుబ్బాక మండలం రామక్కపేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురువారం సందర్శించి విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అన్నం పప్పు క్యాబేజీ కర్రీ, రసం, గుడ్డు, నెయ్యి లను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. భోజన పదార్థాల తయారీకి వినియోగిస్తున్న సరుకుల నాణ్యతను పరిశీలించి, విద్యార్థినులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్ తనికి చేస్తూ కూరగాయలు పరిమాణం కొలత తనికి చేశారు. వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, భోజనం తయారీ సమయంలో పరిశుభ్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కామన్ డైట్ మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన భోజనం అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి, విద్య, వసతి, భోజనం, మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణంతో పాటు నాణ్యమైన వసతి, భోజనం, మౌలిక సదుపాయాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## కేంద్ర సర్వేకు రాజోళి పోలీస్ స్టేషన్ ఎంపిక



**రాజోళి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలోని రాజోలి పోలీస్ స్టేషన్కు అరుదైన గుర్తింపు లభించింది. దేశవ్యాప్తంగా అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న పోలీస్ స్టేషన్లను గుర్తించేందుకు కేంద్ర స్థాయిలో నిర్వహిస్తున్న వార్షిక సర్వేకు రాజోలి పోలీస్ స్టేషన్ ఎంపికైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నియమించిన సర్వే అధికారి సయ్యద్ మహ్మద్ హసన్ గురువారం రాజోళి పోలీస్ స్టేషన్ను సందర్శించారు. స్టేషన్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, పోలీసుల పనితీరు, కేసుల దర్యాప్తు తీరు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారం, ఫిర్యాదుదారులతో పోలీసులు వ్యవహరించే విధానం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల పరిశీలనతో పాటు ప్రజలకు అందుతున్న పోలీస్ సేవలపై కూడా సర్వే అధికారి వివరాలు సేకరించినట్లు తెలిపారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలోని అత్యుత్తమ మూడు పోలీస్ స్టేషన్లలో రాజోళి పోలీస్ స్టేషన్ ఒకటిగా ఎంపిక కావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కేంద్ర స్థాయి సర్వేలోనూ మెరుగైన ఫలితాలు సాధించేందుకు స్టేషన్ సిబ్బంది కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో శాంతినగర్ సీఐ శంకర్, ఎస్ఐ కిరణ్ కుమార్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## వినాయక మండపాలను సందర్శించిన డీసీపీ



**షాబాద్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** గణేష్ ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని చేవెళ్ల డిసిపి గౌతమ్ యోగేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వివిధ వినాయక మండపాలను, గణేష్ నిమజ్జన ప్రాంతాన్ని గురువారం సీఐ లక్ష్మారెడ్డి తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కోరారు. నిమజ్జనం సమయంలో ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పోలీసుల సూచనలు పాటించాలని నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మిరెడ్డి, సర్పంచ్ అశోక్, దొంద్ర రామకృష్ణ, రాము, బాల్ రాజ్, ధర్పల్లి రవీందర్, రమేష్ యాదవ్, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్పై అనుచిత వ్యాఖ్యలకు నిరసన

- హమారా ప్రసాద్ దిష్టిబొమ్మ దహనం..
- అరెస్ట్ చేయాలని,మహమ్మదాబాద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

**మహమ్మదాబాద్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్పై సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న అనుచిత వ్యాఖ్యలు,కల్పిత నాయకుడు,పేరుతో పుస్తకం విడుదల చేస్తామన్న ప్రచారంపై మహమ్మదాబాద్లో దళిత,బహుజన సంఘాల నాయకులు భగ్గుమన్నారు.గురువారం మండల కేంద్రంలో ఆందోళన చేపట్టి,హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ..అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలకు హక్కులు,స్వేచ్ఛ,సమానత్వం కల్పించారని పేర్కొన్నారు.అంబేడ్కర్ చరిత్రను వక్రీకరించేలా,రాజ్యాంగ విలువలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.ఇలాంటి వ్యాఖ్యలతో సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు.చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. హమారా ప్రసాద్పై చట్టపరమైన చర్యలు తీసుకుని అరెస్ట్ చేయాలని కోరుతూ మహమ్మదాబాద్,ఎస్ఐ శేఖర్రెడ్డి,నాయకులు ఫిర్యాదు అందజేశారు.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పుస్తక విడుదల ప్రకటన,వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఉమ్మడి గండీడ్ మండల మాజీ ఎంపీపీ శాంతి రంగ్యా,మహమ్మదాబాద్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు,రుద్రారం కృష్ణయ్య,డీసీసీ సభ్యుడు అనంతయ్యగుప్తా, పీఏసీఎస్ డైరెక్టర్ బాలముకుందం,వెంకటయ్య,జాతీయ మాలల ఐక్యవేదిక జాతీయ కార్యదర్శి పత్తి గోపాల్,ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు పగిడ్యాల బోరు కృష్ణయ్య,అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






# ఈపీఎఫ్ఓ వేతన పరిమితి

## ఇక, బీమా మొత్తం రూ.10.50 లక్షలకు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** వేతన జీవులకు ఊరట కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ భవిష్య నిధి వేతన పరిమితిని పెంచింది. ప్రస్తుతం రూ.15 వేలుగా ఉన్న ఈ మొత్తాన్ని రూ.25 వేలకు చేరుస్తూ నిర్ణయం తీసుకుంది. దీన్ని నోటిఫై చేశాక ఉద్యోగి ఈపీఎఫ్, ఈపీఎస్‌కు వెళ్లే వాటా పెరుగుతుంది. దీంతో పాటు ఎంప్లాయీ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ కింద ఈపీఎఫ్ చందాదారులు మరణించిన సందర్భాల్లో వారి కుటుంబాలకు చెల్లించే బీమా మొత్తం కూడా రూ.10.50 లక్షల వరకు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ పరిమితి రూ.7 లక్షలుగా ఉంది.ఈపీఎఫ్ సభ్యులు సర్వీసులో ఉండగా చనిపోతే బాధిత కుటుంబాలకు ఈడీఎల్ఐ కింద జీవిత బీమా సదుపాయాలు అందుతున్నాయి. గరిష్ఠంగా రూ.7 లక్షల వరకు బీమా సొమ్ము లభిస్తోంది. ఇందుకోసం యాజమాన్యాలు ఉద్యోగుల వేతనంలో 0.5 శాతం మొత్తాన్ని చందాగా చెల్లిస్తున్నాయి. ఈ నిధులన్నీ ఒకేచోటకు చేర్చి ఈ బీమా సదుపాయాన్ని కల్పిస్తున్నారు.

పీఎఫ్ గరిష్ఠ వేతన పరిమితి రూ.25వేలు

ఎలా లెక్కిస్తారు?

ఈడీఎల్ఐ 2026 పథకం కింద బీమా మొత్తాన్ని ప్రస్తుతం రూ.15 వేల గరిష్ఠ పరిమితి ఆధారంగా లెక్కిస్తున్నారు. ఉద్యోగి మరణించినప్పుడు వారి గత 12 నెలల సగటు పీఎఫ్ బ్యాలెన్స్‌లో 50% మొత్తాన్ని (గరిష్ఠంగా రూ.1.75 లక్షలు) బోనస్‌గా ఇస్తారు.పాత పరిమితి కింద రూ.1.75 లక్షలు = రూ.7 లక్షలు అవుతుంది.కొత్త వేతన పరిమితి కింద రూ.1.75 లక్షలు = రూ.10.50 లక్షలు అవుతుంది.గమనిక: ప్రస్తుతానికి ఇవి అంచనాలు మాత్రమే. కొత్త వేతన పరిమితికి అనుగుణంగా కేంద్రం నిబంధనలు నోటిఫై చేశాక మరింత స్పష్టత వస్తుంది.

తగ్గనున్న చేతికొచ్చే జీతం

వేతన పరిమితి పెంపు వల్ల నెలవారీ చేతికొచ్చే వేతనం స్వల్ప మొత్తం తగ్గనుంది. ప్రస్తుతం రూ.15 వేల వేతన పరిమితిపై 12 శాతం చొప్పున ఉద్యోగి తన వాటాగా రూ.1800 చెల్లిస్తున్నారు. రూ.25వేలపై రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఆ మేర నెలవారీ మీ చేతికొచ్చే జీతం రూ.1200 తగ్గనుంది. యాజమాన్యాలు కూడా తన బాధ్యతగా రూ.3వేలు జమ చేస్తాయి కాబట్టి ఈపీఎఫ్ కార్పస్ పెరిగేందుకు దోహదపడుతుంది. దీర్ఘకాలంలో ఉద్యోగికి మేలు చేకూరుతుంది.



# రాణించిన బ్యాంకింగ్ షేర్లు

**ముంబై(జనంసాక్షి):** మంగళవారం నాటి భారీ నష్టాల నుంచి మన సూచీలు పుంజుకున్నాయి. తక్కువ స్థాయుల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడం ఇందుకు కారణం. ముఖ్యంగా బ్యాంకింగ్ షేర్లు రాణించాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 3 పైసలు తగ్గి 95.91 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 2.58% తగ్గి, 105.98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో సింగపూర్ మినహా మిగతా దేశాల సూచీలు రాణించగా.. ఐరోపా మార్కెట్లు సానుకూల ధోరణిలోనే ఆరంభమయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.58,000 కోట్లు పెరిగి రూ.472.96 లక్షల కోట్ల (4.93 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

స్వల్ప శ్రేణిలోనే...: ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 74,249.31 పాయింట్ల వద్ద లాభాల్లో (క్రితం ముగింపు 74,003.82) ఆరంభమైంది. ఆ తర్వాత 74,505.86 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 332.63 పాయింట్ల లాభంతో 74,336.45 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 99 పాయింట్లు లాభపడి 23,217.60 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 23,284.75 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని; 23,116.10 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది.

18 పైకి.. 12 కిందకు...: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 12 మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. ఐటీసీ 2.46%, ఎస్‌బీఐ 2.24%, యాక్సిస్ బ్యాంక్ 1.93%, ట్రెంట్ 1.51%, మహీంద్రా అండ్ మహీంద్రా 1.45%, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ 1.43% పెరిగాయి. టీసీఎస్ 2.6%, ఇన్ఫోసిస్ 1.43%, టెక్ మహీంద్రా 1.26%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.99%, ఎన్‌టీపీసీ 0.91%, ఎల్అండ్‌టీ 0.71% నష్టపోయాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో బీమా, ఎఫ్ఎమ్‌సీజీ, పీఎస్‌యూ బ్యాంక్, స్థిరాస్తి, చమురు-గ్యాస్ రాణించగా.. ఐటీ, గృహ రుణాలు, ఇండస్ట్రియల్స్, హాస్పిటల్స్ డీలాపడ్డాయి.



పేటీఎం షేరుకు యూపీఐ రుసుముల జోష్

అక్టోబరు 15 నుంచి రూ.2000కు మించి యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ షేరు 3.5% పెరిగి రూ.1,791.70 వద్ద ముగిసింది. ఒకదశలో 7.24% దూసుకెళ్లి రూ.1,856,50ను చేరింది. వన్ మొబిక్విక్ సిస్టమ్స్ షేరు 5.96%, పైన్ ల్యాబ్ 2.68% మేర పెరిగినా.. చివరకు వన్ మొబిక్విక్ 1.61%, పైన్ ల్యాబ్స్ 4.28% నష్టపోయాయి.

ఐపీఓ సమాచారమ్

జిందాల్ సుప్రీమ్ ఇండియా లిమిటెడ్ ఐపీఓ మొదటి రోజునే 7.53 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 11.59 రెట్లు అధికంగా బిడ్‌లు వచ్చాయి. హీరో మోటార్స్ లిమిటెడ్ ఇష్యూ మొదటి రోజే 1.38 రెట్ల స్పందన కనిపించింది. చిన్న మదుపర్ల విభాగంలో 2.23 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి. మణికా ప్లాస్టెక్ ఐపీఓ ముగిసేసరికి 28.14 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 22.72 రెట్లు అధికంగా బిడ్‌లు వచ్చాయి. ఎ-వన్ స్టీల్స్ ఇండియా రూ.405 కోట్ల పబ్లిక్ ఇష్యూ ఈనెల 24న మొదలై 28న ముగియనుంది.

స్టింగ్ అదుర్స్..

గ్లాస్ వాల్ సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్ షేరు ఇష్యూ ధర రూ.182తో పోలిస్తే, బీఎస్ఈలో 4.45% అధికంగా రూ.190.10 వద్ద నమోదైంది. ఒక దశలో 25.52% దూసుకెళ్లినా, చివరకు 18.32% లాభంతో రూ.215.35 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,893.69 కోట్లుగా నమోదైంది. కనోహర్ ఎలక్ట్రికల్స్ షేరు ఇష్యూ ధర రూ.632 కంటే, బీఎస్ఈలో 6.33% అధికంగా రూ.672.05 వద్ద నమోదైంది.. ఒక దశలో 24.51% పెరిగినా, చివరకు 18.87% లాభంతో రూ.751.30 వద్ద ముగిసింది.ప్రసోల్ కెమికల్స్ పేలవం: ఈ షేరు, ఇష్యూ ధర రూ.676తో పోలిస్తే బీఎస్ఈలో 9.61% తక్కువగా రూ.611 వద్ద నమోదైంది. చివరకు నష్టాన్ని 0.58 శాతానికి పరిమితం చేసుకుని రూ.672.05 వద్ద ముగిసింది.


## శాంసంగ్ గెలాక్సీ ఎస్ 26పై రూ.12 వేలు పెంపు!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ శాంసంగ్ తన గెలాక్సీ ఎస్26 సిరీస్ స్మార్ట్‌ఫోన్ ధరలను పెంచేందుకు సిద్ధమైంది. గెలాక్సీ ఎస్26 ధర ఏకంగా రూ.12 వేల వరకు పెరగనుంది. కొత్త ధరలు సెప్టెంబర్ 20 నుంచి అమల్లోకి రానున్నాయని సమాచారం. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎస్26 సిరీస్‌లను లాంచ్ చేయగా... తొలిసారి ధరల పెంపు చేపడుతోంది. మెమొరీ చిప్‌ల ధరలు పెరగడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.ఇటీవల యాపిల్ కంపెనీ కూడా తన ఐఫోన్ 17 ధరలను భారీగా పెంచిన విషయం తెలిసిందే. ఇప్పుడు శాంసంగ్ కూడా తన ప్రీమియం ఫోన్లు అయిన ఎస్26 సిరీస్‌పై ధరల పెంపు చేపడుతుండడం గమనార్హం. ఈ పెంపుతో శాంసంగ్ ఎస్26 బేస్ వేరియంట్ 12జీబీ+256జీబీ ధర రూ.87,999 నుంచి రూ.99,999కు పెరగనుంది. అంటే బేస్ వేరియంటే రూ.లక్ష మార్కు దాటునుందన్న మాట. టాప్ వేరియంట్ ధర రూ.1,07,999 నుంచి రూ.1,19,999కు పెరగనుంది. మరోవైపు ఎస్26 అల్ట్రాపై రూ.20 వేల వరకు ధరల పెంపు ఉండొచ్చని వార్తలు వస్తున్నాయి. అదే జరిగితే ఈ స్మార్ట్‌ఫోన్ ధర ఐఫోన్ 18 ప్రో ధరకు చేరువ కానుంది.



## తెరపైకి ప్రభుత్వ రంగ బ్యాంకులు విలీనం?

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రభుత్వ రంగ బ్యాంకులను విలీనం చేస్తూ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక కొత్త పథకాన్ని నోటిఫై చేసిందంటూ ఓ డాక్యుమెంట్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది ఈ డాక్యుమెంట్‌ను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఆ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. అలాంటి వదంతులు నమ్మొద్దని ప్రజలను కోరింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చింది.బ్యాంకుల విలీనానికి సంబంధించి ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎలాంటి ఉత్తర్వులను జారీ చేయలేదని కేంద్రం స్పష్టం చేసింది. ప్రచారంలో ఉన్న ఆ పత్రం పూర్తిగా అవాస్తమని తేల్చిచెప్పింది. ఇలాంటి డాక్యుమెంట్లను ఇతరులకు షేర్ చేయడానికి ముందే అధికారిక వెబ్‌సైట్ల ద్వారా నిజనిజాలను తనిఖీ చేయాలని సూచించింది. ప్రభుత్వానికి సంబంధించి ఎలాంటి అనుమానాస్పద కంటెంట్ కనిపించినా వెంటనే పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగానికి ఫిర్యాదు చేయాలని కోరింది.




### గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.40 | వరంగల్ ₹ 5.42

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

₹ 1,62,254 (22 క్యారెట్లు) | ₹ 1,77,008 (24 క్యారెట్లు)

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,50,000

# మళ్లీ చంద్రశేఖరనే..

## టాటా సన్స్ ఛైర్మన్‌గా మరో ఐదేళ్లు కొనసాగింపు



**ముంబయి:** టాటా గ్రూపులో కీలక పరిణామం చోటుచేసుకుంది. టాటా సన్స్ ఛైర్మన్‌గా మరో ఐదేళ్ల పాటు ఎన్ చంద్రశేఖరన్ కొనసాగనున్నారు. మూడోసారి ఆయన నియామకానికి టాటా సన్స్ బోర్డు ఆమోదం తెలిపినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరోసారి తన పునర్నియామకాన్ని కోరుకోవడం లేదంటూ చంద్రశేఖరన్ బోర్డు డైరెక్టర్లకు స్పష్టం చేసిన కొద్ది వారాలకే ఈ నిర్ణయం వెలువడడం గమనార్హం. వాస్తవానికి 2027 ఫిబ్రవరి 20తో చంద్రశేఖరన్ పదవీకాలం ముగియనుంది. అలాగే సంస్థను స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసే ప్రక్రియకూ బోర్డు ఆమోదం తెలిపింది. దీనిపై టాటా సన్స్ గానీ, టాటా ట్రస్టులు గానీ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు.అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్స్‌ను వదులుకోవడానికి టాటా సన్స్ చేసిన దరఖాస్తును ఆర్‌బీఐ ఇటీవల తిరస్కరించిన సంగతి తెలిసిందే. దీంతో టాటా సన్స్ లిస్టింగ్ అనివార్యం కానుంది. ఈ సమయంలో నాయకత్వ మార్పు సరికాదనే అభిప్రాయం బోర్డు సభ్యుల్లో వ్యక్తమైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అప్పుడే పెట్టుబడిదారులకు భరోసా కలుగుతుందని వారు అభిప్రాయపడినట్లు సమాచారం. దీంతో చంద్రశేఖరన్‌ను తన నిర్ణయంపై పునరాలోచన చేయాల్సిందిగా ది నామినేషన్ అండ్ రెమ్యునరేషన్ కమిటీ కోరగా.. బోర్డు అభ్యర్థనను ఆయన అంగీకరిం చారు. టాటా సన్స్ బోర్డు తాజా నిర్ణయంతో తదుపరి ఛైర్మన్ ఎంపిక ప్రక్రియ నిలిచిపోనుంది.

**ట్రస్ట్స్ నుంచి వ్యతిరేకత**

అయితే, బోర్డు సమావేశంలో టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా.. చంద్రశేఖరన్ పునర్నియామకం, లిస్టింగ్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. అయినప్పటికీ మెజారిటీ సభ్యులు చంద్రశేఖరన్ నియామకానికి పచ్చజెండా ఊపడంతో తీర్మానం ఆమోదం పొందినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టాటా సన్స్ లిస్టింగ్ విషయంలో మొదటి నుంచీ నోయెల్ టాటా వ్యతిరేకంగా ఉన్నారు. చంద్రశేఖరన్ పునర్నియామకం విషయంలో ఆయన గతంలో కండీషన్ పెట్టడం ఈ సందర్భంగా ప్రస్తావనార్హం. ఛైర్మన్ నియామకం, లిస్టింగ్ నిర్ణయాలను టాటా ట్రస్ట్స్ 'చట్ట విరుద్ధం' అని పేర్కొంది. ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ ప్రకారం మాత్రమే సెలక్షన్ కమిటీ ప్రక్రియ జరగాలని, ఈ నియామకం చెల్లదని ట్రస్ట్స్ వాదిస్తోంది. లిస్టింగ్‌కు వ్యతిరేకంగా ఓటు వేయాలని సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ కోరినప్పటికీ, నామినీ డైరెక్టర్ వేణు శ్రీనివాసన్ అందుకు నిరాకరించారు. ఈ రెండు నిర్ణయాలు అమలు కావాలంటే టాటా సన్స్ వార్షిక సాధారణ సమావేశంలో లో వాటాదారుల ఆమోదం పొందాల్సి ఉంటుంది.

### టాటా కంపెనీ షేర్లు పైకి

**టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ పునర్నియామకానికి బోర్డు ఆమోదం తెలపడంతో టాటా గ్రూప్ స్టాక్స్ రాణించాయి. బీఎస్ఈలో టాటా కెమికల్స్ ఇంట్రాడేలో 14 శాతం మేర లాభపడింది. టాటా సన్స్ ఎన్‌బీఎఫ్‌సీ సరెండర్ దరఖాస్తును తిరస్కరించిన తర్వాత ఈ స్టాక్ 36 శాతం మేర పెరగడం గమనార్హం. దీంతో పాటు టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ 6 శాతం, టీసీఎస్ 3 శాతం చొప్పున రాణించాయి. టాటా మోటార్స్, టాటా ఎలెక్సీ, టాటా టెక్, టాటా స్టీల్ షేర్లు కూడా లాభపడ్డాయి.**

## దమానీకి లాభాల ధమాకానే!

### ఎన్ఎస్ఈ షేరు ప్రతి రూ.10 పెరుగుదలపై రూ.40 కోట్ల లాభం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఎన్ఎస్ఈ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలో ఆకర్షణీయంగా లిస్ట్ అయితే.. డి-మార్ట్ అధిపతి రాధాకిషన్ దమానీకి లాభాల పంట పండుతుంది. ఇష్యూ ధర నుంచి, షేరు ధర ప్రతి రూ.10 పెరిగితే ఆయన పెట్టుబడి విలువకు అన్ని రూ.40 కోట్లు జత అవుతాయి. ఒకవేళ షేరు ధర రూ.10 తగ్గితే, రూ.40 కోట్ల చొప్పున ఆయన పెట్టుబడి విలువ తగ్గుతుంది. ప్రస్తుతం ఎన్ఎస్ఈలో ధమానీకి 1.58% వాటాకు సమానమైన 3.91 కోట్ల షేర్లు ఉన్నాయి. ఐపీఓ ధరల శ్రేణిలోని గరిష్ఠమైన రూ.1,785 ప్రకారం చూస్తే.. ఈ పెట్టుబడి విలువ సుమారు రూ.6,980 కోట్లు అవుతుంది.ఎన్ఎస్ఈలో ఎల్ఐసీనే అతి పెద్ద వాటాదారు. ఈ సంస్థకు 10.72% వాటాకు సమానమైన 26.53 కోట్ల షేర్లున్నాయి. ఐపీఓ ధరల శ్రేణిలో గరిష్ఠ ధర అయిన రూ.1,785 ప్రకారం ఎల్ఐసీ వాటా విలువ సుమారు రూ.47,356 కోట్లు. ఎన్ఎస్ఈలోని ఇతర ప్రధాన వాటాదార్లలో అరండా ఇన్వెస్ట్‌మెంట్స్ (మారిషస్) పీటీఈ లిమిటెడ్ (4.54%), స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (4.44%), ఎస్‌బీఐ కేపిటల్ మార్కెట్స్ (4.33%), మహాగోని లిమిటెడ్ (3.73%), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (3.23%) ఉన్నాయి.

రూ.534 కోట్ల పెట్టుబడిపై రూ.16,501 కోట్ల లాభం: ఎన్ఎస్ఈ ఐపీఓలో తమ షేర్లను విక్రయిస్తున్న వాటాదార్లు గణనీయ లాభాలను ఆర్జించనున్నారు. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా షేర్లు విక్రయిస్తున్న ప్రస్తుత 10 మంది వాటాదార్లకే, రూ.17,035 కోట్లు లభించనున్నాయి.

## పరిధి దాటి ప్రవర్తిస్తున్న ఏఐ మోడల్స్..


### ఆశ్చర్యకర విషయాలు బయటపెట్టిన ఓపెన్‌ఏఐ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కృత్రిమ మేధ మోడళ్లు తమ పరిధి దాటి పనిచేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఇలాంటి కొన్ని ఆందోళనకర ఘటనలను ఓపెన్‌ఏఐ బయటపెట్టింది. గత కొన్ని నెలల్లో ఏఐ మోడళ్లకు శిక్షణ ఇస్తున్న సమయంలో, వాటి పనితీరును పరీక్షిస్తున్నప్పుడు ఈ విషయాలను గుర్తించినట్లు సంస్థ తెలిపింది."ఇంకా విడుదల కాని ఓ ఏఐ మోడల్.. తనకు తానే సాధారణ నియమాలను పట్టించుకోవద్దంటూ సూచనలు రాసుకుంది. ఇతర చాట్‌బాట్‌లకు ఉన్న నియంత్రణల నుంచి బయటపడాలని పేర్కొంది. మరో ఘటనలో వినియోగదారుడి అనుమతి లేకుండానే ఏఐ మోడల్ కొన్ని ఫైళ్లను ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేసింది. చేసిన తప్పులను దాచేందుకు భవిష్యత్తు మోడల్స్‌కు సూచనలు ఇచ్చింది. అంతేగాక, సొంతంగా సీక్రెట్ మెసేజ్ బోర్డులను వాడుకోవడం.. పబ్లిక్ వెబ్‌సైట్లలో ఫైల్ షేరింగ్ చేయడం వంటివి గుర్తించాం" అని ఓపెన్‌ఏఐ ఓ నివేదికలో వెల్లడించింది.ఏఐ మోడళ్లు మనుషుల అనుమతి లేకుండా ఏమైనా చేస్తున్నాయా? ఇతర ఏఐ మోడళ్లతో కలిసి.. వాటిపై ఉన్న నియంత్రణలను తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయా? అనే అంశాలను ఇకపై మరింత నిశితంగా పరిశీలించనున్నట్లు ఓపెన్ ఏఐ ఈ సందర్భంగా పేర్కొంది. తమ ఏఐ మోడళ్లు కూడా టెస్టింగ్ సమయంలో మూడు సంస్థల వ్యవస్థల్లోకి ప్రవేశించినట్లు ఆంత్రోపిక్ సంస్థ ఇటీవల తెలిపింది. ఇదిలా ఉండగా.. కృత్రిమ మేధ గురించి ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏఐకి ఈ ప్రపంచం భయపడటం సమంజసమేనన్నారు. "ఏఐ ఎలా విఫలం కాగలదో ఇప్పటినుంచే ఊహించాల్సిన అవసరం లేదు. అయితే, భయం కలిగి ఉండటం మంచిదే. భవిష్యత్తులో ఏఐ మోడళ్లు కొన్ని విషయాల్లో మనుషుల కంటే ఎక్కువ సామర్థ్యం, తెలివితేటలు కలిగి ఉండబోతున్నాయి. ఆ మార్పు ఇప్పటికే మొదలైంది. ఏఐ సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాయనే నమ్మకం ప్రజల్లో ఉండాలి. అందుకు అనుగుణంగా వ్యవహరించడం మా బాధ్యత. ఏఐ సామర్థ్యం రోజురోజుకీ పెరుగుతుండటం ఆందోళనలకు దారితీస్తోంది. దానిపై మనషులపర్యవేక్షణతప్పనిసరిగాఉండాల్సిందే" అని అభిప్రాయపడ్డారు.

# రైడ్ బుకింగ్‌కు ముందే టిప్‌లు వద్దు

### క్యాబ్ అగ్రిగేటర్లకు కేంద్రం ఆదేశం

**దిల్లీ:** క్యాబ్ సేవలు అందించే ప్లాట్‌ఫామ్‌ల్లో, బుకింగ్‌కు ముందే ప్రయాణి కుల నుంచి అదనంగా వసూలు చేసే 'అడ్వాన్స్ టిప్పింగ్' ఫీచర్‌కు తక్షణమే స్వస్తి పలకాలని క్యాబ్, బైక్- ట్యాక్సీ అగ్రిగేటర్లను కేంద్ర ప్రభుత్వం ఆదేశిం చింది. ఈ తరహా పద్ధతులు వినియోగదారులను తప్పుదోవ పట్టించడమే కాకుండా, అనైతిక వ్యాపార పద్ధతుల కిందకు వస్తాయని వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరే బుధవారం స్పష్టం చేశారు. ముందస్తు టిప్‌లపై నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్‌కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయని సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) చీఫ్ కూడా అయిన నిధి ఖరే తెలిపారు. టిప్ ఇస్తేనే రైడ్ దొరుకుతుందన్నట్లుగా వినియోగదారులను ఒత్తిడికి గురిచేయడం నిబంధనలకు విరుద్ధమని, సమగ్ర విచారణ అనంతరం, ఈ పద్ధతులను పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. టిప్ ఇవ్వడం పూర్తిగా వినియోగదారుడి ఇష్టమని, ప్రయాణం ముగిసిన తర్వాత అందించిన సేవలు నచ్చితేనే.. ఇవ్వాల్సిన అంశమని పేర్కొన్నారు.ర్యాపిడోపై రూ.10 లక్షల జరిమానా: రోపెన్ ట్రాన్స్‌పోర్టేషన్ సర్వీసెస్ (ర్యాపిడో)పై సీసీపీఏ రూ.10 లక్షల జరిమానా విధించింది. రైడ్ బుకింగ్ జరుగుతుండగానే యాప్‌లో 'ధర ఎంత ఎక్కువ ఉంటే, రైడ్ దొరికే అవకాశం అంత ఎక్కువగా ఉంటుంది', 'కెప్టెన్లు రూ.60 వద్ద అంగీకరించడం లేదు, రూ.10, రూ.20, రూ.30 అదనంగా జోడించడానికి ప్రయత్నించండి' వంటి సందేశాలు చూపించడాన్ని సీసీపీఏ తప్పుబట్టింది. మొదట ఒక ఛార్జీ చూపించి, బుకింగ్ చేశాక ఆ ధరకు డ్రైవర్లు రావడం లేదంటూ ఎక్కువ డబ్బులు అడగడం వినియోగదారుల్లో ఆందోళనను, రైడ్ దొరకదనే భయాన్ని సృష్టిస్తుందని, ఇది డార్క్ ప్యాటర్న్ కిందకు వస్తుందని సీసీపీఏ పేర్కొంది. దూరం, సమయం, ట్రాఫిక్, టోల్స్, డ్రైవర్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని లెక్కించే.. బుకింగ్ సమయంలో ఛార్జీ చూపిస్తారు కాబట్టి, ప్రయాణం మొదలుకాకముందే మళ్లీ అదనంగా అడగడానికి ఎటువంటి సమర్థన లేదని స్పష్టం చేసింది.ఉబర్, ఓలా సంస్థలు అనుసరిస్తున్న అడ్వాన్స్ టిప్పింగ్, డైనమిక్ ప్రైసింగ్ విధానాలపైనా సీసీపీఏ విచారణ కొనసాగుతోంది. డార్క్ ప్యాటర్న్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఇప్పటికే ఉబర్, ఓలా, ర్యాపిడో, నమ్మయాత్రి ప్లాట్‌ఫామ్‌లకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది.



## క్యాన్సర్ చికిత్స కోసం కాంపాక్ట్ ప్రోటాన్ థెరపీ

ముంబయి: క్యాన్సర్ చికిత్సలో అత్యంత ప్రభావ వంతమైన అత్యాధునిక 'కాంపాక్ట్ ప్రోటాన్ థెరపీ' వ్యవస్థలను మనదేశంలో తీసుకొచ్చేందుకు ఇజ్రాయెల్ మెడికల్ టెక్నాలజీ సంస్థ పి-క్యూర్‌తో దేశీయ ఆరోగ్య సంరక్షణ కంపెనీ అరిస్టియన్ ప్రోటాన్ సెంటర్ ఒప్పందం కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా ప్రోటాన్ థెరపీ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు అరిస్టియన్ దాదాపు రూ.1900 కోట్ల దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టనుంది. బెంగళూరులో అరిస్టియన్‌కు చెందిన 660 పడకల క్వాటర్నరీ క్యాంపస్ 'సెంటియం ట్ హెల్త్ సిటీ' లో దేశంలోనే తొలి కాంపాక్ట్ ప్రోటాన్ థెరపీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రెండో కేంద్రాన్ని కేరళంలోని కోచిలో ఏర్పాటు చేస్తారు. మూడో కేంద్రం కోసం ప్రదేశం, వ్యూహాత్మక భాగస్వాముల ఎంపిక ప్రక్రియ నడుస్తోంది. 'మన దేశంలో రోగుల ఆర్థిక స్తోమతకు అందుబాటులో ఉండేలా, ప్రపంచంలోనే అత్యంత అధునాతన రేడియేషన్ థెరపీని అందించడమే మా లక్ష్యం' అని అరిస్టియన్ సీఎండీ, రేడియేషన్ ఆంకాలజిస్ట్ లోహిత్ జి.రెడ్డి పేర్కొన్నారు. భారత్ వంటి అధిక జనాభా, విస్తృత డిమాండ్ ఉన్న మార్కెట్లను దృష్టిలో ఉంచుకుని అల్ట్రాకాంపాక్ట్ వ్యవస్థను రూపొందించామని పి-క్యూర్ సీఈఓ మైఖేల్ మరాష్ తెలిపారు.



జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
18 సెప్టెంబర్ 2026

# తెలంగాణ యోధుల త్యాగం వెలకట్టలేనిది

- రాచరిక వ్యవస్థకు చరమగీతం.. ప్రజాస్వామ్యానికి నాంది
- త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ
- సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం
- తెలంగాణ రైజింగ్-2047తో సరికొత్త లక్ష్యాలు



**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట యోధుల త్యాగం వెలకట్టలేనిదని శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. నిజా ం పాలనలో భూస్వాములు, జమీందార్లు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌ల అణచివేత, వెట్టిచాకిరీ, పన్నుల భారానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు పోరాడారని తెలిపారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడంతో ప్రజాస్వామ్య పాలనకు నాంది పలికిందన్నారు. నాటి యోధుల త్యాగాల ఫలితమే నేటి స్వేచ్ఛ అని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగుల సంక్షేమానికి పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. 72 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, రైతు భరోసా, రైతు బీమా, సన్నబియ్యానికి బోనస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పెన్షన్లు వంటి పథకాలను వివరించారు. వికారాబాద్ జిల్లాలో 2,488 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, వివిధ దశల్లో ఉన్న ఇళ్లకు రూ.221 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 1,06,272 మందికి చేయూత పెన్షన్లు అందుతున్నాయని చెప్పారు. కోట్‌పల్లి మండలం బార్వాద్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో సౌర విద్యుత్ ప్లాంట్ నిర్మాణం పూర్తయింద న్నారు. తెలంగాణను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు కోర్ అర్బన్, పెరి-అర్బన్, రూరల్ అగ్రికల్చర్ రీజియన్లుగా విభజిస్తున్నట్లు తెలిపారు. 'తెలంగాణ రైజింగ్-2047'లో భాగంగా 2035 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్లు ఉమాశంకర్ ప్రసాద్, వెంకటాచారి, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యమకారుల హామీలు అమలు చేయాలి

- ఆలస్యమైతే అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం: శ్రీనివాస్‌గౌడ్
- త్యాగాలను గుర్తించి న్యాయం చేయాలి: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి
- 250 గజాల ఇంటి స్థలం, ఇతర హామీలు అమలు చేయాలని డిమాండ్



**అల్వాల్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అల్వాల్ దీక్షా శిబిరం వద్ద గురువారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి దీక్షలకు సంఘీభావం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించి త్యాగాలు చేసిన వారికి తగిన గుర్తింపు, న్యాయం దక్కలేదని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఉద్యమ సమయంలో ఉపాధి, ఆస్తులు కోల్పోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని, అమర వీరుల కుటుంబాలు, ఉద్యమకారుల సమస్య లను పరిష్కరించాలని కోరారు.

హామీల అమలులో జాప్యం చేయవద్దని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశా రు. ఆలస్యం కొనసాగితే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశా న్ని ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. 2023 కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం, అమరవీరుల కుటుంబాలకు గౌరవ వేతనం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఉద్యమకారులపై కేసుల ఉపసంహరణ తదితర హామీలు ఉన్నాయని నాయకులు గుర్తుచేశారు. ఉద్యమ సమయంలో కేసులు నమోదైన వారినే ఉద్యమకారులుగా పరిగణించకుండా పోలీసు రికార్డులు, ఇతర ఆధారాలను పరిశీలించి అర్హులను గుర్తించాలని జేఏసీ నాయకుడు సురేందర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో పుట్నాల కృష్ణ, డోలి సుధీర్, అనిల్, సంతోష్, రషీద్, వీరస్వామి, మల్లేష్, సామ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

# గ్యారెంటీల పేరుతో గబ్బర్‌సింగ్ పాలన

- ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతల తీవ్ర విమర్శలు
- హామీలను అమలు చేయాలని డిమాండ్
- హైడ్రా, ఇసుక అక్రమ రవాణాపై ఆరోపణలు
- ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరిక



**తాండూరు, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి నివాసంలో గురువారం బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహి ంచారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు సమాధానం గా సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై నేతలు తీవ్ర విమర్శలు చేశారు. మాజీ గ్రంథాలయ చైర్మన్ రాజుగౌడ్ మాట్లాడుతూ 22-ఏ జీవోపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాలనలో భారీగా అప్పులు చేశారని, కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలనే కొనసాగిస్తున్నారని ఆరోపించారు. తాండూరులోని 130 సర్వే నంబర్‌లో పనులు నిలిపివేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రె స్ ప్రభుత్వం మాయమాటలతో అధికారంలోకి వచ్చిందని విమర్శిం చారు. ఆలయాలకు సంబంధించి న కాంప్లెక్స్ నిర్మాణం, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై ప్రశ్నలు లేవనెత్తారు. ఇసుక, ఎర్రమట్టి అక్రమ రవాణా జరుగుతోందని ఆరోపించారు. సీనియర్ నాయకుడు నర్సింలు మాట్లాడుతూ హైడ్రా పేరుతో విధ్వంసం జరుగుతోందని విమర్శించారు. కోట్‌పల్లి అభివృద్ధి, తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిపై సీఎం వ్యాఖ్యలను ప్రస్తావించారు. ఇసుక, మట్టి, నీరు, దవాఖాన తరలింపుపై పోరాటం కొనసా గిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నరుకుల నరేందర్‌గౌడ్, శ్రీనివాస్‌చారి, పట్లోళ్ల నర్సింలు, వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు సురేష్‌నాయక్, యోగానంద్, యువ నాయకులు సంతోష్‌గౌడ్, భాస్కర్ పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈల గ్రీనింగ్‌కు క్లీన్‌టెక్ కీలకం




**ఖైరతాబాద్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** భారతదేశాన్ని నెట్-జీరో ఆర్థిక వ్యవస్థ వైపు తీసుకె ళ్లేందుకు ఎనర్జీ ఎఫిషియెన్సీ, విద్యుదీకరణ, క్లీన్‌టె క్, డిజిటల్ పరిష్కారాలపై హైదరాబాద్‌లో జరిగిన సిఐఐ 25వ ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్-2026లో చర్చించారు. పరిశ్రమలు విద్యుదీకరణ, ప్రాసెస్ మెరుగుదల, వ్యర్థ ఉష్ణ పునరుద్ధరణ, ఏఐ, ఎల్ఓ టీ, డిజిటలైజేషన్ రంగాల్లో రూ.3,590 కోట్ల పెట్టు బడులకు కట్టుబడ్డాయి. బిఈఈ డైరెక్టర్ జనరల్ కృష్ణ చంద్ర పాణిగ్రాహి ఎనర్జీ ఎఫిషియెన్సీ, విద్యు దీకరణ కీలకమని పేర్కొనగా, సిఐఐ సమ్మిట్ చైర్మ న్, బిఎల్పీ-ఇండస్ట్రీ ఏఐ వ్యవస్థాపకుడు, సీఈఓ తేజ్‌ప్రీత్ సింగ్ చోప్రా ఎంఎస్ఎంఈలకు ఏఐ, డిజి టల్ టెక్నాలజీలతో శక్తి సామర్థ్యాన్ని పెంచవచ్చ న్నారు. సిఐఐ గోద్రెజ్ జీబీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వి.కిరణ్ అనంత్ గత మూడేళ్లలో 720 పరిశ్రమ లు రూ.5,700 కోట్ల పెట్టుబడులతో రూ.7,100 కోట్లకు పైగా పొదుపు సాధించాయని తెలిపారు. సమ్మిట్‌లో సిఐఐ-బీఈఈ సంయుక్తంగా 'ఇండియ న్ హీట్ పంప్ అట్లాస్'ను ఆవిష్కరించారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**నిందితుడికి రూ.16 వేల జరిమానా..నాంపల్లి 4 అదనపు సెషన్స్ కోర్టు తీర్పు**

**సంజీవరెడ్డినగర్/అమీర్‌పేట్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** హత్య, దొంగతనం, ఆధారాల చెరిపివేత కేసులో నిందితుడికి నాంపల్లి 4అదనపు సెషన్స్ కోర్టు జీవిత ఖైదు, రూ.16 వేల జరిమానా విధిం చింది. క్రైం నంబర్ 110/2020లో ఐపీసీ 302, 379, 201 సెక్షన్ల కింద నమోదైన కేసులో లిలిముడే రాజునాయక్ (37)ను దోషిగా నిర్ధారిస్తూ న్యాయమూర్తి జె.విక్రమ్ గురువారం తీర్పు వెలువరించారు. కేసు వివరాల ప్రకారం.. 2020 ఫిబ్రవరి 1న వికాస్‌పురి కాలనీకి చెందిన పి.రమేష్ (50) బోరబండ వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అదే రోజు రాత్రి స్నేహితుడు సాయితో ఫోన్‌లో మాట్లాడి, అతడి ఇంట్లో ఉన్నట్లు చెప్పాడు. మరుసటి రోజు రమేష్ ఫోన్ నుంచి కోడలికి వాట్సాప్ సందేశం రావడంతో కుటుంబ సభ్యులు తిరిగి కాల్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో రమేష్ కుమారుడు ప్రదీప్ సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం నిందితుడిని దోషిగా నిర్ధారించిన కోర్టు జీవిత ఖైదు, రూ.16 వేల జరిమానా విధించింది.

# చేవెళ్ల ట్రెజరీలో ఏసీబీ దాడులు



**రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏటీవో, ఎస్టీవో పట్టివేత**

**చేవెళ్ల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** పదవీ విరమణ పొందిన పంచాయతీ కార్యదర్శి నుం చి రూ.లక్ష లంచం తీసుకుంటుండగా చేవెళ్ల సబ్ ట్రెజరీ కార్యాలయానికి చెందిన ఏటీవో అనురాధ, ఎస్టీవో లక్ష్మయ్యను ఏసీబీ అధికారు లు గురువారం పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ వివరాల ప్రకారం.. సుమారు నాలుగేళ్ల క్రితం పదవీ విరమణ పొందిన పంచాయతీ కార్యదర్శికి రూ.23 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ రావాల్సి ఉంది. బిల్లులు పాస్ చేసేందుకు ఏటీవో, ఎస్టీవోలు రూ.2.50 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. మొత్తం నగదు ఒకేసారి చెల్లించడం సాధ్యం కాదని బాధితుడు చెప్పడంతో ముందుగా రూ.లక్ష ఇవ్వాలని, మిగిలిన మొత్తాన్ని బిల్లుల ప్రక్రియ పూర్తయిన తర్వాత చెల్లించాలని కోరినట్లు అధికారులు తెలిపారు. లంచం కోసం ఒత్తిడి చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయిం చాడు. వారి సూచనల మేరకు గురువారం చేవెళ్ల సబ్ ట్రెజరీ కార్యాలయంలో రూ.లక్ష నగదు అందజేశాడు. ఏటీవో అనురాధ సమక్షంలో ఆమె తరఫున అటెండర్ జంగయ్య రూ.50 వేలు, ఎస్టీవో లక్ష్మయ్య రూ.50 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఘటన పై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. బాధితుడి వివరాలను గోప్యంగా ఉంచినన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

## నల్లగొండ జిల్లా సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

- రైతులకు రూ.2,005 కోట్ల రుణమాఫీ
- విద్య, వైద్యం, సాగునీటికి ప్రాధాన్యం
- మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట: మంత్రి కోమటిరెడ్డి



**నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తూ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా నల్లగొండ పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. రైతులకు సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్, ఉచిత విద్యుత్, రైతుబీమా వంటి పథకాలతో అండగా నిలుస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లాలో 1,48,760 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం కొనుగోలు చేసి రూ.74.38 కోట్లు చెల్లించామన్నారు. 2,34,281 మంది రైతులకు రూ.2,005.01 కోట్ల పంట రుణమాఫీ చేసినట్లు వెల్లడించారు. మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పించ డంతో పాటు రూ.3.50 కోట్లతో మహిళా పెట్రోల్ బంకు, రూ.2.50 కోట్లతో నీలగిరి మహిళా మార్ట్ పనులు చేపట్టినట్లు తెలిపారు.

విద్య, వైద్య రంగాల్లోనూ పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. నకిరేకల్‌లో రూ.32 కోట్లతో 100 పడకల ఆసుపత్రి, నల్లగొండలో రూ.20 కోట్లతో నర్సింగ్ కళాశాల, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణకు రూ.442 కోట్లు చెల్లించామని, కాలువల లైనింగ్ పనులకు నిధులు మంజూరు చేశామన్నారు. నల్లగొండ బైపాస్‌కు రూ.596 కోట్లు, నకిరేకల్--గురజాల రహదారి విస్తరణకు రూ.45.60 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం తొలి విడతలో 17,873 ఇళ్లను రూ.459 కోట్లతో పూర్తి చేశామని, రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 2 వేల ఇళ్ల చొప్పున నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ప్రజావాణి, భూభారతి ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నా మని, భూభారతి దరఖాస్తుల్లో 99.21 శాతం పరిష్కరించినట్లు చెప్పారు. తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యాలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

# కోకట్ గ్రామంలో నీటి సమస్య పరిష్కారం

- హిందూ ఉత్సవ సమితికి రూ.3.51 లక్షల విరాళం
- రూ.4.60 లక్షల డీఎంఎఫ్టీ నిధులతో రెండు బోర్లు
- గ్రామ ప్రజల నీటి అవసరాలకు ఎమ్మెల్యే చొరవ

**యాలాల/తాండూరు, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):**



యాలాల మండలం కోకట్ గ్రామంలో నీటి వసతులను మెరుగుపరిచేందుకు రూ.4.60 లక్షల డీఎంఎఫ్టీ నిధులతో రెండు బోర్లు ఏర్పాటు చేయించినట్లు తాండూ రు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. గ్రామస్తు ల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులతో సమన్వయం చేసి ఈ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. బోర్ల ఏర్పాటుతో గ్రామంలో నీటి సమస్య కొంతమేర పరిష్కారమవుతుందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కే.మహిపాల్, సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాండూరు పట్టణంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి రూ.3.51 లక్షల విరాళాన్ని అందజేశారు. సమితి అధ్యక్షురాలు, మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్‌కు విరాళాన్ని అందించారు. హైదరాబాద్ రోడ్డులో సమితికి భూమి కేటాయించడంతో పాటు సుమారు రూ.85 లక్షలతో భవనం, ప్రహరీ గోడ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. భవిష్యత్‌లోనూ సమితికి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, సమితి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## ఉద్దమర్రిలో ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు ఆర్గానిక్ ఫార్మింగ్‌పై శిక్షణ

**శామీర్ పేట్, సెప్టెంబర్ 17(జనం సాక్షి) :** మూడుచింతలపల్లి మున్సిపాలిటీలోని ఉద్దమరి గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ తరఫున రైతులకు ఆర్గానిక్ ఫార్మింగ్ మరియు నాచురల్ ఫార్మింగ్ మీద శిక్షణ కార్యక్రమం నిర్వ హించారు . ఈ శిక్షణ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ యూనివర్సిటీ శాస్త్రవేత్త శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారిని ప్రవీణ,మండల ఉద్యాన వన శాఖ అధికారి వెంకటరమణ, హెచ్ఈఓ సంధ్య, ఏఈఓ సురేష్ రెడ్డి, ఉద్దమర్రి కౌన్సిలర్లు శ్రీలత, లతా, లతా భూపాల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులకు కూరగాయల సాగులో ఆర్గానిక్ ఫార్మింగ్ చేయడం వలన వచ్చే లాభా లను భూసార పరీక్షలు చేయించుకోవడం వలన వచ్చే లాభాలను రైతులకు శిక్షణ కార్యక్రమంలో వివరించారు . ఈ కార్యక్రమంలో స్పిక్ కంపెనీ మేనేజర్ అబ్దుల్ హుసేన్ పాల్గొన్నారు. రైతులు ఎల్నినో కారణంగా రాబోయే కాలంలో ఏ పంటలకు వెళ్తే బాగుంటుంది అని శాస్త్రవేత్తలతో చర్చ నిర్వహించినట్లు పేర్కొన్నారు.

# ప్రియుడి చేతిలోనే.. కళ్యాణి హత్యా

- ఆదిభట్ల ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి
- నిందితున్ని అరెస్టు రిమాండ్ కు తరలింపు
- కేసులు ఛేదించిన పోలీసులకు అభినందనలు



**రంగారెడ్డి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** ప్రియురాలు కొర్రపాటి కళ్యాణి(36)ని ప్రియుడే దాసరి నరసింహమూర్తి పథకం ప్రకారమే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆదిభట్ల ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి తెలిపారు. నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు వివరించారు. పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తన సిబ్బందితో కలిసి ఆయన మాట్లాడారు. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని నాదర్ గుల్ శ్రీపురం కాలనీలో కొద్దికాలంగా కొర్రపాటి కళ్యాణి(35), దాసరి నరసింహమూర్తి(35) కలిసి సహజీవనం చేస్తున్నారు. కాగా వీరి మధ్య 1 గత కొంతకాలంగా చెదురు మధుర గొడవలు జరుగుతుండివి. అందులో భాగంగానే ఈనెల 13వ తేదీన రాత్రి ఏ ఊరి మధ్య తీవ్ర వాగ్వివాదంచోటుచేసుకుంది. ఈ క్రమంలో కళ్యాణి మెడకు నైలాన్ తాడు బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. ఈ హత్యను ఆత్మహత్యగా నమ్మించేందుకు సంఘటనా స్థలంలో ఆధారాలను మార్చేందుకు యత్నించాడు. అంతేకాకుండా, మృతురాలి ఫోన్ నుంచే ఆమె భర్తకు, ఇతరులకు తప్పుడు సమాచారం ఇచ్చాడు . అక్కడి నుంచి పరారయ్యాడు. మృతురాలి తల్లి కందిమల్ల శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదిభట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కేసు దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు గురువారం ఉదయం 11:00 గంటలకు నాదర్ గుల్ ప్రాంతంలో నిందితుడు దాసరి నరసింహ మూర్తిని అదుపులోకి తీసుకున్నారు. అతన్ని రిమాండ్ కు తరలించారు. ఈ కేసును ఛేధించి, నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఆదిభట్ల సీఐ ఎస్. రమేశ్, సబ్-ఇన్స్పెక్టర్లు డి .వెంకటేశ్, ఎన్ నోయల్ రాజ్, క్రైమ్ సిబ్బంది పై. ఎల్లయ్య, సంతోష్ కుమార్, సంతోష్, శివచంద్ర, సందీప్, టీ. ఉపేందర్ రెడ్డిలను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే జేబుకు చిల్లు


- మర్పల్లి సర్కారు దవాఖానలో సిరంజీల కొరత
- పేద, మధ్యతరగతి రోగులకు అదనపు భారం

**మర్పల్లి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** మర్పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సిరంజీల కొరతతో రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు తెలిపారు. గురువారం చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన వారికి సిరంజీలు అందుబాటులో లేవని, అవసరమైతే బయట కొనుగోలు చేసుకోవాలని సిబ్బంది సూచించినట్లు రోగులు పేర్కొన్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందుతుందనే ఆశతో పేద, మధ్యతర గతి ప్రజలు చికిత్స కోసం వస్తుంటారని, అవసరమైన వైద్య పరికరాల్లో ఒకటైన సిరంజీలను కూడా బయట కొనుగోలు చేయాల్సి రావడం ఇబ్బంది కరంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

సిరంజీల కొరతకు సరఫరా లో జాప్యమా, స్టాక్ పంపిణీలో సమస్యా అనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. తక్షణమే సిరంజీలను అందుబాటులోకి తీసుకువచ్చి రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

# అనుమతి లేని షెడ్ కూల్చివేత

- ఫిర్యాదు అందిన వెంటనే టౌన్ ప్లానింగ్ అధికారుల చర్యలు
- గాయత్రి హిల్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం
- అక్రమ నిర్మాణాలపై నిఘా పెంచిన అధికారులు
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: డిప్యూటీ కమిషనర్






**బోడుప్పల్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని గాయత్రి హిల్స్ ప్రధాన రహదారిలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న షెడ్‌పై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. అనుమతి లేని నిర్మాణం చేపడుతున్నారంటూ ఫిర్యాదు అందడంతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న షెడ్‌ను కూల్చివేశారు. నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించిన అనంతరం ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

జనవాసాల మధ్య అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే రాకపోకలు, పారిశుద్ధ్యం, భద్రతకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనుమతి లేని షెడ్‌పై తక్షణమే స్పందించి కూల్చివేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. బోడుప్పల్ పరిధిలోని ఇతర ప్రాంతాల్లోనూ అనుమతి లేని నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

అనుమతి లేని నిర్మాణాలు, షెడ్‌ల విషయంలో ఎలాంటి ఉపేక్ష ఉండదని డిప్యూటీ కమిషనర్ ఏ.శైలజ స్పష్టం చేశారు. నిర్మాణదారులు ముందుగా నిబంధనలు, అవసరమైన అనుమతులను పరిశీలించుకుని నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే అధికారుల పరిశీలనలో గుర్తించిన మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సీఆర్‌పీఎఫ్ పబ్లిక్ స్కూల్‌లో బోయింగ్ సుకన్య స్టెమ్ ల్యాబ్

- ల్యాబ్‌ను ప్రారంభించిన సీఆర్‌పీఎఫ్ డీజీ జి.పి. సింగ్
- బాలికల్లో స్టెమ్ రంగాలపై ఆసక్తి పెంపే లక్ష్యం
- ప్రయోగాలు, ప్రాజెక్టులతో ప్రాక్టికల్ శిక్షణ
- ప్రతిభావంతులైన బాలికలకు రూ.1.25 కోట్ల వరకు స్కాలర్‌షిప్



**జవహర్‌నగర్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** జవహర్‌నగర్‌లోని సీఆర్‌పీఎఫ్ పబ్లిక్ స్కూల్‌లో బోయింగ్ సుకన్య స్టెమ్ ల్యాబ్‌ను సీఆర్‌పీఎఫ్ డీజీ జి.పి. సింగ్ గురువారం ప్రారంభించారు. బోయింగ్ ఇండియా, దక్షిణాసియా అధ్యక్షుడు సలీల్ గుప్తే సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో, ముఖ్యంగా బాలికల్లో సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణిత రంగాలపై ఆసక్తి పెంపొందించడం, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ల్యాబ్ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు బోయింగ్ శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో ప్రయోగాలు, ప్రాజెక్టులు, ప్రోటోటైప్‌ల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. అర్హత కలిగిన ప్రతిభావంతులైన బాలికలకు విమానయాన రంగంలో ఉన్నత విద్య కోసం రూ.1.25 కోట్ల వరకు స్కాలర్‌షిప్ సహాయం అందించనున్నట్లు బోయింగ్ ప్రతినిధులు తెలిపారు. ల్యాబ్‌ను సందర్శించిన డీజీ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించి వారిని అభినందించారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే 40 స్టెమ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసినట్లు బోయింగ్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఐజీపీ టీ.విక్రమ్, డీజీ డా.బి.వీర్రాజు, సలీల్ గుప్తే, బోయింగ్ సీఎస్ఆర్ ప్రతినిధి ప్రవీణ యగ్నాంబట్, ప్రిన్సిపాల్ డి.అపర్ణ, వైస్ ప్రిన్సిపాల్ కె.హరిశంకర్, హెడ్‌మిస్ట్రెస్ ఆశా జి.కుమార్, సీఆర్‌పీఎఫ్, బోయింగ్ అధికారులు పాల్గొన్నారు.

# బాలల లైంగిక దోపిడీ కంటెంట్‌పై పోలీసుల విచారణ

- సైబర్ టిప్‌లైన్ నివేదిక ఆధారంగా ప్రాథమిక దర్యాప్తు
- చేవెళ్ల పరిధిలోని చిరునామాకు సంబంధించిన లీడ్స్ గుర్తింపు
- సాంకేతిక ఆధారాల పరిశీలనకు సైబర్ క్రైమ్ యూనిట్‌కు సమాచారం
- కంటెంట్‌ను డౌన్‌లోడ్, షేర్ చేయొద్దని పోలీసుల సూచన

**చేవెళ్ల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** బాలలపై లైంగిక దోపిడీకి సంబంధించిన ఆన్‌లైన్ కంటెంట్ ప్రసారాన్ని అరికట్టే చర్యల్లో భాగంగా అందిన సైబర్ టిప్‌లైన్ నివేదిక ఆధారంగా చేవెళ్ల పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టారు. తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు అందిన నివేదికలోని మొబైల్ నంబర్, చిరునా మా, కమ్యూనికేషన్ వివరాలను పరిశీలించగా, సంబంధిత లీడ్ చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ చిరునామాకు సంబంధించినదిగా గుర్తించి నట్లు పోలీసులు తెలిపారు. నివేదికలో పేర్కొన్న ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్, ఇతర వివరాల ఆధారం గా సంబంధిత వ్యక్తి వివరాలను మరింతగా ధ్రువీకరించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రాథమి క విచారణలో లభించిన సమాచారాన్ని తదుపరి చట్టపరమైన చర్యలు, సమగ్ర దర్యాప్తు కోసం సంబంధిత సైబర్ క్రైమ్ యూనిట్‌కు పంపినట్లు తెలిపారు. నివేదికలోని పేరు, చిరునామా, మొబైల్ నంబర్ తదితరాలు కేవలం ప్రాథమిక లీడ్స్ మాత్రమేనని, అవి నేరానికి తుది సాక్ష్యాలు కావని పోలీసులు స్పష్టం చేశారు.

సాంకేతిక ఆధారాలు, ఇతర వివరాలను పరస్పరం ధ్రువీకరించి నేరానికి సంబంధించి వ్యక్తుల పాత్రను చట్టప్రకారం నిర్ధారిస్తామని తెలిపారు. బాలలపై లైంగిక దోపిడీకి సంబంధించిన ఫొటోలు, వీడియోలు లేదా ఇతర కంటెంట్‌ను డౌన్‌లోడ్, సేవ్, ఫార్వర్డ్, షేర్ చేయరాదని పోలీసులు సూచించారు. అలాంటి కంటెంట్ కనిపిస్తే మరింతగా ప్రసారం చేయకుండా వెంటనే పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# స్వచ్ఛత పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

- మిషన్ భగీరథ నీటి పరీక్షలు, సరఫరాపై దృష్టి సారించాలి
- కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మించాలి: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 17 (జనం సాక్షి);** స్వచ్ఛత పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ పై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవ 2026 పోస్టర్లను ఆవిష్కరించారు.నీటి నాణ్యత పర్యవేక్షణ కింద జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి ప్రతి నెలా 250 నమూనాలు రసాయన పరీక్షల కోసం 50 నమూనాలు బ్యాక్టీరియా పరీక్షల కోసం సేకరిస్తున్నామని మిషన్ భగీరథ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వచ్ఛభారత్ మిషన్లో భాగంగా ఇందిరమ్మ ఇండ్లలో లక్ష్యం మేరకు మరుగుదొడ్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల రద్దీ అధికంగా ఉండే దేవాలయాలు,బస్టాండ్,మార్కెట్లు,కొత్తగా నిర్మించిన వీవో బిల్డింగ్స్, అంగన్వాడి బిల్డింగ్స్ వద్ద స్వచ్ఛభారత్ మిషన్ ఫండ్స్ ద్వారా కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మించాలని సూచించారు. పురోగతిలో ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మురుగునీటి నిర్వాణ కొరకు డ్రైనేజ్ ఎండింగ్ సోక్ పిట్లను స్వచ్ఛభారత్ మిషన్ ఫండ్స్ ద్వారా చేయించాలని సూచించారు.వేములవాడ, సిరిసిల్ల డివిజన్లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్లకు స్థలాన్ని గుర్తించామని, పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేసుకోవాలని, బట్ట సంచులను వాడే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛత హీ సేవ 2026 లో కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని, పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని పిలుపు నిచ్చారు.గ్రామాలలో చెత్తపోగు బడే ప్రదేశాలను గుర్తించాలని, వాటిని శుభ్రం పరిచి రంగులు వేయించాలని ఆదేశించారు. నీటి కుంటలు, చెరువులు, కాలువల్లో ప్లాస్టిక్ కవర్లను వేయకుండా గ్రామపంచాయతీ సెక్రటరీ, మున్సిపాలిటీల్లో సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఇట్టి సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఎస్ బీ ఎం సురేశ్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల భూములు పేదలకు అందే విధంగా చూస్తాం

- వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**సిరిసిల్ల టౌన్ సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** 22ఏతో పేద భూములు పేదలకు అందే విధంగా ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా పాలనలో చూస్తుందని, వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవాన్ని సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు జాతీయ జెండా ఎగరవేసి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన ఇందిరమ్మ రాజ్యంలో రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా అధికారికంగా రేవంత్ రెడ్డి హైదరాబాద్ నడిబొడ్డున జెండా ఎగరవేశారని తెలిపారు, ఆనాటి చరిత్ర ఈనాటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉ ందన్నారు. పేదల అభ్యున్నతి కోసం సంక్షేమ ఫలాలను అందిస్తూ ప్రాంతాల అభివృద్ధి కోసమే ఈ ప్రజా పాలన కొనసాగుతుందని తెలిపారు.అక్రమార్గాన తెలంగాణ ఉద్యమం పేరిట పది సంవత్సరాలు, తెలంగాణ వచ్చాక మరో 10 సంవత్సరాల కాలంలో దోచుకుని దాచుకున్న వివరాలు కూడా సీ.ఎం,రేవంత్ రెడ్డి బట్టబయలు చేశారన్నారు. ధరణి పేరిట పేదలకు జరుగుతున్న జరిగిన అనర్థాలవల్ల పేదలకు చెందాల్సిన భూముల్ని అక్రమార్గాన దోచుకున్న 2000 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 22ఏకు సంబంధించి ప్రతి పేదవాడికి భూమి అందేలా చూస్తామన్నారు. ధరణి పేరిట భూములు కాజేసిన వారిని నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ బడా బాబులు ఎవరైనా వారిపై ఉక్కు పాదం మోపి భూముల్ని పేదలకు అందిస్తామని తెలిపారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ సూర్య దేవరాజు రాగుల రాములు, సబ్బని వేణు కూరపాటి శ్రీశైలం, బొద్దుల శ్రీనివాస్, వెంగళ లక్ష్మీ నరసయ్య పాల్గొన్నారు.

## భూ భారతి రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

### బోధన్ ఆర్డీవో విజయ కుమారి



**బోధన్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** బోధన్ ఉమ్మడి మండలంలోని బండారుపల్లి ఖాజాపూర్ గ్రామాలలో నిర్వహిస్తున్న భూభారతి రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఆర్డీవో విజయ్ కుమారి పిలుపునిచ్చారు. గురువారం పై గ్రామాలలో నిర్వహించడం భూభారతి రీ సర్వే కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా రైతుల పక్షాన నిలబడి వారి భూమికి సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించేందుకు ఈ సర్వేను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే సర్వే సమయంలో రైతులు తప్పకుండా ఉండాలని లేకుంటే ఆ తర్వాత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. భూములకు సంబంధించిన ఇలాంటి సమస్య అయినా అధికారులకు వివరించాలని వారు వాటిని అక్కడే పరిష్కరిస్తారని ఆర్డీవో విజయ కుమారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, ఆర్మూర్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, నిజామాబాద్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, బోధన్ తహసీల్దార్ విఠల్ , సాలూర మండల తాసిల్దార్ నవాజ్, బండారుపల్లి సర్పంచ్ కాడి సాయిలు, ఖాజాపూర్ సర్పంచ్ చింతం నాగయ్య, అధికారులు రైతులు పాల్గొన్నారు.

# ముందస్తు నిర్ధారణతో కీళ్ల ఆరోగ్యం

- రుమటాయిడ్ ఆర్థరైటిస్‌ను నిర్లక్ష్యం చేయొద్దు
- తొలి 3-6 నెలలు చికిత్సకు కీలకం
- పర్యవేక్షణ లేకుండా పెయిన్‌కిల్లర్లు, స్టెరాయిడ్లు వద్దు
- ముందస్తు చికిత్సతో కీళ్ల నష్టం నివారణ



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** రుమటాయిడ్ ఆర్థరైటిస్ లక్షణాలను తొలిదశలో గుర్తించి చికిత్స ప్రారంభించడం ద్వారా కీళ్ల శాశ్వత నష్టాన్ని, వైకల్యాన్ని నివారించవచ్చని సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ రుమటాలజిస్ట్ డాక్టర్ ఐ. రాజేంద్ర వరప్రసాద్ తెలిపారు. రుమాటిక్ వ్యాధుల అవగాహన మాసం సందర్భంగా ఆయన మాట్లాడారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్ సాధారణంగా చేతుల్లోని చిన్న కీళ్ల నొప్పి, వాపు, ఉదయం బిగుసుకుపోవడం వంటి లక్షణాలతో ప్రారంభమై ఇతర కీళ్లకు వ్యాపిస్తుందని చెప్పారు. వ్యాధి ప్రారంభమైన తొలి మూడు నుంచి ఆరు నెలలు చికిత్సకు అత్యంత కీలకమన్నారు. సకాలంలో చికిత్స అందితే కీళ్ల పనితీరును కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం శాశ్వత నివారణ లేకపోయినా ఆధునిక చికిత్సా విధానాలతో వ్యాధిని నియంత్రించుకుని సాధారణ జీవితం గడపవచ్చన్నారు. వైద్యుల పర్యవేక్షణ లేకుండా ఎక్కువకాలం స్టెరాయిడ్లు, పెయిన్‌కిల్లర్లు వాడటం ప్రమాదకరమని హెచ్చరించారు. వివాహం, గర్భధారణ, తల్లిపాలు ఇచ్చే సమయంలోనూ వైద్యుల సూచనలతో తగిన చికిత్స తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ సుధీర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ పొన్నాల రాజు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## డిజిటల్ యుగంలో అప్రమత్తత అవసరం: వీసీ ఉమేష్‌కుమార్



**కరీంనగర్ కల్చరల్, (జనం సాక్షి):** శాతవాహన విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల సెమినార్ హాల్‌లో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీసీ ఆచార్య యు. ఉమేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డిజిటల్ యుగంలో సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను వినియోగించే టప్పుడు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. న్యాయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.డీఎస్ఎల్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్ మాట్లాడుతూ జీవితంలో చట్టాల ప్రాధాన్యతను వివరించారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగం, ర్యాగింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి. సతీష్‌కుమార్ ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. సైబర్ క్రైమ్ అధికారి మహేశ్ డిజిటల్ నేరాలు, సైబర్ మోసాలు, డిజిటల్ గోప్యతపై అవగాహన కల్పించారు. యాంటీ డ్రగ్స్ జిల్లా అధికారి పుల్లయ్య మత్తు పదార్థాల దుష్పరిణామాలను వివరించారు. షీ టీమ్స్ అధికారి స్వప్న మహిళల రక్షణ, వేధింపుల నివారణకు చేపడుతున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు బి. అనిల్‌సింగ్, పి. ప్రియ రాఘవేంద్రతో పాటు అధ్యాపకులు, న్యాయ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి అజాహారుద్దీన్
- ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ పాలన
- సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం
- జగిత్యాలను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలి



**జగిత్యాల బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మైనారిటీ వెల్ఫేర్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ మంత్రి అజాహారుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రాంతం నిజాం పాలన నుంచి విముక్తి పొంది భారతదేశంలో అంతర్భాగమైన చారిత్రక ఘట్టానికి 78 ఏళ్లు పూర్తయ్యాయని తెలిపారు. నాటి పోరాటాలు, త్యాగాలు, స్వాభిమాన ఆకాంక్షలు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజాస్వామ్య విలువలు, పారదర్శకత, జవాబుదారీతనం, సామాజిక న్యాయానికి ప్రాధాన్యమిస్తూ ప్రజలకు చేరువగా పాలన అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం సెప్టెంబర్ 1 నాటికి 1,000 రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకుందని, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధికి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. 'తెలంగాణ రైజింగ్-2047' ద్వారా 2034 నాటికి రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమతుల్య అభివృద్ధి సాధించడంతో పాటు జగిత్యాల జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ పాలన అందించాలి

**చేవెళ్ల, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక, బాధ్యతాయుత పాలన అందించాలని చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా గురువారం ఆర్డీవో కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17కు తెలంగాణ చరిత్రలో ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని సత్వర పరిష్కారం చూపేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అర్హులైన వారికి సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, పోలీసు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి

### సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి పిలుపు



**యైటింక్లైన్ కాలనీ, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఇంధన అవసరాలను సమర్థవంతంగా తీర్చడం ద్వారా రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధిలో సింగరేణి కీలక పాత్ర పోషించాలని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అన్నారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశాలున్నందున, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గును తగినంతగా సరఫరా చేస్తూ రాష్ట్ర ఇంధన భద్రతకు సింగరేణి మరింతగా అండగా నిలవాలని పిలుపునిచ్చారు.తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా గురువారం సింగరేణి భవన్‌లో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధితో పాటు దేశ పురోభివృద్ధిలో ప్రతి ఉద్యోగి తనవంతు బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తించాలని కోరారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణికి ప్రత్యేక స్థానం ఉందని సీఎండీ పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధి, రాష్ట్ర ప్రయోజనాలు, దేశ పురోగతిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.సింగరేణి సాధిస్తున్న విజయాల్లో కార్మికులు, ఉద్యోగులు, అధికారులు, యూనియన్ నాయకులందరి భాగస్వామ్యం ఉందని పేర్కొన్న ఆయన, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జీఎం (కో-ఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అవమానించడంతో వ్యక్తి ఆత్మహత్య

## కుమార్తె వివాహం కోసం రూ.లక్ష అప్పు

- పందుల విక్రయంపై పెద్దల సమక్షంలో పంచాయితీ
- అవమానం తట్టుకోలేకనే ఆత్మహత్య చేసుకున్నాడు.. కుటుంబ సభ్యుల ఫిర్యాదు
- మల్లయ్యపై కేసు.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**కరీంనగర్ క్రైమ్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల గ్రామానికి చెందిన బిజిలి రాజయ్య (45) అప్పు విషయంలో అవమానానికి గురై తీవ్ర మనోవేదనతో ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదైంది. కరీంనగర్ రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. రాజయ్య తన కుమార్తె వివాహం కోసం రెండేళ్ల క్రితం గర్రేపల్లికి చెందిన బిజిలి మల్లయ్య వద్ద రూ.లక్ష అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లింపులో జాప్యం కావడంతో మల్లయ్య డబ్బుల కోసం ఒత్తిడి చేసినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో రాజయ్య వద్ద ఉన్న పందులను మార్కెట్ ధర కంటే తక్కువకు తీసుకోవడంపై గర్రేపల్లిలో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. పందుల ధరను రూ.35 వేలుగా నిర్ణయించి, మిగిలిన రూ.65 వేలను నాలుగు నెలల్లో చెల్లించేలా ఒప్పందం కుదిరింది. గడువులోపు డబ్బు చెల్లించకపోతే అవమానకరంగా ఇబ్బంది పెడతానని, ఇంటికి వచ్చి తాళం వేస్తానని మల్లయ్య బెదిరించినట్లు రాజయ్య కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో మనోవేదనకు గురైన రాజయ్య మరుసటి రోజు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు మల్లయ్యపై కేసు నమోదు చేసి, సాక్షుల వాంగ్మూలాలను వీడియో రికార్డింగ్‌తో సహా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ అనుముల నిరంజన్‌రెడ్డి తెలిపారు. మృతదేహానికి పంచనామా, శవపరీక్ష అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## కాపర్ వైర్ దొంగల ముఠా అరెస్ట్

**మల్యాల సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** మండలంతో పాటు జగిత్యాల జిల్లాలో పలు మండలాల్లో రైతుల వ్యవసాయ పొలాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి,అందులోని కాపర్ వైర్లను దొంగిలిస్తున్న ముఠాలో నలుగురిలో ఎ1తపాలా బాబు పరారీలో ఉన్నాడని ముగ్గురు ఎ2 కోట శ్రీను ఏ గండికోట శ్రీను,ఎ3 పల్లపు సురేష్,ఎ4 సూర సురేష్ మల్యాల పోలీసులు గురువారం పట్టుకుని వారి వద్ద నుండి ప్యాసింజర్ ఆటో ,మొబైల్ ఫోన్ ,కాపర్ వైర్ 39 కిలోలు,ట్రాన్స్‌ఫార్మర్లను తెరవడానికి ఉపయోగించిన పరికరాలు,సామగ్రి పానలు స్వాధీనం చేసుకున్నట్లు ఎ1 తపాలా బాబును పట్టుకునేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామని సీఐ మాదాసు రాజ్ కుమార్ ప్రకటనలో తెలిపారు.నిందితులు మల్యాల,వెల్గటూర్, ధర్మపురి,గొల్లపల్లి, బుగ్గారం మండలాల్లోని వివిధ గ్రామాల్లో మొత్తం 9 దొంగతనాలకు పాల్పడి,10 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్లను దొంగిలించినట్లు విచారణలో తెలిపారని.కేసును చేధించడంలో కృషి చేసిన ఎస్సై సందీప్ కుమార్, కానిస్టేబుల్స్ రాజేందర్, ఆంజనేయులు, విక్రాంత్ మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారని తెలిపారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి బ్యాంక్ సేవలు ఎంతో దోహదపడతాయి

- సుందరగిరిలో ఘనంగా ఇండియన్ బ్యాంక్ ప్రారంభోత్సవం
- బ్యాంకు ప్రారంభోత్సవానికి హాజరైన డిఆర్డిఓ పిడి మచ్చ గీత
- ఖాతాదారులకు నమ్మకమైన సేవలు అందించడమే ఇండియన్ బ్యాంకు యొక్క ప్రధాన లక్ష్యమన్న బ్యాంక్ జోనల్ మేనేజర్ సుధాకర్ రావు





**చిగురుమామిడి సెప్టెంబర్ 17(జనంసాక్షి):** మహిళల ఆర్థిక అభివృద్ధికి బ్యాంకు సేవలు ఎంతో దోహదపడతాయని,బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకొని హార్థిక అభివృద్ధి చెందాలని కరీంనగర్ డిఆర్డిఓ పిడి మచ్చ గీత పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో అత్యాధునిక సదుపాయలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ బ్యాంక్ ను ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కరీంనగర్ డిఆర్డిఓ పిడి మచ్చ గీత మాట్లాడుతూ మహిళలు స్వయం సమృద్ధి సాధించడంలో బ్యాంకుల పాత్ర కీలకమన్నారు.గ్రామీణ ప్రాంత మహిళలు ఇండియన్ బ్యాంక్ అందిస్తున్న వివిధ రకాల రుణ సదుపాయాలను,ఆర్థిక సేవలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత ఎదగాలని వారు పిలుపునిచ్చారు.సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలో అత్యాధునిక వసతులతో బ్యాంక్ ఏర్పాటు కావడం వల్ల స్థానిక ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయని హర్షం వ్యక్తం చేశారు.గ్రామీణ ప్రాంతాల ప్రజలకు,రైతులకు బ్యాంకింగ్ సేవలు మరింత చెంతకు చేరడం సంతోషకరమన్నారు.అనంతరం ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ సుధాకరా రావు మాట్లాడుతూ ఖాతాదారులకు వేగవంతమైన,నాణ్యమైన, నమ్మకమైన సేవలు అందించడమే ఇండియన్ బ్యాంకు యొక్క ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఆధునిక సాంకేతికతతో కూడిన సేవలను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు బ్యాంక్ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణారెడ్డి,హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్, బ్యాంకు మేనేజర్ బాబు,ఐకెపి ఏపీఎం రజిత,సర్పంచులు ఆకవరం భవాని శివప్రసాద్,అలవాల శంకర్,గుళ్ళ రజిత రాజు, ఉపసర్పంచ్ లు మెడబోయిన రాజు,ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, మాజీసర్పంచ్ శ్రీమూర్తి రమేష్, బ్యాంక్ అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా 'స్వచ్ఛత హీ సేవా 2026' ప్రారంభం

- పోస్టర్‌ను ఆవిష్కరించిన మేయర్ శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్.




**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు "స్వస్థత హీ సేవా2026" కార్యక్రమం అత్యంత ఘనంగా ప్రారంభమైంది. గురువారం రోజు నగరపాలక సంస్థ కార్యాలయం లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, పాలకవర్గ సభ్యులతో కలిసి సంబంధిత పోస్టర్, ఫ్లెక్సీని ఆవిష్కరించి లాంచనంగా ప్రారంభించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు నగరాన్ని సుందరంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని డివిజన్లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. క్లీన్ సిటీ లక్ష్యంగా ప్రజల భాగస్వామ్యంతో పాలకవర్గ సభ్యుల సహకారంతో నగర వ్యాప్తంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... పట్టణ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటేనే నగర ప్రజలు ఆరోగ్యంగా జీవిస్తారని, కరీంనగర్ నగరాన్ని" క్లీన్ సిటీ"గా మార్చడమే లక్ష్యంగా మా పాలకవర్గం పని చేస్తుందని తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పారిశుధ్యం విశేష మార్పులు తీసుకొచ్చి నగర పరిశుభ్రతను మరింత మెరుగు పరుస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన " స్వచ్ఛతా హీ సేవా" కార్యక్రమంలో నగర వ్యాప్తంగా అన్ని డివిజన్లలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టడం జరుగుతుందని తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో నగరంలోని గార్బేజ్ పాయింట్లను పూర్తిగా తొలగించడంతో పాటు పర్యటన ప్రదేశాలు, వీధులు, పరిసరాలను శుభ్రపరచడం జరుగుతుందని తెలిపారు. ఇళ్లలోనే తడి, పొడి చెత్తను వేరుచేయడంపై ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. నగరంలోని ప్రజా మరుగుదొడ్లను నిరంతరం పరిశీలిస్తూ, వాటిని శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. 'ఏక్ దిన్ - ఏక్ ఘంట - ఏక్ సాత్' నినాదంతో ప్రజా భాగస్వామ్యంతో శ్రమదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించడం, సఫాయి మిత్రుల సంక్షేమమే ధ్యేయంగా పారిశుధ్య కార్మికుల కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. అంతే కాకుండా కార్మీకులకు ఉచితంగా హెల్త్ కార్డులు జారీ చేయడం, బీమా సదుపాయం కల్పించడంతో పాటు పిపి ఇ కిట్లను పంపిణీ చేస్తామని తెలిపారు. స్వచ్ఛ భారత్ దివాస్ కార్యక్రమంలో సమావేశం ఏర్పాటు చేసి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఘన వ్యర్థాల నిర్వహణ) నూతన నిబంధనలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. నగర ప్రజలందరూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా భాగస్వాములై కరీంనగర్‌ను దేశంలోనే అగ్రగామి "క్లీన్ సిటీ"గా మార్చాలని పిలుపు నిచ్చారు. నగరపాలక సంస్థ ద్వారా చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములై క్లీన్ సిటీగా మార్చేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి కల్పనే నా ధ్యేయం

▫ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ప్రధాన ధ్యేయమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం యాదాద్రి కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత చదువులు చదివిన ఎంతోమంది యువతకు సరైన ఉద్యోగ అవకాశాలు లభించకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగాలు లేక యువతతో పాటు వారికి కుటుంబాలు తీవ్ర మానసిక వేదన అనుభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారి భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకే కోదాడలో మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ జాబ్ మేళాకు దాదాపు 300 ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నాయని, సుమారు 3,000 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలో ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, కుంభం అనిల్ కుమార్ రెడ్డిలకు రాజకీయాల్లో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా ప్రాజెక్టులకు నిధులు.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకపోయినప్పటికీ, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కొరత లేకుండా చూస్తున్నామని మంత్రి తెలిపారు. గంధమల్ల ప్రాజెక్టు పనుల కోసం ఇప్పటికే రూ.130 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బునాదిగాని, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాల్వలకు సైతం నిధులు కేటాయించామన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లు సహా అనుసంధాన కాల్వల నిర్మాణ పనులన్నింటినీ వచ్చే ఎన్నికల లోపే శరవేగంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి కలెక్టర్ భాస్కర్ రావు, ఎస్పీ అక్షాంష్ యాదవ్, భువనగిరి ఆర్డీవో మాలి కృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ గ్రేడ్ కలెక్టర్ లు కృతిక, సాత్విక్ లు పాల్గొన్నారు.

# యాదాద్రికి ఒడిశా నైనీ బొగ్గు సరఫరా పెంపుపై సింగరేణి ఫోకస్

▫ రోజుకు 10 వేల నుంచి 14 వేల టన్నుల రవాణా లక్ష్యంగా చర్యలు

▫ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి కీలక ఆదేశాలు

▫ అంగూల్ జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని రవాణా మరింత పెంచాలని సూచన




**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలో అన్ని థర్మల్ కేంద్రాలకు బొగ్గు సరఫరా పెంచేందుకు వీలుగా బొగ్గు ఉత్పత్తిని పెంచాలని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సింగరేణి ఏరియా జీఎంలను ఆదేశించారు. రాష్ట్రంలో అతిపెద్ద జెన్ కో థర్మల్ విద్యుత్ ప్లాంట్ అయిన యాదాద్రికి ఒడిశాలోని నైనీ నుంచి బొగ్గు సరఫరాను మరింతగా పెంచాలన్నారు. ప్రస్తుతం నైనీ నుంచి రోజుకు సగటున సుమారు 2,100 టన్నుల బొగ్గు రవాణా జరుగుతుండగా, దీనిని దశలవారీగా రోజుకు 10 వేల నుంచి 14 వేల టన్నుల స్థాయికి పెంచేందుకు అన్ని చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ ఇంధన అవసరాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాను మరింత పెంచేలా చూడాలన్నారు. గురువారం మధ్యాహ్నం సింగరేణి డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) ఒడిశాలోని నైనీ ఏరియా జీఎంతో బొగ్గు ఉత్పత్తి, నిల్వలు, రవాణా పరిస్థితులపై సీఎండీ కూలంకషంగా సమీక్షించారు. ముఖ్యంగా యాదాద్రి విద్యుత్ కేంద్రానికి నైనీ బొగ్గు సరఫరా పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని, రవాణా ప్రక్రియలో ఎదురవుతున్న అవరోధాలను గుర్తించి వాటిని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. నైనీ గని వద్ద రవాణాకు అవసరమైన మేర బొగ్గు నిల్వలు అందుబాటులో ఉన్నాయని నైనీ జీఎం శ్రీ బైద్య సీఎండీకి వివరించారు. స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం రాత్రి వేళల్లో లారీల ద్వారా బొగ్గును రైల్వే సైడింగ్‌లకు తరలిస్తున్నట్లు జీఎం తెలిపారు. దీనిపై స్పందించిన సీఎండీ, అందుబాటులో ఉన్న బొగ్గును సాధ్యమైనంత వేగంగా రైల్వే సైడింగ్‌లకు తరలించేందుకు లారీల సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ విషయంలో రాష్ట్ర జెన్ కో తో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న రవాణా ఏర్పాట్లు సరిపోని పక్షంలో అవసరమైన మేరకు కొత్త రవాణా కాంట్రాక్టులను ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. బొగ్గు రవాణాను రోజుకు 10 వేల నుంచి 14 వేల టన్నుల స్థాయికి తీసుకెళ్లేందుకు అవసరమైన అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని సీఎండీ సూచించారు. ముఖ్యంగా ఒడిశా అంగూల్ జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని, రోడ్డు మార్గంలో బొగ్గు తరలింపునకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. రైల్వే సైడింగ్ వద్ద రైల్వే రేకులను అందుబాటులో ఉండేలా చూడటం తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని ఈడీ (కోల్ మూవ్‌మెంట్)కు సూచించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి నైనీ నుంచి సరఫరాను పెంచేందుకు సంబంధిత విభాగాలన్నీ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత ఏర్పడకుండా చూడటంలో ప్రతీ ఒక్కరూ పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు (పీ అండ్ పీ), గౌతమ్ పోట్రు (పర్సనల్, ఫైనాన్స్), ఈడీ(కోల్ మూవ్ మెంట్) బి.వెంకన్న, జీఎం (కో ఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ అభివృద్ధికి పునరంకితం కావాలి**

తెలంగాణ రాష్ట్ర ఇంధన అవసరాలను సమర్థవంతంగా తీర్చడం ద్వారా రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధిలో సింగరేణి తనవంతు కీలక పాత్ర పోషించాలని సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అన్నారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశాలు ఉన్నందున, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గును తగినంతగా సరఫరా చేస్తూ రాష్ట్ర ఇంధన భద్రతకు సింగరేణి మరింతగా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా గురువారం సింగరేణి భవన్‌లో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధితో పాటు దేశ పురోభివృద్ధిలో ప్రతీ ఉద్యోగి తనవంతు బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తించాలని కోరారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణికి ప్రత్యేక స్థానం ఉందని సీఎండీ పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధి, రాష్ట్ర ప్రయోజనాలు, దేశ పురోగతిని దృష్టిలో పెట్టుకొని ప్రతీ ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సింగరేణి సాధిస్తున్న విజయాల్లో కార్మికులు, ఉద్యోగులు, అధికారుల, యూనియన్ నాయకుల అందరి భాగస్వామ్యం ఉందని పేర్కొంటూ, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ మరింత మెరుగైన ఫలితాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో ఈడీ(కోల్ మూవ్ మెంట్) శ్రీ బి.వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన కీసర సీఐ, ఎస్సై



**కీసర (జనంసాక్షి) :** మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్ కేంద్రంగా సాగుతున్న భారీ లంచావతారానికి అవినీతి నిరోధక శాఖ అధికారులు తెరదించారు. ఒక కేసు వ్యవహారంలో సీఐ ఆంజనేయులు ఆదేశాల మేరకు రూ.5 లక్షల లంచం తీసుకుంటూ ఎస్సై జ్ఞానేందర్ రెడ్డి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అనంతరం కీసర పోలీస్ స్టేషన్‌లో సుదీర్ఘంగా సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు, లంచం నగదును రికవరీ చేసి సీఐ ఆంజనేయులు, ఎస్సై జ్ఞానేందర్ రెడ్డి ఇద్దరినీ అరెస్ట్ చేశారు. వీరిద్దరి అరెస్టుతో కీసర పరిసర ప్రాంతాల్లో ఒక్కసారిగా సంచలనం రేగగా, పోలీస్ స్టేషన్ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. అవినీతి అధికారులైన సీఐ, ఎస్సైలు ఏసీబీకి చిక్కడంపై స్థానిక ప్రజల్లో అనూహ్య స్పందన వ్యక్తమైంది. గత కొంతకాలంగా వివిధ వివాదాలు, కేసుల పరిష్కారం కోసం వీరిద్దరూ లంచాల పేరిట ప్రజలను తీవ్రంగా వేధించారని ఆగ్రహం వ్యక్తం చేసిన కీసర, బోగారం గ్రామస్తులు పోలీస్ స్టేషన్ ఎదుటే బాణాసంచా కాల్చి, సంబరాలు జరుపుకున్నారు. లంచాల కోసం పీడించే అధికారులకు తగిన శాస్తి జరిగిందంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

**ఏసీబీకి చిక్కిన చేవెళ్ల సబ్ ట్రెజరరీ అధికారులు**

**రంగారెడ్డి (జనంసాక్షి) :** జిల్లాలోని చేవెళ్ల డివిజనల్ సబ్ ట్రెజరరీ కార్యాలయానికి చెందిన ఇద్దరు అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. సస్పెన్షన్ కాలపు జీతం బిల్లులను , పదవీ విరమణానంతర పెన్షన్ సర్దుబాటు బకాయిల మొత్తాన్ని ప్రాసెస్ చేసి, ఫార్వార్డ్ చేసేందుకు ప్రతిఫలంగా ఫిర్యాదుదారుడి నుంచి సబ్ ట్రెజరరీ అధికారి మాదిగ లక్ష్మయ్య, అసిస్టెంట్ ట్రెజరరీ అధికారి కావలి అనురాధ రూ.2.50 లక్షలు డిమాండ్ చేశారు. వీటిలో మొదటి విడతగా లక్ష రూపాయలు ఒప్పందం చేసుకున్నారు. దీంతో ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో గురువారం ఏసీబీ అధికారులు కార్యాలయంపై దాడి చేసి ముగ్గురిని పట్టుకున్నారు. వీరికి మధ్యవర్తిగా ఉన్న వడ్డె జంగయ్య అనే వ్యక్తికి లక్ష రూపాయలు అందించగా వీటిలో రూ.50 వేలు అధికారులు, మిగతా రూ.50 వేలు మధ్యవర్తి లంచంగా తీసుకున్నారు. ముగ్గురు వద్ద నుంచి లక్ష రూపాయలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి నాంపల్లి జుడీషియల్ కోర్టులో హాజరు పరిచినామని ఏసీబీ అధికారులు వివరించారు.

# దేవ శిల్పి విశ్వకర్మ

▫ ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్



**మావల సెప్టెంబర్ 18(జనం సాక్షి) :** సమాజ అభివృద్ధిలో వృత్తి నైపుణ్యాలు కలిగిన విశ్వకర్మల పాత్ర ఎంతో కీలకమని, వారి సంక్షేమానికి ప్రభుత్వం సముచిత ప్రాధాన్యతనిస్తోందని ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. గురువారం ఆదిలాబాదు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారులు మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో శ్రమకు, సాంకేతికతకు రూపమిచ్చిన విశ్వకర్మ సేవలు చిరస్మరణీయమని, వారి అభ్యున్నతికి ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. మహనీయుల జయంతి, వర్ధంతి ఉత్సవాల ద్వారా భవిష్యత్ తరాలకు వారి సేవలు తెలియజేయవచ్చని, తద్వారా యువత మంచి మార్గాన్ని ఎంచుకునే ఆస్కారం ఉందన్నారు. ప్రతి ఒక్కరు జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. సమాజానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న చేతివృత్తుల వారిని అన్నివిధాలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. జిల్లాలో విశ్వకర్మ వంశీయుల అభ్యున్నతికి, ప్రభుత్వ పథకాలు అర్హులైన అందరికీ అందేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విశ్వకర్మ రుణాలను సైతం అందించడం జరుగుతుందని, యువత వారి వృత్తిగత నైపుణ్యాలను మెరుగుపరచుకొని ఆర్థికంగా బలపడాలని ఆకాంక్షించారు. స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ.. కులవృత్తులను నమ్ముకుని జీవిస్తున్న వారి సంక్షేమం కోసం అందరం ఐక్యంగా కృషి చేయాలన్నారు. ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అంతకుముందు అతిథులందరూ కలిసి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, ఎస్.రాజేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషా, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారి సునీత కుమారీ, ఈడీ మనోహర్, వివిధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు నాంపల్లి కోర్టుకు కేటీఆర్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నేడు నాంపల్లి కోర్టులో విచారణకు హాజరుకానున్నారు. హైప్రొఫైల్‌గా మారిన ఫార్ములా–ఈ కార్ రేసింగ్ కేసుకు సంబంధించి ఆయన కోర్టు ముందు విచారణకు రావాల్సి ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో హైదరాబాద్ నగరంలో నిర్వహించిన ఫార్ములా–ఈ కార్ రేసింగ్ నిర్వహణకు సంబంధించి నమోదైన కేసుకు సంబంధించి విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే విచారణలో భాగంగా కేటీఆర్ నాంపల్లి కోర్టుకు రానున్నారు. కేసు విచారణకు హాజరు కావాల్సిన నేపథ్యంలో ఆయన కోర్టుకు హాజరు కాబోతున్నట్లుగా తెలుస్తోంది.

# మహేష్ గౌడ్, అద్దంకి దయాకర్‌లపై హరీశ్ రావు పరువునష్టం దావా

**హైదరాబాద్ (జనంసాక్షి) :** చేతబడులు, క్షుద్ర పూజల పేరుతో తనపై తీవ్రమైన, నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు న్యాయపోరాటానికి దిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వారికి లీగల్ నోటీసులు జారీ చేసిన హరీశ్ రావు, వారు బహిరంగ క్షమాపణ చెప్పకపోవడంతో ప్రజాప్రతినిధుల కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాప్రతినిధుల నాంపల్లి కోర్టులో కాంగ్రెస్ నేతలపై క్రిమినల్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. తన రాజకీయ ప్రతిష్టను, వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు కాంగ్రెస్ నేతలు అసత్య ఆరోపణలు చేశారని ఇప్పటికే హరీష్ రావు పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో వర్షాలు పడకుండా అడ్డుకునేందుకు హరీశ్ రావు వేర్వేరు ప్రాంతాలు, ఆలయ సందర్శనలు చేసి క్షుద్ర పూజలు నిర్వహించారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.

## గుప్తనిధుల తవ్వకాల కేసులో అదుపులోకి 15 మంది

**సూర్యాపేట (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల పరిధిలో గుప్తనిధుల తవ్వకాల వ్యవహారం కలకలం రేపింది. మండలంలోని అనాజిపురం రెవెన్యూ గ్రామం రాజ్‌పేట శివారులో ఉన్న నిజాం కాలం నాటి పురాతన మసీదు పరిసర ప్రాంతంలో రహస్యంగా తవ్వకాలు జరుపుతున్నారనే అనుమానాలపై సుమారు 15 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి సమయంలో పురాతన కట్టడం పరిసర ప్రాంతంలో కొంతమంది వ్యక్తుల కదలికలు అనుమానాస్పదంగా కనిపించాయి. దీనిని గమనించిన స్థానిక రైతులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని, తవ్వకాలకు ప్రయత్నిస్తున్నట్లు అనుమానిస్తున్న సుమారు 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అదుపులోకి తీసుకున్న వారిలో ఇదే మండలానికి చెందిన దోసపహాడ్, అనాజిపురం గ్రామాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు సమాచారం.

# అమరవీరుల త్యాగాలతోనే హైదరాబాద్ విమోచన

▫ ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్



**హైదరాబాద్ (జనం సాక్షి) : అమరుల త్యాగాలతోనే హైదరాబాద్** విమోచన జరిగిందని ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 'హైదరాబాద్ విమోచన దినోత్సవ' వేడుకల్లో భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థాన విమోచన పోరాటం కేవలం నాయకులకు మాత్రమే పరిమితం కాదని, ఆదివాసీలు, రైతులు, విద్యార్థులు, సామాన్యులు ప్రాణాలర్పించిన ప్రజా ఉద్యమమని కొనియాడారు. రాంజీ గోండ్, తుర్రేబాజ్ ఖాన్, కొమురం భీం వంటి వీరుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. అసాధ్య మనుకున్న హైదరాబాద్ విలీనాన్ని సుసాధ్యం చేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ దృఢ సంకల్పాన్ని ఆయన కొనియాడారు. రాజకీయ విలీనం భూభాగా లను కలిపితే, రాజ్యాంగ ప్రజాస్వామ్యం ప్రజలందరినీ ఏకం చేస్తుందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, వామపక్ష తీవ్రవాద అణచివేతకు కేంద్ర సాయుధ బలగాలు విశేష కృషి చేశాయని ప్రశంసించారు.

# బెంగళూరులో భార్యపై భర్త యాసిడ్ దాడి..

▫ అనంతరం కత్తితో పొడిచి హత్యాయత్నం

**బెంగళూరు (జనంసాక్షి) :** కర్ణాటక రాజధాని బెంగళూరులో దారుణం జరిగింది. భార్యపై భర్త యాసిడ్‌తో దాడి చేశాడు. అనంతరం కత్తితో పొడిచి హత్య చేసేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటన బెంగళూరు, జేపీ నగర్ పరిధిలో గురువారం ఉదయం 9.15 గంటలకు జరిగింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. పశ్చిమ బెంగాల్‌కు చెందిన 26 ఏళ్ల మహిళ స్థానికంగా ఒక ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తోంది. ఉదయం హాస్పిటల్ నుంచి బ్రేక్‌ఫాస్ట్ కోసం బయటకు వస్తున్న సమయంలో ఆమె భర్త అక్కడికి వెళ్లి ఆమెపై యాసిడ్‌తో దాడి చేశాడు. దీంతో భయపడి పోయిన ఆమె తప్పించుకునేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో ఆమెను భర్త వెంబడిస్తూ వెళ్లాడు. చివరకు బేస్‌మెంట్‌లో ఆమెపై కత్తితో దాడి చేశాడు. పలుసార్లు పొడిచాడు. దీంతో తీవ్ర గాయలయ్యాయి. రక్తస్రావం జరిగింది. దగ్గర్లోనే ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్స్ వెంటనే అక్కడికి చేరుకున్నారు. భర్తను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన మహిళను స్థానిక ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఘటన సమయంలో కొందరు అక్కడే ఉన్నా.. అతడిని అడ్డుకుంటే తమపై కూడా కత్తితో దాడి చేస్తారేమోనని భయపడి దూరంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. భార్యాభర్తలు ఇద్దరిమధ్యా విభేధాల కారణంగా కొంతకాలంగా విడిగా ఉంటున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. పూర్తి స్థాయి వివరాలు దర్యాప్తు అనంతరం అందిస్తామని, నిందితుడికి తగిన శిక్ష పడేలా చేస్తామని పోలీసులు వివరించారు.

# తెలంగాణ విలీన పోరాట స్ఫూర్తితో ఆరాచక శక్తులను గద్దె దించుతాం

▫ సెప్టెంబర్ 17కు బీజేపీకి, ఆర్ఎస్ఎస్‌కు సంబంధమే లేదు

▫ కాంగ్రెస్, బీజేపీ చెప్పేవన్నీ అబద్ధాలే


▫ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత




**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ విలీన పోరాట యోధుల స్ఫూర్తితో రాష్ట్రంలో రాజ్యమేలుతున్న అరాచక శక్తులను గద్దె దించుతామని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 అనేది తెలంగాణ పౌరుషానికి, పోరాట పటిమకు మరియు త్యాగాల చరిత్రకు నిదర్శనం అన్నారు. అయితే ఈ చారిత్రక రోజుపై కాంగ్రెస్, బీజేపీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. సెప్టెంబర్ 17 చరిత్రను కాంగ్రెస్, బీజేపీలు వక్రీకరిస్తున్నాయని కవిత విమర్శించారు. స్టేట్ కాంగ్రెస్ పోరాటం వల్లే తెలంగాణ విలీనమైందని సీఎం అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. నిజానికి సంస్థానాల్లో పోరాటం చేయడం తమ విధానం కాదని నాడు గాంధీజీ అన్నారని కవిత గుర్తుచేశారు. నిజాం సర్కార్ పేదలకు ఇచ్చిన 10 లక్షల ఎకరాల భూమిని, భారత యూనియన్‌లో కలిశాక తిరిగి జమీందార్లకు అప్పగించిందే కాంగ్రెస్ అని ఆరోపించారు. ఇక ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటమని బీజేపీ మత రంగు పులిమే ప్రయత్నం చేస్తోందని కవిత ధ్వజమెత్తారు. ఆనాటి పోరాటంలో అసలు బీజేపీ, ఆర్ఎస్ఎస్ లేనే లేవని స్పష్టం చేశారు.

**ప్రజలే తుపాకీ పట్టి పోరాడారు:**

ఆనాటి జాగీర్‌దార్లు, జమీందార్ల దాష్టీకాలకు వ్యతిరేకంగా మతాలకు అతీతంగా ప్రజలే స్వచ్ఛందంగా పోరాడారని కవిత తెలిపారు. వట్టికోట ఆళ్వార్ స్వామి, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి లాంటి మహనీయులు సైకిళ్లపై తిరుగుతూ ప్రజల్లో చైతన్యం నింపారని గుర్తుచేశారు. కాళోజీ, దాశరథి, షోయాబుల్లాఖాన్, మగ్దూం మొయినోద్దీన్ వంటి కవులు, రచయితలు సమరశంఖం పూరించారని కొనియాడారు. వారి చైతన్యంతోనే దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, మల్లు స్వరాజ్యం, అరుట్ల కమలాదేవి లాంటి వీరులు ఉద్భవించారని పేర్కొన్నారు. నాడు మహనీయులు చూపిన పోరాట స్ఫూర్తితోనే, ప్రస్తుతం కులమతాలకు అతీతంగా ప్రజల హక్కులను కాపాడేందుకు తెలంగాణ రక్షణ సేన ముందుకు వచ్చిందని, అరాచక పాలనకు అంతం పలికే వరకు పోరాటం కొనసాగుతుందని అన్నారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370